ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డాక్టర్ ప్రణవ్ పండ్యా
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య

సంపుటి 15 - సంచిక 10
**మార్చి 2011**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

*Please send Drafts & Money Orders in favour of*
**"SRI VEDAMATA GAYATRI TRUST"**
**GAYATRI CHETANA KENDRAM**
H.P. Road, Moosapeta,
Near Aswini House, Hyderabad-18.


## హోలి యొక్క తరంగాలు

హోలి వచ్చింది అంటే ఒక తరంగం ఉవ్వెత్తున లేస్తుంది. అది తాకగానే అంతరాళంలో ఆనందానుభూతి వెల్లివిరుస్తుంది. హోలి అనబడే ఉల్లాసభరిత మహాసముద్రంలో కూడా తరంగాలు ఎగసిపడుతుంటాయి. జీవితంలోని ప్రతి అంకురము నుండి కొత్త రెమ్మలు విప్పారతాయి. చిందులు వేసే మనస్సు ఆ ఉల్లాసాన్ని పంచుకోవాలని ఉవ్విళ్ళూరుతుంది.

ప్రేమానుభూతిలో పరవశించిపోయే ఈ సమయం మహత్తరమైనది. జీవితంలో అనేక భావాలు పల్లవిస్తాయి, మరల ముడుచుకుపోతూ వుంటాయి. వీటి ప్రభావము పరిమితమైనది. సంతోషం మిగిలిన రోజులలో కూడా వుంటుంది. మిగతా రోజుల్లో కూడా ప్రేమరసం తొణికిసలాడుతూ వుంటుంది. కానీ దీని పరిధి వ్యక్తిగతమైనది. అది కుటుంబము వరకే పరిమితమై వుంటుంది. కానీ హోలీలో ప్రేమ, సముద్రమువలె ఉప్పొంగుతుంది. ఇందులోని ఏ అల వచ్చి తాకినా జాతి, ధర్మము, వంశము, ఎక్కువతక్కువ తారతమ్యాలు, పేద-గొప్ప తేడాల వంటి భేదభావాలు సమసిపోతాయి. హోలి యొక్క ఉల్లాసము వృద్ధిచెంది వికసితమవ్వడము చాలా ముఖ్యము. అది ఎంత ప్రబలమైతే జీవనసాధన అంత బలంగా జరుగుతుంది.

ప్రేమ అనే మహాశక్తిని అమర్యాదగా ఉపయోగించినా లేక హద్దులు విధించినా అమంగళకరమైన ప్రతిక్రియలు ఉత్పన్నమౌతుంది. హోలీ యొక్క తరంగాలు జీవనసాధనను స్పృశించి సునియోజితంగా, సువ్యవస్థితంగా మారిపోతాయి. ఆ తరువాత ఆ ధారను ఎక్కడ ఎంతవరకు ప్రవహింపచేయాలో అక్కడ అంతవరకే ప్రవహింపచేయవచ్చు. ఇలా కనుక చేయగలిగితే ప్రపంచంలో వివిధరకాల వైషమ్యాలు నశించి హోలీ వంటి రంగురంగుల రూపం ఆనందాన్ని కలిగిస్తూ మనముందు నిలబడుతుంది. మనస్సులో దు:ఖము వుంటే స్నేహమనే గులాల్‌పొడి చల్లబరుస్తుంది. అంతే ఆనందము వచ్చేస్తుంది. ఎవరు దగ్గరికి వచ్చినా మనస్సులోని చెడును తీసివేసి వారిపైన ప్రేమను చిలకరించాలి. రెండూ కలిసిపోయి హోలీతరంగాలు ఈ విధంగా మనల్ని తడిపితే జీవితమందలి ప్రతిక్షణం రంగులమయమైపోతుంది.


పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు.
**9949111175**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**


పరమాత్మ ఉపాసనతో కోరికలను జోడించడం తగని పని.

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** హోలి 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** ప్రశాంతమైన ఆలోచనల శక్తి 2
3. **వేదమంత్రం :** అమరత్వం 3
4. **వర్తమానభారతం :** నలువైపుల నుండి మార్పు-మార్పు అని వినపడుతున్నది 4
5. **గాయత్రీ విద్య-6 :** త్రిపద గాయత్రి మూడు చరణాలు 7
6. **బాలల భవితకు బంగారు బాట-17 :** ఆలోచించు - అహంకారాన్ని దించు 9
7. **ధారావాహిక ప్రశ్నోపనిషద్ : ప్రథమ మండలం - చతుర్ధోధ్యాయం :** కర్తవ్య పరాయణత 10
8. **యుగ గీత-7 : రెండవ అధ్యాయం-సాంఖ్య యోగము :** పరమాత్మలో అధిష్ఠితులైన వారే స్థితప్రజ్ఞులు 12
9. **సూర్య విజ్ఞానం - 6 :** వైదిక వాఙ్మయంలోని సూర్యుని మహత్యం 16
10. **జన్మ శతాబ్ది ప్రత్యేకం :** గురుదేవుల అణువణువున కరుణే 18
11. **జన్మ శతాబ్ది ప్రత్యేకం :** సత్యయుగ పునరాగమనం 21
12. **గాయత్రీ 24 శక్తి ధారలు (22) :** మహామాయ 23
13. **ఆదిశక్తి లీలా కథలు-9 :** భావనలనే అర్ఘ్యాన్ని భవానీకి సమర్పించుదాం 24
14. **ధారావాహిక-హనుమత్ కథామృతం-33 :** వరప్రాప్తితో పులకించిన హనుమంతుడు 26
15. **పూజ్య గురుదేవుల అమృత వాణి :** యుగపరివర్తన సమయంలో పంచశీలములను పాటించండి 28
16. **మనం - మన ఆరోగ్యం :** మొలకెత్తిన గింజలలో అద్భుత ఆహార విలువలు 31
17. **సాధనా విజ్ఞానం :** ఉపాసనలో ఏకాగ్రత సాధించడం ఎలా? 32
18. **జీవించే కళ :** నవ్వు నాలుగు విధాల మేలు 34
19. **నా వారితో నా మాట :** ఇంటింటా దీపాలను వెలిగించాము-ఇప్పుడు మానవ నిర్మాణము జరగాలి 35
20. **ఆరోగ్యమే మహాభాగ్యం-4 :** హోమియో వైద్య సేవ 38
21. **వేమన వేదం-జీవన నాదం - 5** 40
22. వసంత పంచమి వేళ గాయత్రీ మంత్రము-గాయత్రీ మహా యజ్ఞముల ప్రాశస్త్యము-యుగఋషి, పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల గాయత్రీ మహాభారత సందేశము 42
23. **వార్తలు** 44
24. **అక్షరాల ఆట :** పదగాయత్రి-5 48




# సద్గురు వచనామృతం

## ప్రశాంతమైన ఆలోచనల శక్తి

మనం చేసే ఆలోచనల ప్రభావం మనపైన, ఇతరులపైన పడుతుంది. ప్రశాంతమైన ఆలోచనలు మన మనమనస్సును నెమ్మది నెమ్మదిగా మార్చివేస్తాయి. మనం మనకి ఇష్టమైన పనులను ఆడుతూ పాడుతూ చేస్తుంటాము. ఇష్టం లేని పనులు ముఖ్యమైనవయినా చేయాలనిపించదు. కానీ మన స్వభావం మార్చుకోవడం మన చేతుల్లోనే ఉన్నది. ఇది ప్రశాంతమైన ఆలోచనల ద్వారా సాధ్యమవుతుంది. స్వభావం మార్చుకోవడం వల్ల ఎటువంటి పనులైనా మనిషి సునాయాసంగా చేయగలుగుతాడు.

మనిషికి ఇష్టంలేకపోయినా తప్పనిసరి పరిస్థితులో కొన్ని పనులు చేయవలసి వచ్చినపుడు పలురకాలైన ఆటంకాలు వస్తుంటాయి. మనిషి తను చేసిన తప్పుల గురించి, పనులు ఎందుకు కావడం లేదో అనే దాన్ని గురించి ప్రశాంతంగా విశ్లేషిస్తే దానికి అసలు కారణం తనలోనే ఉందని గుర్తిస్తాడు. టెన్షన్ లేకుండా చేసిన పనుల వల్ల ఆత్మ విశ్వాసం పెరుగుతుంది, సాఫల్యం తప్పక లభిస్తుంది. ఇలా చేయడం వల్ల ఇంద్రియాలు సవ్యంగా పనిచేస్తాయి. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. కోరికలు పెంచుకుంటూ పోతుంటే ప్రశాంతత మాయమవుతుంది. మనిషిలో కోరికలు ఎంత ఎక్కువగా ఉంటే వాటితో పాటు భయం, సందేహం, మోహం అంత ఎక్కువగా ఉంటాయి.

*– అఖండజ్యోతి, మే 1955*

*అనువాదం : శ్రీ ఊటుకూరి సత్యన్నారాయణ గుప్త*

## పండుగలు

**మార్చి 2011**

| | |
|---|---|
| 02-03-2011 | మహా శివరాత్రి |
| 19-03-2011 | హోలి |

**ఏప్రిల్ 2011**

| | |
|---|---|
| 04-04-2011 | ఉగాది |
| 12-04-2011 | శ్రీరామ నవమి |
| 22-04-2011 | గుడ్ ఫ్రైడే |
| 30-04-2011 | మహావీర జయంతి |

గౌరవం, సద్గుణాలకు బహుమానం.

వేద మంత్రం

# అమరత్వం

మృత్యోః పదం యోపయంన్తో యదైత ద్రాఘీయ
ఆయుః ప్రతరం దధానాః ।
ఆప్యాయమానాః ప్రజయా ఘనేన,
శుద్ధాః పూతా భవత యజ్ఞియాసః ॥

– (ఋగ్వేదం 10/18/2)

**భావార్థం :** ఎవరు దురాచారాలను వదలివేసి సదాచారాలు ఆచరిస్తుంటారో వారికి ఉత్తమ జీవనము దీర్ఘాయుష్షు లభిస్తాయి. ధనము, సంతానములతోపాటు, శారీరక మానసిక పవిత్రత ప్రాప్తించుకొంటారు.

**సందేశం :** మనుష్య జీవనం ఈశ్వరుడిచ్చిన ఒక అనుపమమైన కానుక. మనుష్యుడికి లభించిన సౌకర్యాలు ఏ జీవజంతువుకూ లభించలేదు. నవ్వుట, మాట్లాడుట, వ్రాయుట, చదువుట, ఆలోచించుట, చికిత్స, కుటుంబం, నివాసము, వ్యాపారం, వాహనం, మనోరంజనం వంటి సౌకర్యాలు మరే ప్రాణికైనా లభించాయా? మనుష్యునిపైనే ఈశ్వరునికింత అనుగ్రహం దేనికి?

ప్రపంచలోని ప్రతిఒక్క ప్రాణీ జన్మిస్తుంది, కొంతకాలం తర్వాత మరణిస్తుంది. మృత్యుపాదం ఎవరినెప్పుడు తొక్కివేస్తుందో ఎవరికీ తెలియదు. మృత్యువును అధిగమించి అమృతత్వాన్ని ప్రాప్తించుకొనే సామర్థ్యం పరమాత్మ మనుష్యునికి ఇచ్చాడు. ప్రపంచంలో మరణించిన వారిలాగా జీవితాన్ని గడపక అమరపుత్రుల వలె జీవించండి.

ఇతిహాసం, శ్రేష్ఠపురుషుల నడవడిక పరిశీలిస్తే వ్యక్తి ఉన్నతికి కొన్ని శ్రేష్టమైన గుణాలు ఆవశ్యకమని తెలుస్తుంది. ఆ గుణాలే మానవత్వానికి గీటురాళ్ళు. ఎవరిలో ఈ గుణాలు ఎంత మోతాదులో వుంటే ఆ వ్యక్తి ఆ స్థాయిలో అంత శ్రేష్ఠుడు, అమరుడు అవుతాడు. ప్రపంచంలోని మహాపురుషులందరిలో ఈ గుణాలే నిండి వున్నాయి. ఈ గుణాల సోపానాలు అధిరోహించకుండా అమృతత్వ సింహాసనాన్ని ఎవరూ అధిష్ఠించలేరు. గీతలో ఈ గుణాల మహిమ అనేక స్థానాలలో అనేక విధాలుగా వర్ణించబడింది. వీటిని దైవ సంపద అని చెప్పటం జరిగింది. ఈ గుణాలను తన జీవితంలో నింపుకోగలిగితే మనుష్యుడు అమరుడు కాగలడు.

మనదేశం మహాపురుషుల దేశం. శ్రీరామచంద్రుని నుండి నేటి వరకు ప్రపంచకీర్తి పొందిన వందలాదిమంది మహాపురుషులు ఇక్కడ జన్మించారు. కేవలం మహాపురుషుల నిర్మాణంతోనే సరిపోదు. ఏదో కొద్ది మంది దైవీసంపద కలిగిన వారై, మిగిలి ఉన్న వ్యక్తులు నరక సదృశ జీవితం జీవిస్తూ ఉంటే అది అనుచితం, అసంభవం కూడా. దేశంలోని సాధారణ అతి సాధారణ వ్యక్తులు కూడా శ్రేష్ఠులు కావాలి.

మన శారీరిక అవసరాలు కూడా ఇతర ప్రాణుల వలె సామాన్యంగా, తేలికగానే పూర్తి చేసుకోవచ్చు. కానీ మనం అధిక సామర్థ్యమును భోగము, విలాసం కూడబెట్టడం మొదలైన వాటి కొరకు ఉపయోగిస్తున్నాము. రకరకాల దురాచారాలలో ఈ అమూల్య మానవ జీవనం వృథా చేస్తున్నాము. మన జీవితోద్దేశ్యం నుండి దూరమై, మరణించిన మనిషితో సమానంగా ఏదో విధంగా బ్రతుకు బండిని ఈడ్చుకుంటూ పోతున్నాము.

మనం ఎప్పుడూ ఆహారం, వ్యాయామం, తపస్సుల ద్వారా శరీరాన్ని శుద్ధముగా, అంతఃకరణను పవిత్రంగా చేసుకొని యజ్ఞీయ జీవితం గడపాలి. అప్పుడు మనం శుభకర్మలు చేస్తూ ఉత్తమమైన ధనం, శ్రేష్ఠ సంతానముతో సుఖాలను నూరు సంవత్సరాలకు పైగా అనుభవించగలము. అమరత్వపు ఆనందాన్ని ప్రాప్తించుకోగలము.

★★★

## గాయత్రీ పరివార్ పరిజనులకు విజ్ఞప్తి

*యుగఋషి వేదమూర్తి పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యులు అనేకమార్లు తనను తన సాహిత్య మాధ్యమము ద్వారా ఇంటింటికి చేర్చమని విజ్ఞప్తి చేసియున్నారు. యుగపరివర్తన–సత్యయుగ పునరాగమనము ఆనాడే సుసాధ్యం కాగలదు అని సెలవిచ్చిరి.*

*పై విజ్ఞప్తిని పురస్కరించుకొని జన్మశతాబ్ది వేడుకల సందర్భముగా మీ, మీ కుటుంబ సభ్యులు మరియు బంధు మిత్రుల వివాహ మరియు జన్మదినముల వేళ, ఒక్కొక్కరు 5గురు యుగశక్తి గాయత్రి పత్రికకు చందాదారులను చేర్పించ మనవి. ఇదియే నిజముగా మనము చెల్లించెడి గురుదక్షిణ. ఈ క్రింది చిరునామాకు మీ చందాను పంపించమనవి. (మీ పేరు చిరునామా పిన్‌కోడ్‌తోసహా ఫోన్ నం. వ్రాసి పంపించగలరు).*

*మా చిరునామా :*
**గాయత్రీ చేతనా కేంద్రము,** *హెచ్.పి.రోడ్, మూసాపేట, అశ్వినీ హౌస్ ప్రక్కన, హైదరాబాద్ – 500 018.*

విద్యతో పాటు వినయం అవసరం.

వర్తమానభారతం

# నలువైపుల నుండి మార్పు-మార్పు అని వినపడుతున్నది

## మనం చాలా సౌభాగ్యశాలురము

ఈనాడు నలువైపులా పరివర్తన అనే గాలి వీస్తున్నది. కళ్ళకు గంతలు కట్టుకొన్న వారికి ఈనాటి పరిస్థితులు ఎంత విషమంగా వున్నాయో తెలియకపోవచ్చు. కొందరు ప్రపంచం ఎలావుందో అలానే ఉంటుంది, ఏవో కొద్దిపాటి ఆటుపోట్లు వస్తుంటాయి తప్ప మరేమీకాదు అని చెప్తూవుంటారు. దివ్యదర్శులైనవారు భవిష్యత్తును ఊహించగలరు. వారికి 2011 నుండి విశ్వవ్యాప్తంగా పరివర్తన అనే శృంఖల ప్రారంభమైనదని అర్థమవుతుంది. వారికి నలువైపులనుండి పరివర్తన, మార్పు, మార్పు అనే కంఠస్వరమే వినిపిస్తున్నది. యుగపరివర్తన యొక్క శుభారంభం జరిగింది. రాబోయే 10 సంవత్సరాల్లో ఈ విషయం స్పష్టంగా మనకు కనిపిస్తుంది. ఇక దీనిని ఎవరూ ఆపలేరు. ఈ పరివర్తనలకు కేంద్ర బిందువు మన భారతదేశం అనేది మనం చాలా గర్వించదగ్గ విషయం.

## ఒక మహత్వపూర్ణ భవిష్యవాణి

శ్రీ అరవిందులు, వివేకానందులు వేరువేరు సమయాల్లో ఈ కాలానికి సరిపోయే ఒకే భవిష్యవాణిని చెప్పారు. ఇద్దరూ చెప్పిన విషయమేమంటే శ్రీరామకృష్ణపరమహంస జన్మించినప్పటినుండి (1836) యుగపరివర్తనా ప్రక్రియ ప్రారంభమైంది. 175 సంవత్సరాల తరువాత దీని పరాకాష్ట ఎలావుంటుందో మనకు కనిపిస్తుంది. ఈ సమయమంతా సంధికాలమే. పొలాన్ని బాగా దున్ని విత్తనాలు వేస్తారు. పంట రెండవరోజే మనకు చేతికి రాదు. దానికి కొంత సమయం పడుతుంది. గొప్ప పరివర్తనలన్నింటికీ సమయం పడుతుంది. వాతారణంలో మార్పును తీసుకుంటే నవరాత్రులలో చల్లని వాతావరణం ఉంటుంది. వసంతఋతువు వచ్చేసరికి ఎముకలు కొరికే చలి మొదలౌతుంది. చైత్రనవరాత్రుల్లో వచ్చే వేడిమికి ఆ చలి అంతా మటుమాయమవుతుంది. మహాకవి కాళిదాసు మన దేశాన్ని ఆరు ఋతువులతో కూడిన అద్వితీయ దేశంగా అందులోని ప్రతి ఋతువు యొక్క సౌందర్యమును విలక్షణంగా వర్ణించారు. ఋతుపరివర్తనా చక్రమును అర్థము చేసుకున్న వారికే పరివర్తన అనేది ప్రకృతి ధర్మము అని అర్థమౌతుంది. ఈ రోజున ఏది ఉన్నదో అది రేపు ఉండదు, మారితీరుతుంది.

ఇద్దరు మహాపురుషుల ప్రకారం 175 సంవత్సరాల ప్రసవ వేదనతో సమానమైన కాలాన్ని మనం దాటేశాము. ఇప్పుడు తిరిగి సత్యయుగం వైపు ముందుకు సాగుతున్నాము. ఇది ఎంత విలక్షణమైన సంయోగమంటే 2011లో పరమపూజ్య గురుదేవుల 100 సంవత్సరాలు పూర్తయ్యి నలువైపులా వేగంగా పరివర్తనా క్రమము మొదలైంది. గడిచిన సంవత్సరాల్లో అసంభవం అనిపించే ఎన్నో పనులు ఇప్పుడు ఎంత చక్కగా జరిగిపోతున్నాయో మనకే కనపడుతున్నది. ప్రతి ఒక్కరూ వాటిని అభినందించి తీరాలి. రానురాను మీ అందరికీ ఈ విషయం ఇంకా స్పష్టంగా తెలుస్తూ వుంటుంది.

## దుమ్ముకొట్టుకుపోయిన రాజకిరీటము

100 సంవత్సరాల క్రిందట భారతదేశము బానిసత్వంలో వున్నది. 1857లో మొదటిసారిగా క్రాంతి ప్రారంభమైంది. ఆ తరువాత కాలంలో గోఖలే, తిలక్, గాంధీ, భగత్‌సింగ్ వంటివారు జన్మించారు. భారతదేశానికి స్వాతంత్ర్యమిస్తూ వెళ్ళిపోయారు. స్వాతంత్ర్యం కొరకు తగిన వాతావరణం తయారుచేయుటలో మహర్షి దయానంద, స్వామి వివేకానంద, శ్రీ అరవిందో, శ్రీ రమణమహర్షి వారి వారి పాత్రను చక్కగా నిర్వర్తించారనేది సర్వవిదితమే. ఎంతోమంది రాజులు, ఎన్నో రాజ్యాలు, సంస్థానాలు, సామంతులు, జమీందారులు, షావుకారీవ్యవస్థ అన్నీ నెమ్మది నెమ్మదిగా సమాప్తమైపోయాయి. రాజకిరీటము దుమ్ముకొట్టుకు పోయింది. దాస-దాసీల వ్యవస్థ వుండేది. అమెరికా మిగిలిన దేశాల్లో కూడా క్రాంతి వచ్చి వారిని అమ్మడం, కొనడం లాంటి విధానాలు రూపుమాసిపోయాయి. వేలాదిమందిని వేశ్యలుగా తయారుచేసిన అంత:పురాలు ఇప్పుడు ఎక్కడున్నాయి?

## మహాక్రాంతి యొక్క శృంఖల

'సతి' అనే ఆచారము మనదేశం మీద పడ్డ ఒక కళంకము. ఆ అనాచారానికి ధార్మికత అనే ముసుగు వేశారు. రాజారామమోహనరాయ్ వంటి మహాపురుషులు వచ్చి కలగా మిగిలిపోయిన విధవావివాహాలు జరిపించి, బలంగా పాతుకుపోయిన స్పృశ్యులు, అస్పృశ్యులు అనే బేధాన్ని

**మూల్యం చెల్లించడానికి సిద్ధపడిన వాడికి అదృష్టం లభిస్తుంది.**

రూపుమాపారు. రోజులు మారుతున్నాయి. కొన్ని ఇబ్బందులు ఈనాటికీ ఉన్నా అందరికీ సమానమైన అవకాశాలు లభించడాన్ని ఎవరూ ఆపలేకపోతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రతివ్యక్తీ అర్హుడే. ప్రతిభవుంటే జాతి పేరుతో ఎవరూ ఎవరిని తొక్కి పెట్టలేరు. అందరికి అవకాశాలు సంపూర్ణంగా లభిస్తాయి. ఈనాడు ఉన్న పరిస్థితి 100 సంవత్సరాల క్రితం ఊహించడానికి కూడా సాధ్యపడదు.

## నారీజాగరణ

ఈనాడు నారీశక్తికి లభించిన అధికారం ఆమె చేసిన ఎన్నో పోరాటాలకు ప్రతిఫలం. ఆ మార్పుకి పరోక్షంగా విశ్వమంతా వీస్తున్న అనుకూల పవనాలే కారణం. ఎక్కడ స్త్రీలను రెండవ తరగతి వర్గానికి చెందిన పౌరులని అనుకుంటున్నారో అక్కడే వారు ఈనాడు పెద్దపెద్ద పదవుల్లో రాణిస్తున్నారు. భార్యా భర్తలిరువురూ సమానాధికారంలో ఉంటూ కలిసి పనిచేసుకుంటున్నారు. చదువుకునే అవకాశం ఇద్దరికీ వుంది. ఒకప్పుడు ఇద్దరి మధ్య భేదాన్ని చూపించేవారు. ఈనాడు మాత్రం ఆడపిల్ల పుడితేనే సౌభాగ్యం అనుకుంటున్నారు. స్త్రీ తనని తాను తక్కువగా భావించుకుంటే ఏమీచేయలేము కానీ కాలం ఇప్పుడు ఆమెను ఒక ఉన్నతస్థానం మీద నిలబెట్టింది. సాక్షరత, స్వావలంబన, నేతృత్వము, సైన్యం, రక్షణరంగము, వైద్యరంగం వంటి అనేకరంగాల్లో స్త్రీ ముందడుగు వేసింది. ఇది మరి మహాపరివర్తనమే.

## ప్రజలకు అధికారం

పంచాయితీరాజ్ స్థాపన, సహకార ఉద్యమం వంటి కార్యక్రమాల ద్వారా అధికారం ప్రజలచేతికి వచ్చేసింది. ఇప్పుడు ఎవరూ ఎటువంటి ఆరోపణలూ చేయలేరు. భారతదేశంలో అందరికీ విద్య మరియు సమాన అవకాశాలు అనేవి ఒక క్రాంతిని తీసుకువచ్చాయి. ఈనాడు ఏ విషయంకానీ, సూచనలు కానీ రహస్యంగా దాచబడవు. ప్రజాహితం కోసం వాటిని బహిర్గతం చేయవలసిందే. మన న్యాయవ్యవస్థ లోకతంత్రమును కంచుకోటవలె రక్షించే బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తున్నది. న్యాయద్వారాలు అందరికీ ఎల్లవేళలా తెరిచే ఉంచబడుతున్నాయి. లోకహితం కోరేవారు ఆధారాలు చూపించి అపరాధులైన వారినెవరినీ స్వేచ్ఛగా తిరగకుండా కట్టడిచేయవచ్చు. స్వతంత్రం వచ్చిన 64 సంవత్సరాల తరువాత కూడా మనమింకా అనేక బ్రిటీష్‌వారి చట్టాలనే అమలుపరుచు కుంటున్నాము. కనుక ఇందులో చాలా లోటుపాట్లు వున్నాయి. సమయానుసారం ఇవి కూడా వ్యవస్థీకృతం చేయబడతాయి. మన 'న్యాయవ్యవస్థ' యొక్క పారదర్శకత విశ్వమునందు ఒక ఉపమానంగా నిలిచిపోతుంది.

## నియంతలు తప్పించుకోలేరు

ఉద్యమాలు విశ్వమంతటినీ ప్రభావితం చేస్తాయి. నియంతృత్వం ఇప్పటికి వందేళ్ళ క్రితమే మూడింట నాలుగు వంతులు ప్రపంచమంతా ఆవరించింది. సోవియట్‌యూనియన్, చైనా దానినుండి విముక్తి పొందాయి. దాదాపు సగంపైనే జనాభా స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నారు. చైనాలోని తియాన్‌మాన్ స్క్వేర్‌లో వచ్చిన క్రాంతి చైనాను మార్చివేసింది. 1989లో పగుల గొట్టబడిన బెర్లిన్‌గోడ యూరప్ మరియు గ్రీకు దేశాల రూపురేఖల్ని మార్చివేశాయి. గడిచిన రోజుల్లో ఈజిప్ట్, ట్యునీషియా, యమన్, జోర్డాన్ వంటి దేశాల్లో స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్నది. అది ఈ మహాపరివర్తన ప్రక్రియలో ఒక అంగము. ఇప్పుడు ఎవరినీ అణిచివేయలేము. వారు విముక్తి చెంది తీరవల్సిందే. ఇది కాలం యొక్క కోరిక. దీనిని అందరూ మనస్ఫూర్తిగా ఆమోదించవల్సిందే. ఇది చాలా స్పష్టమైన విషయం.

## సంచారవ్యవస్థలో వస్తున్న క్రాంతి

సంచారవ్యవస్థ (కమ్యూనికేషన్‌రంగం)లో వస్తున్న విప్లవాత్మక మార్పులు ప్రపంచాన్నే ఒక గ్లోబల్‌గ్రామంగా మార్చివేశాయి. ఇంటర్నెట్, మొబైల్, ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటివి ఏ ఒక్కవ్యక్తీ చేసి చూపించలేనివన్నీ చేసి చూపించాయి. ప్రపంచాన్నంతటినీ ఒకే భాషతో, ఒక వలయంలో, వరల్డ్‌వెబ్ ఒక సూత్రంతో ముడివేసింది. ఈనాడు ఇంటర్నెట్ ప్రజలందరిభాష. అన్నీ నెట్‌లో ప్రసారం చేయబడతాయి. నిరంకుశ పాలకులు కూడా వాటిని నిరోధించలేకపోతున్నారు. దీనితోపాటు మీడియాలో వచ్చిన క్రాంతి వల్ల ప్రజలందరూ ఒకరితోఒకరు కలుపబడుతున్నారు. 1980 వరకు మనము ఐపాడ్, మొబైల్ టివిలతో కూడిన ప్రపంచం ఉంటుందని ఊహించలేకపోయాము. విజ్ఞానము యొక్క ఈ ఆవిష్కారములు ప్రతి సూచనను వ్యక్తివ్యక్తికీ చేర్చే బాధ్యతను నిర్వహిస్తున్నాయి. కాని వీటిని మనం ఎంతవరకు యుగపరివర్తన కొరకు ఉపయోగించుకున్నాము?

**అదృష్టాన్ని నమ్ముకుని కూర్చునేవాడు జీవితాంతం కూర్చునే ఉంటాడు.**

### వైజ్ఞానిక ఆధ్యాత్మికత నేతృత్వం వహిస్తున్నది

విప్లవం ధర్మతంత్రాన్ని కూడా వదిలిపెట్టలేదు. ఈనాడు ప్రగతిశీల ఆధ్యాత్మికత స్వీకరించదగినదే. అది అందించే కంఠం పోప్‌ది కావచ్చు లేక భారతదేశ ధర్మదిగ్గజాలది కావచ్చు. మఠాధిపతులు కూడా పోప్ వలెనే బాధ్యతాయుతంగా జీవిస్తారు. ఇప్పుడు ఈ పరివర్తన అనే మహాతుఫానులో అందరూ ధనం కూడబెట్టుకొని భోగవిలాసాల్లో జీవించాలి అనే ఆలోచన కూడా చేయలేరు. అటువంటి వారెవరైనాసరే లోకసేవ, ఆరాధనా కార్యక్రమాల్లో పాల్గొని తీరాలి. ఈ మార్పు యొక్క వేగతీవ్రత రాబోయే పది సంవత్సరాల్లో ఎలా ఉంటుందో ఊహకు కూడా అందదు. ఇప్పుడు ధర్మము యొక్క వైజ్ఞానిక స్వరూపము మన ముందుకు రాబోతున్నది.

### భ్రష్టాచారముపై అంకుశము

మనిషి యొక్క కోరికలు పెరిగి వాటిని తీర్చుకునేందుకు తప్పుడు మార్గాలు పడుతున్నాడు. ఇకపై ఇటువంటివి సాగవు. నల్లధనం, కూడబెట్టుకునే ప్రవృత్తివంటివన్నీ వేగంగానే నియంత్రించబడతాయి. గడిచిన రోజుల్లో భారతదేశము, సంపూర్ణ విశ్వములో 50 కంటే ఎక్కువ దేశాలలో వచ్చిన పరివర్తనలన్నీ నిజమైన జనశక్తివల్లేనని చెప్తున్నాయి. ఇకపై స్విస్‌బ్యాంకుల్లో ధనం కూడా బైటకు లాగబడుతుంది. అధ్యాత్మవాదము త్వరితగతిన పెరుగుతూ ప్రతి వ్యక్తి దానిని అంగీకరించేందుకు వీలైన వాతావరణమును తయారుచేస్తున్నది. అభివృద్ధి చెందిన విజ్ఞానము వల్ల వచ్చే చెడుమార్పులు తుడిచివేయబడతాయి. చిన్నపెద్ద యుద్ధాలు జరగకుండా నిలిపివేయబడతాయి. ప్రజాహితం కోసం ప్రణాళికలు తయారుచేసేందుకు మాత్రమే శక్తి వినియోగించ బడుతుంది. నిజమైన అర్థంలో స్వరాజ్యం వస్తుంది.

### ఇది మా యొక్క దృఢమైన విశ్వాసము

పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది సమయంలో యుగపరివర్తన ప్రక్రియలో, మహాపరివర్తన సమయంలో 21వ శతాబ్ది వచ్చిందని చెప్తున్నది. 2011 నుండి ఈ కార్యము తీవ్రగతిలో జరుగుతుంది. గేర్లుమార్చి ముందుకు సాగుతుంది, ఇది ఇంక ఎవరు ఆపినా ఆగదు. క్రాంతి తీవ్రమైన వేగంతో వస్తుంది. సూక్ష్మజగత్తు యొక్క విధివ్యవస్థ అంతా హిమాలయాలలోని ఋషిసత్తా చేతుల్లో వుంది. వారే ఈ మహాపరివర్తనా వ్యవస్థను సంచాలన చేస్తున్నారు. మనము కేవలం నిమిత్తమాత్రులమై వారితో పాటు నడుస్తున్నాము. మన లక్ష్యము ఒకటే **'మానవునిలో దేవత్వము ఉదయించుట'.** దీనివల్లనే పృథ్విపై సత్యయుగము వస్తుందని ఉషోదయకాలంలోని ప్రభాతవేళలో స్పష్టంగా కనిపిస్తున్న ఈ అరుణోదయము చెప్తున్నది. ఈ విషయంలో ఎవరూ సందేహపడవలసిన అవసరంలేదు. మీరు కూడా ఆ అనిశ్చితస్థితిలో లేకుండా వుండండి. **ఇది మార్పు రావలసిన సమయం, మార్పు వస్తుంది.**

*– అఖండజ్యోతి, మార్చి 2011*

*అనువాదం : శ్రీమతి వల్లీ శ్రీనివాస్*

### కలయికలో గెలుపు

*సాఫల్యం పొందటంలో ప్రముఖ పాత్ర వహించేది బలమా, సంకల్పమా, వివేకమా అనే సందేహం కలిగి ఈ మూడు ప్రజాపతి వద్దకు వెళ్ళి ఆయన అభిప్రాయాన్ని కోరాయి. కేవలం తన అభిప్రాయాన్ని చెప్పడమేగాక ప్రామాణికంగా తెలియజేయాలని ప్రజాపతి నిశ్చయించుకున్నాడు.*

*ఆడుకుంటున్న పిల్లవాని దగ్గరకు వెళ్ళి ఒక వంకర మేకు, సుత్తి ఇచ్చి మేకును సరిచేయమని తిన్నంత మిఠాయి తినిపిస్తానని చెప్పాడు. కాని అంత పెద్ద సుత్తిని మోసే శక్తి నాకెక్కడ వున్నది? ప్రయత్నం కూడా చేయకుండానే నావల్ల కాదన్నాడు. నిరుత్సాహంగా ఇంకాస్త ముందుకు వెళ్ళేసరికి ఒక పనివాడు కనిపించాడు. నిద్రపోతున్న అతనిని మేల్కొల్పి మేకు, సుత్తి ఇచ్చి మేకును సరిచేసి ఐదురూపాయలు తీసుకోమన్నాడు. ఐదు రూపాయల మాట వినగానే ఆశపుట్టి పనికి ఉపక్రమించాడే గాని గట్టి సంకల్పం లేక మరల నిద్ర ముంచుకు వచ్చి పనిని మధ్యలో వదలివేశాడు. మరికాస్త ముందుకు వెళ్ళేసరికి ఒక బుద్ధిమంతుడైన చదువుకున్న వ్యక్తి కనిపించేసరికి మేకును సరిజేసి 50 రూపాయలు తీసుకోమన్నాడు. కాని అతను అనారోగ్యంగా ఉన్నాడు. శ్రమను తట్టుకోలేని స్థితి అతనిది. అందుకే ఆ పని తన వల్ల కాదని నిరాకరించాడు. అప్పుడు ప్రజాపతి అన్నాడు – "ఈ ముగ్గురు వ్యక్తులు (శక్తులు) కలసి ఉంటే పని అవలీలగా జరిగిపోయేది. వివేకం లేని బాలుడు, సంకల్పం లేని పనివాడు, బలం లేని వ్యక్తి కావడం వల్ల పని చిన్నదే అయినా సాధించలేకపోయారు. ఈ మూడు శక్తులు కలసి ఉంటే ఎంతటి అసాధ్యమయిన పనులైన అవలీలగా సాధించవచ్చు" ఈ మూడు ఎక్కడ ఉంటే అక్కడ విజయం, సాఫల్యం తథ్యం.*

– ప్రజ్ఞా పురాణం నుండి

సంతోషం సగం బలం.

## గాయత్రీ విద్య-6

# త్రిపదా గాయత్రి మూడు చరణాలు

గాయత్రిని త్రిపదగా చెప్పబడింది. త్రిపద అంటే మూడు చరణములు కలది. మూడు చరణములో సమస్త సంపదలున్నాయి. వీటిని పొందిన వ్యక్తి అయినా నిజమైన అర్థంలో మనిషి అని అనిపించుకుంటాడు, జీవాత్మ యొక్క మూడు ఆవరణలను భేదించి (దాటి) వాటిని వికసింపజేసుకుని దేవోపమ స్థితి ప్రాప్తించుకుంటాడు. మనిషి యొక్క అస్థిత్వాన్ని మూడు విధాలుగా విభజించారు. స్థూలమైనది, సూక్ష్మమైనది, కారణమైనది. మూడు శరీరాలు ఒకదానిని మించి మరొక సామర్థ్యములను తమలోపల దాచుకుని ఉన్నాయి. వీటిలో అస్థవ్యస్తత, వికృతులు నిండిపోవడం వల్ల తమ విలక్షణమైన శక్తిని పోగొట్టుకొంటాయి. ఫలస్వరూపంగా పొందవలసిన లాభములను పొందలేవు. ఇంతేగాక రోగగ్రస్తుడై బాధలు కలుగుతాయి. విభూతులతో నిండిన ఈ మూడు శరీరాలనుండి పొందవలసిన హర్షోల్లాసములు పొందకపోగా, సురదుర్లభమని చెప్పబడే మానవ జీవనం సార్థకం చేసుకోలేకపోవడమే గాక, దుర్గతి పాలుగావలసి వస్తుంది. నేడు అధికశాతం మనుష్యులు ఇలాంటి పరిస్థితులలోనే ఇరుక్కుపోయారు.

స్థూల శరీరం ఆరోగ్యంగా ఉంటే కలిగే లాభాలు కొద్దోగొప్పో మనకందరికి తెలుసు. రోగరహిత శరీరం చూడటానికి అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. అది వికసించిన పువ్వువలె అందరినీ అలరిస్తూ, ఆకర్షిస్తుంది. అధిక శ్రమ చేయడం, కఠినమైన పనులను చెయ్యగలగటం వల్ల స్వయంగా లాభం పొందటమేగాక, ఇతరుల గుర్తింపు పొందటం రోగరహిత స్థితిలోనే సాధ్యమవుతుంది.

శరీరంతో కొన్ని ప్రత్యేకమైన సాధనలు చేసి ఆశ్చర్యపరిచే ప్రదర్శనలు ఇస్తారు. శిల్పులు, కళాకారులు వస్తాదులు, క్రీడాకారులు, సర్కసులో పనిచేసే గారడి వాళ్ళు, శరీర సాధనలో నిష్ణాతులు, వారి మనోయోగ సమన్వయంతోనే వారి సాఫల్యం సాధ్యమవుతుంది. పంచతత్వములతో నిర్మించబడ్డ ఈ శరీరము చేతన మనస్సు సహాయం లేనిదే కదలలేదు, మెదలలేదు. ఇక పెద్ద పెద్ద పనుల గురించి చెప్పేదేముంది. శరీర నిర్వహణకు దోహదం చేస్తున్న ఈ మనోయోగం స్థూల శరీరమునకు చెందిన ఒక భాగంగా భావించాలి. అందువలన మనస్సును 11వ ఇంద్రియమని అన్నారు.

స్థూలశరీరం యొక్క సామర్థ్యం వల్ల ప్రపంచంలో అనేక రకాల లాభాలు పొందుతున్నాము. ప్రపంచంలో ఉపయోగపడే వస్తువులను పొందడంలోను, ఇతరులకు సహకరించి బదులుగా ఇతరుల సహకారం పొందటంలోను శారీరిక సక్రియలే ప్రధాన కారణము. కర్మ మహిమ సర్వత్ర దృష్టిగోచరమవుతుంది. కర్మఫలంతోనే సుఖదుఃఖములు ప్రాప్తిస్తాయి. కర్మ యొక్క స్థూల పరిణామం శరీర సక్రియతోనే జోడింపబడి ఉన్నది. దండన, పురస్కారములు శారీరిక కర్మల వల్ల లభిస్తాయి. శరీరాన్ని సరియైన స్థితిలో ఉంచి, సఫలతల కొరకు అవసరమైన శిక్షణ ఇవ్వడాన్నే శరీర సాధన అని అంటారు.

సాధనా విజ్ఞానం యొక్క మొదటి అడుగు శారీరిక ఆరోగ్యాన్ని కాపాడుకోవటం, శారీరిక కార్యకలాపాలను ఒక పద్ధతిగా ఉంచుకోవడమే. దీనివల్ల సాధకుడు రోగరహితుడుగా, సామర్థ్యం పెంపొందించుకుని, దీర్ఘజీవి (ఎక్కువ కాలం జీవించడం) అవుతాడు. యోగసాధనలో లభించే మొదటి లాభం ఇదే. స్వాస్థ్య (ఆరోగ్య) రక్షణకు కావలసిన నియమాలు అందరికి తెలుసు. భోజనంలో ఏ ఏ వస్తువులు ఎంత పాళ్ళలో ఉండాలి, వాటిని ఏ విధంగా వండాలి, తినాలి అనేది తెలుసుకోవాలి. శ్రమ, వ్యాయామం, దినచర్య, శుభ్రత వంటివి ఆరోగ్య సంరక్షణకు ఆవశ్యకము. జబ్బుపడినప్పుడు ఏ మందులు ఇవ్వాలో అనే దాని గురించి ఒక పెద్ద శాస్త్రమే ఉన్నది. ఇది స్థూల శరీర ఆరోగ్యాన్ని రక్షించేందుకు ఉపయోగిస్తుంది. సూక్ష్మ ఆరోగ్య విజ్ఞానం దీనికన్నా లోతైనది. వాటి వేళ్ళు చాలా లోతులలో పాతుకుని ఉంటాయి.

ఆసనాలు, ప్రాణయామం, నేతి, ధోతి, వస్తి, వజ్రోలి, కపాలభాతి, ఉడ్డియాన బంధం, జాలంధర బంధం, మూలబంధం, ముద్రలు, ఉపవాసం, తితీక్ష, చాంద్రాయణ వ్రతం, మౌనం మొదలైనవి అంతరాళలను ప్రభావితం చేస్తాయి. సామాన్య ఆహార నియమాలు అంతలోతులకి ప్రభావం చూపలేవు. ఆరోగ్య సంరక్షణకు ఆహార నియమాలు పాటించే వారిలో కూడా రోగములు, దుర్బలత చూడవచ్చు. నాడిని చూచి దీనికి కారణము తెలుసుకోలేము. కోశికలలో, నాడులలో, జీర్ణము చేసే ద్రవాలలో, కొన్ని విశిష్ఠ గ్రంథులలో కొన్ని సమస్యలు వస్తుంటాయి. ఇవి డాక్టర్లు చేసే పరీక్షలకి అందవు. రోగి బాధలు అలాగే ఉంటాయి. ఈ సందర్భంలో యోగ విజ్ఞానం యొక్క ప్రయోగాలు మంచి ఫలితాలు ఇవ్వడం చూడవచ్చు. అయితే వీటి గురించి విస్తృతమైన వ్యాఖ్యలు వివేచనలు ప్రయోగస్థాయిలో వివరించలేకపోయినా వాటి పరిణామాలు అనే గీటురాయిపై చాల మంచి ఫలితాలనిచ్చినట్లు తెలుస్తుంది.

వస్తాదులలో కనిపించే బలం, కళాకారులలోని కౌశల్యం, సైనికులలోని చురుకుదనం అనేవి కేవలం ఆరోగ్య చిహ్నాలు

**నమ్రతకు ఎటువంటి ఖర్చులేదు. ప్రభావం ఎక్కువ.**

మాత్రమే కాదు, జీవన శక్తి యొక్క మహత్వపూర్ణమైన అంశగా భావించవచ్చు. రక్తంలో మాలిన్యాలు ఉన్నా, శరీరంలోని అవయవాలు క్షీణించినా ఈ జీవనశక్తిని ఆధారం చేసుకొని రోగగ్రస్తుడైన వ్యక్తి కూడా చాలా పనులు చక్కగా చేయగలుగుతాడు. దీనికి "జిజీవిష" అనే పేరు కూడా ఇవ్వవచ్చు. దీనిని ఆధారం చేసుకొని మృత్యువును ఎదిరించవచ్చు. అనారోగ్య భారంతో కృంగిపోయినా, ప్రబల పురుషార్థులవలె గొప్ప గొప్ప కార్యాలు నిర్వర్తించగలరు. భీష్ముడు అంపశయ్య మీద ఉండి కూడా ఉత్తరాయణంలో సూర్యుడు వచ్చేవరకు జీవించి ఉండటం, ఆదిశంకరాచార్యులు భయంకరమైన కురుపుతో సతమతమవుతూ కూడా ఆశ్చర్యకరమైన క్రియాకలాపాలలో నిమ్నగమవడం వంటి అసంఖ్యాక ప్రమాణాలు కనిపిస్తాయి. గాంధీ వంటి దుర్బల వ్యక్తి, రాజేంద్ర ప్రసాద్ వంటి రోగగ్రస్తుడైన వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వ్యక్తుల కన్నా ఎక్కువగా పని చేసి చూపిచ్చారు.

సూక్ష్మ శరీరమనగా ఆలోచనల దివ్యజ్యోతి. దీనివల్ల మస్తిష్కంలో చురుకుదనం, జ్ఞాపకశక్తిలో అభివృద్ధి, దూరదృష్టి, ఏదైనా విషయం గురించి లోతుగా ఆలోచించగలగటం చూడవచ్చు. వ్యక్తి తెలివితేటలు, అర్థం చేసుకునే స్థాయిని బట్టి మందబుద్ధా, తెలివిగలవాడా అని అంచనా వేస్తారు. శారీరిక బలం, సక్రియత (activity) ఆధారంగా లభ్యమయ్యే సుఖాలు, లాభాల వలె మానసిక క్షమతల వల్ల కలిగే ప్రయోజనాలు తక్కువేమీ కావు. స్కూలులలో, కాలేజిలలో ఉచ్ఛ్రేణిలో ఉత్తీర్ణులైన వారికి ఆఫీసరు వంటి పెద్ద పదవులు లభిస్తాయి. వకీలు, డాక్టరు, వైజ్ఞానికులు మొదలైన తెలివిగలవారు సంపాదన ఎక్కువగానే ఉంటుంది. వ్యాపారులు, శిల్పులు, కళాకారులు శారీరిక పరిశ్రమ వల్లనే ఉన్నత స్థితికి చేరుకోలేరు. వాళ్ళు పనులను తన్మయత్వంతో చేస్తారు. శారీరిక సక్రియత (activity), మనస్సు యొక్క తన్మయత్వం యొక్క సంయోగం ఎంత ఎక్కువగా ఉంటుందో వారి సఫలతలు అంత ఎక్కువగా ఉంటాయి. జ్ఞానము కొరకు స్కూలులలో, కాలేజిలలో చాలా సమయం, ధనం వెచ్చించి చాలా శ్రమ చేస్తారు. స్వాధ్యాయాల ద్వారా, ఇతరులను కలుసుకోవడం ద్వారా, అభ్యాసం ద్వారా జ్ఞానం సంపాయించుకోవడానికి వీలవుతుంది. శారీరిక కౌశలం వలె వికసించిన బుద్ధికి దాని లాభాలు దానికున్నాయి. ఈనాటి రీసర్చి పనులలో, అన్వేషణలలో, పర్యవేక్షణలలో వాస్తవిక స్థితి తెలుసుకునేందుకు సూక్ష్మ బుద్ధి మాత్రమే పనిచేస్తుంది. ఈ సూక్ష్మబుద్ధిని ఏ విధంగా వికసింపచేసుకోవాలో అనేదానికి బాహ్యంగా ఏమి కనిపించదు.

ఒకరిని మించిన ఒకరు వస్తాదులు చాలా చోట్ల కనిపించవచ్చు. కాని లోతులకు పోయి ముత్యాలను పొందగలిగే సౌభాగ్యం మామూలు వారికి లభించదు. ఇలాంటి నేర్పు ఎవరి దగ్గర ఉన్నదో వారు మామూలు పరిస్థితులలో జన్మించినప్పటికి విచిత్రమైన పద్ధతుల ద్వారా ముందుకు వెళ్తుంటారు. అడ్డంకులు దాటుకుంటూ ఎక్కడికైనా వెళ్ళగలరు. వీరి స్నేహితులు వీరిని ఆశ్చర్యంగా చూస్తుంటారు. ఒకప్పుడు ఇద్దరు ఒకే స్థితిలో ఉండేవారు. ఒకడు జీవితంలో ఎంతో ముందుకు పోతే ఇంకొకడు ఉన్నచోటనే ఉన్నాడు. పరిస్థితులను అర్థం చేసుకుని ఉపయోగించుకునే తెలివితేటలను బట్టి, సామర్థ్యం బట్టి ఈ తేడాలు వస్తుంటాయి.

గాయత్రి సాధన స్థూల శరీరంలో ఆరోగ్యం, సూక్ష్మశరీరంలో మనస్విత్వా, తేజస్విత్వా ఉత్పన్నం చేస్తుంది, కారణ శరీరంలో పులకింత కలుగజేస్తుంది, భావనల ద్వారానే కారణ శరీరంలో ప్రవేశించడానికి వీలవుతుంది. నిష్ఠ, విశ్వాసం, శ్రద్ధల భావపూర్వక సమన్వయమునే భక్తి అంటారు. దీనినే ప్రేమ అనవచ్చు. ఈ స్థితి తర్కానికి అందదు. దీనిలో మనస్సు, బుద్ధి అంతగా ఉపయోగపడవు. ఉత్సాహపూర్వక భావతరంగాలు మాత్రమే అంతఃకరణలోని రహస్యస్థలమును స్పర్శించగలవు. ఇద్దరు ప్రేమికులు కలుసుకున్నపుడు భావనలలో నిండిపోయి, ఆనందాతిరేకాన్ని పొందుతారు. ఆత్మీయులని, పరమప్రియమైన వారి కలయికలోనే పులకింత ఉప్పొంగుతుంది. అందువల్లనే భగవంతుని పట్ల అత్యంత ఉచ్చస్తరీయ భావనలు, పులకింతతో కూడిన కలయిక – ఒకరిలో ఇంకొకరు కలసిపోయిన అనుభూతిని భక్తియోగమంటారు. దీనినే లయయోగం, ఆత్మ సమర్పణ, తాదాత్మ్యం అని కూడా అంటారు.

'నేను', 'నువ్వు' నుంచి ఒకదానికి తీయవేయాలని సూఫీ సంతులు, భక్తి యోగులు ఒకే స్వరంతో చెప్తుంటారు. 'నేను' లేకపోతే 'నువ్వు' మిగిలి ఉంటుంది. నాకంటూ ఏమిలేదు. ఉన్నదంతా నీదే. 'నేను' అనే భావన తీసివేయగలిగితే భగవంతుడు దొరుకుతాడు. ఈ తథ్యాన్నే ఇంకొక రకంగా చెప్పవచ్చు. "అయమాత్మా బ్రహ్మ – ప్రజ్ఞానం బ్రహ్మ – బ్రహ్మ తత్వమసి. సచ్చిదానందోహం – శివోహం" మొదలైన వాటితో 'నీవు' చెరిగిపోయి 'నేను' మిగులుతుంది. రెండు స్థితులలో ఏకత్వం, ఒకేరూపం, ఒకే సత్తా గురించి ప్రతిపాదన ఉన్నది. భక్తుడు, భగవంతుడు ఒకటి అవ్వడం అనే విషయం చెప్పబడుతున్నది. అయమాత్మ బ్రహ్మ అనే ఆత్మ నికృష్ట నరపశువు కాలేదు. దాని పనులు, ఆలోచనలు, ఆకాంక్షలు పరమేశ్వరుదని వలె ఉంటాయి. ఇంతకన్నా తక్కువ స్థితిలో "శివోహం" అనే మాట ఎక్కడ కుదురుతుంది. పరమాత్మ స్థాయికి చేరిన ఆత్మ తన అహంకారాన్ని తినేసి ఉంటుంది. దానితో జోడింపబడిన స్వార్థపరత్వానికి చెందిన బంధనాలన్నీ తెగిపోయి ఉంటాయి. ఇటువంటి మనిషి లోభ మోహముల నుండి విరక్తుడై జీవిస్తాడు, ఉచ్చస్తరీయ ప్రేరణలను ఈశ్వరుని సంకేతములుగా భావించి వాటిని అనుసరిస్తాడు.

త్రిపద గాయత్రి యొక్క మూడు చరణములు తన ఉపాసకుని స్థూల, సూక్ష్మ, కారణ శరీరములలో దివ్య తత్వములను జాగృత పరుస్తుంది.

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2005*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీ సుందరి*

**నమ్రత మనిషిని దేవతగా మారుస్తుంది.**



## బాలల భవితకు బంగారు బాట-17

# ఆలోచించు - అహంకారాన్నిదించు

ఒక ఉప్పు కణిక తన గురించి తాను ఆలోచించుకో సాగింది. ఆలోచించగా ఆలోచించగా అహంకారం పుట్టుకొచ్చింది. "ఈ ప్రపంచంలో నేను లేనిదే ఏ ఒక్కరికీ ఆహారం రుచించదు. అందువల్ల అందరికన్నా నేనే గొప్పదాన్ని" అని గట్టిగా నిర్ణయించుకుంది. తాను ఏమిటో? తన పుట్టుపూర్వోత్తరాలు ఏమిటో తెలుసుకోవాలి అనుకుంది. కొండల్ని, గుట్టల్ని అడిగి చూచింది. సమాధానం రాలేదు. చెట్టు చేమల్ని అడిగి చూసింది. అక్కడా అంతే. వచ్చేపోయే అలలతో పెద్దగా ఘోషిస్తున్న సముద్రాన్ని చూచింది. అడుగుదామని సముద్రంలోకి దూకింది. అట్టడుగు భాగానికి చేరుకుంది. తాను ఏమైపోతోందో తనకే తెలియలేదు. చూస్తూ ఉండగానే తన ఉనికిని పూర్తిగా కోల్పోయింది. కరిగి నీరైపోయింది. సముద్రంలో కలసిపోయింది. ఎప్పుడయితే ఉనికిని కోల్పోయిందో ఆ క్షణంలోనే అహంకారం అణగారి పోయింది. ఈ మహా సముద్రం ముందు నేనెంత? నా బ్రతుకెంత? అనుకుంది.

బాలలూ! విన్నారు కదా? మానవుడు కూడా విద్యవల్లనో, తెలివితేటలవల్లనో, సిరిసంపదలవల్లనో, స్నేహ బాంధవ్యాల వల్లనో, సమాజంలో పేరు ప్రతిష్ఠలను సంపాదించుకుంటాడు. తనంత గొప్పవాడు లేడు అనుకుంటాడు. తన ఉనికిని గమనించి తానే మురిసిపోతాడు. అంతా తన ప్రతాపమే అనుకుంటాడు. కాని భగవంతుని సృష్టిలో తానూ ఒక ఉపకరణమని భావించడు. ఈ జగన్నాటకంలో తానూ ఒక పాత్రధారిని అనుకోడు. తనవంతు పాత్రను సమర్థవంతగా నిర్వహిస్తున్నానని తలంచడు. అందువల్లనే ప్రతిచోటా అహంకారం నేను ఉన్నానంటూ తల ఎత్తుతూ ఉంటుంది.

దీనిని బట్టి మీకు ఏమి తెలుస్తున్నది? మనం ఎలాంటి స్థితిలో ఉన్నా అహంకారానికి చోటును కల్పించకూడదు. బలగర్వంతో విర్రవీగిన రావణాసురుడు వంశం లేకుండా పోయాడు. ధనగర్వంతో కన్నులు మూసుకుని పోయిన పెద్ద పెద్ద దేశాలు ఈనాడు తమ ఉనికిని ఎలా కాపాడుకోవాలో తెలియక తికమకపడిపోతున్నాయి. దారీ తెన్నూ తెలియక ఆధ్యాత్మికత వైపు తొంగి చూస్తున్నాయి. ఒకప్పుడు అవహేళన చేసిన భారతదేశాన్నే ఆదర్శంగా తీసుకోకతప్పడం లేదు.

మన మనస్సులో వచ్చే ఆలోచనలే మన శరీర స్థితిగతులను ఏర్పాటు చేస్తుంటాయి. మనస్సులో అసూయా ద్వేషాలు రగులుతూ ఉంటే శరీరం తనంతట తానే కుంగి కృశించిపోతుంది. శాంతి ప్రేమలను పెంచుకుంటూ పోతే హృదయంలోని పొరలన్నీ విచ్చుకుంటాయి. ఆనంద సుగంధం నలువైపులా ప్రసరిస్తుంది. ఆహ్లాద వీచికలు తోటి వారి హృదయాలను కూడా చల్లపరుస్తాయి. మన చుట్టూ ఉన్న వాతావరణం మనకు అనుకూలంగా మారుతుంది. మన గమ్యం అనుకోకుండా దగ్గర అవుతుంది. ముందుకు చొచ్చుకుపోవడానికి సహృదయుల సహకారం లభిస్తుంది. సహృదయుల రూపంలో భగవంతుడు తోడుగా ఉంటాడు.

ఇన్ని జరిగాక 'నేనెవరు?' అన్న ప్రశ్నే రాదు. మీలోని అంతరాత్మయే మీకు అండగా నిలుస్తుంది. అంతరాత్మ సాక్షిగా ఆదర్శాలను అందుకుంటూ నడవాలి. ఇలాంటి విషయాలు పవిత్ర భారతదేశంలోని అనేకమంది ఋషులు, మునులు అనాది కాలం నుండి చెపుతూనే ఉన్నారు. ఈ మధ్యకాలంలోనే ఆధునికత, ఆధునిక అంటూ అన్నీ మరచిపోతున్నాం. భావి భారత పౌరులు మీరే. భావి భారతం మీచేతుల్లోనే ఉంది. లేవండి. కన్నులు తెరవండి. భారతదేశ భవిష్యత్తును గూర్చి ఆలోచించండి. మనసుల్లో పేరుకుపోతున్న అహంకారాన్ని దించివేయండి. అణచివేయండి. విజయం మనదే.

**కం॥ అహమును పెంచుకొనగ నీ**
**ఇహమున మసలుట భరమని యెరుగగ వలయున్**
**అహమును వీడుచ మసలగ**
**ఇహమే స్వర్గం బగునని యెరుగుము బాలా !**

– మధుర కవయిత్రి, పొన్నూరు హైమవతీ శాస్త్రి

**ఆత్మజ్ఞానం కోసం ఇంటిని కాక విషయాలమీద ఆసక్తిని వదలాలి.**

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమ మండలం-చతుర్థోధ్యాయం

# కర్తవ్య పరాయణత

**ధ్వంసః సరళ ఏవంచ లఘురగ్నికణో ఽ పిసః ।**
**గల్పితం కీలకం చాపికర్తుం తత్ ప్రభవేదలమ్ ॥ 78**

ఏదైనా నిర్మించడం చాలా కష్టం. కానీ ధ్వంసం చేయడం చాలా సులువు. అగ్నికణం చిన్నదే అయినా, అది కల్గించే నష్టం చాలా తీవ్రమైనది. కావున నిర్మాణాత్మకశక్తిని మాత్రమే కల్గి ఉండాలి. కానీ విచ్ఛిన్నకర శక్తి అవాంఛనీయం. భవనాన్ని నిర్మించడానికి కొన్ని సంవత్సరాలు పట్టవచ్చును. కానీ కూల్చివేయడానికి నిమిషాల సమయం చాలును. కావున ఏదైనా విధ్వంసకృత్యాన్ని చేసేముందు, దానిని నిర్మించడానికి ఎంత శ్రమ, సమయం, ధనం ఖర్చు అయి ఉండునో, తలచుకుని, అంతరాత్మ నిర్ణయం ప్రకారం నడుచుకోవడం ఉచితం.

బహుశా ఈ భావాన్ని అవగాహన చేసుకొని ఉండవచ్చు అనే రీతిలో ఆల్ఫ్రెడ్ నోబెల్, రెండవ ప్రపంచయుద్ధంలో 'ఆటంబాంబు' ద్వారా నాశనం చేయబడిన నాగసాకి, హిరోషిమా నగరాలను చూచి, విచలిత మనస్కుడై, శాస్త్రము (సైన్స్) 'నిర్మాణాత్మక ప్రయోజనాలకే ఉపయోగపడాలి. విధ్వంసానికి కాదు' అన్న ఆలోచనతో నోబెల్ పురస్కారాన్ని ప్రవేశపెట్టాడు.

**సృజనాత్మక కార్యేషు గౌరవం పరికీర్తితమ్ ।**
**చింతనం మానవస్యాథ ప్రయాసః సృజకేషుహి ॥ 79**

సృజనాత్మకమైన, ప్రయోజనకరమైన కార్యములు చేయుట వలన గౌరవం మరింతగా పెరిగి ప్రశంసించబడుతుంది. కావున మానవుని బుద్ధి, అటువంటి సృజనాత్మక కార్యములను చేయుట యందే నిమగ్నం కావాలి. ఇతర భోగములందు కానీ, విధ్వంసక కార్యక్రములయందు లగ్నంకారాదు. అపుడే సమయం, జీవనము, పరిపూర్ణత చెందుతాయి.

**ప్రయోజనేషు నిరతః సదా స్యాజ్జీవనస్యతు ।**
**గరిమ్ణో ఽ నుమితిస్త్రత నికషోపమితే భవేత్ ॥ 80**

బహుళ ప్రయోజనాలను కల్గించే కార్యములను చేయవలెనన్న సంకల్పం, మానవుని జీవనగతిని తీర్చిదిద్దుటయే కాక, ఆ పనిని చేసే వ్యక్తి యొక్క వ్యక్తిత్వము గీటురాయివంటిది. గీటురాయి బంగారము యొక్క విలువను ఎట్లు తెలుపునో, సత్కార్యములను చేసెడి ఆలోచనలు కల్గిన మానవుని గుణశీలములు, అతని నడవడి ద్వారా తెలియును.

**కింస్తరం కియదేతచ్చ కార్యంతు సృజనాత్మకమ్ ।**
**సంపన్నం ప్రతిభాయాతు క్రియాకౌశలజా తథా ॥ 81**

సంపద, ప్రతిభా, క్రియాకౌశలము వంటి దైవదత్త శక్తులను సామాజిక పరివర్తనను, సృజనాత్మకశక్తితో జతచేసినట్లైతే అది వ్యక్తి వికాసానికి, వ్యక్తిత్వ ప్రకాశానికి తోడ్పడుతుంది. అట్టిస్థితిలో ఆ వ్యక్తికి ప్రశంసాపూర్వకమైన గౌరవము లభిస్తుంది. దీనిని క్రియాకుశలత ద్వారా సాధించవచ్చును. సత్ప్రవర్తన ద్వారానే సౌశీల్యము కల్గుతుంది.

**ప్రఖరతా ద్వయోరత్ర ప్రశంసాస్మింస్తు వర్తతే ।**
**సత్ప్రవృత్తి వివృద్ధోతు తాభ్యాముపకృతం నవా ॥ 82**

క్రియ, కౌశలము అనెడి రెండు విధములుగా ప్రతిభా ప్రఖరతా ఉంటుంది. దీనివలన సత్ప్రవృత్తి వృద్ధి చెందుతూ, సమున్నతి కలుగవచ్చును. మానవుని జన్మ లోకంలో సత్కార్యములు చేయడానికే కానీ దుష్కర్మల కొరకు కాదని గ్రహించవలెను.

**ప్రతిభాయా రతాధ్వంసే తస్యాస్తు తులనా విధౌ ।**
**ప్రశస్తా కథితావిజ్ఞైర్మూర్ఖతా మందబుద్ధిజా ॥ 83**

మందబుద్ధిగలవారు, మూర్ఖులు విధ్వంస కృత్యములందు ఆసక్తి చూపుతూ, లోకకంటకులుగా తయారౌతారని విజ్ఞులు తెలిపారు. విజ్ఞులు ప్రతిభతో సమాజహితమును కోరితే, అజ్ఞులు మూర్ఖులై లోకవినాశానాకి ప్రయత్నిస్తున్నారు.

**యతో ఽ నయాన కస్యాపకార ఆచరితః క్వచిత్ ।**
**సృజితం కించిదేవా ధ సంశోధితముతాపిచ ॥ 84**

ఈ ధ్వంస కృత్యములందు ఆసక్తిగల మూర్ఖులు ఇతరులకు హాని చేయుటయే కాని, ప్రయోజనము కలిగెడి పనులను ఆచరించక పరిపరివిధాల హానికరమైన ఆలోచనలే కల్గి ఉందురు. వీరివలన లోకపీడనము అధికముగా ఉండెడిది.

బాధ్యతను నిర్వర్తించడం పరమ కర్తవ్యం.

**పురాతన కుసంస్కారాభ్యాసన్నిరసితుమ్ నవైః ।**
**ఉత్సాహైః సాహసైశ్చాపియుతం సాధు ప్రయోజనమ్ ॥85**

పూర్వము కుసంస్కారమును, చెడ్డపనులు చేసేవారిని నిరోధించడం కొరకు, అట్టివారిని మార్చి, మంచి మార్గంలోనికి మళ్ళించే సాధుప్రయోజనాన్ని సాధించడంకొరకు, క్రొత్త ఉత్సాహంతో, సాహసంతో పూనుకొనేవారు. దానివలన చెడ్డపనులు చేసేవారిసంఖ్య అల్పంగా ఉండి, సమాజం అప్పుడప్పుడు కల్లోల పరిస్థితికి గురిఅయ్యేది.

**క్రియా కలాపేష్వేవ దైనికేషు సుమీలయేత్ ।**
**భూయో భూయోఽభివర్ధంతీః ప్రవృత్తీః పశుజాస్తథా॥ 86**

నిత్యదైనందిక జీవితంలో, పశుప్రవృత్తి కల్గి, విధ్వంసకర శక్తులుగా మారుతున్న వారి కార్యకలాపాలను అదుపుచేస్తూ, అనేక పర్యాయాలు వారి చర్యలను గమనిస్తూ, వారిలో మార్పు తెచ్చే ప్రయత్నం చేయవలెను. తద్వారా సామాజిక హితము కొరకు పరోక్షంగా సజ్జనులు పాల్గొనెదరు. దుర్జన ప్రవృత్తి నిరోధించ బడుతుంది.

**నిరసితుం శ్రమస్తూగ్రః స్వీకర్తవ్యో భవేత్యుక్తాః ।**
**ఆత్మనాఽత్మని సంఘర్ష అయమిత్యభిమస్యతామ్ ॥ 87**

ఇట్టి దుష్ప్రవృత్తిని నిరసిస్తూ, సత్ప్రవృత్తిని ప్రోత్సహించే కర్తవ్యాన్ని స్వీకరించాలి. ఇది దుష్ప్రవృత్తిగల ఆత్మకు సత్ప్రవృత్తిగల ఆత్మకుగల సంఘర్షణగా భావించవలెను. మంచి, చెడుల మధ్యగల జరిగే ఈ సంగ్రామంలో మంచి చిరకాలం భాసిల్లే విధంగా సజ్జనులు శ్రమించవలెను.

**సర్వైరేవార్జునస్యేయం, గ్రాహ్యా సద్భూమికా సదా ।**
**మహాభారత సంగ్రామే కర్మక్షేత్రేఽత్ర మానవైః ॥ 88**

మహాభారతయుద్ధంలో అర్జునుడు 'కర్మయోగి' గా మారి, కర్తవ్యాన్ని ఎలా నిర్వర్తించాడో, అలాగే ప్రతిఒక్కరూ దుష్టనాశనానికి ప్రయత్నించాలి. ఈ ప్రయత్నానికి ఎప్పుడూ శ్రీకృష్ణుని రూపంలో దైవశక్తి తోడ్పడుతుంది. కురుక్షేత్రాన్ని ధర్మక్షేత్రంగా, కర్మక్షేత్రంగా భావించి మన వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, ధర్మరక్షకులుగా మారాలి.

**ఆరణ్యకస్య సత్రస్య సమాధానం తృతీయకమ్ ।**
**సర్వేభ్యోఽరోచతాలం, తద్దేవం చ జీవనంప్రతి ॥ 89**

ఆరణ్యకులకు (ఆటవిక సంస్కృతిగలవారికి) తగిన సమాధానం, మూడవ సమాధానంగా లభించింది. అనగా పశుప్రవృత్తిని నిరోధించడం, ధర్మప్రవృత్తిని కల్గించడం అనేవి మొదట రెండు సమాధానాలు అయితే వారిలో దైవంపట్ల ఆరాధన, సమాజంపట్ల సేవాతత్పరత కల్గించడం మూడవ సమాధానంగా నిలిచినది. అందరూ దానినే ఆదర్శంగా తీసుకుని జీవనశైలిగా మలుచుకోవాలి.

**శ్రద్ధోద్గతా చసంకల్పః శ్రోతౄణాం హృదయే తతః ।**
**సముత్పన్నః జీవనంతు పరమం దైవమిత్యహో ॥ 90**

సత్పురుషుల వచనములను వినెడి శ్రోతల హృదయాలలో శ్రద్ధ పరిఢవిల్లి, సత్సంకల్పం కలుగుతుంది. శ్రీకృష్ణ భగవానుని గీతాబోధను వినిన అర్జునుడు ఎలా భక్తి శ్రద్ధలతో కృతకృత్యుడయ్యాడో, పరమోత్కృష్టమైన దైవత్వం సిద్ధించి, ఆ పురుషుడు, పరమపూజనీయుడౌతాడు.

**మత్వా, పరిష్కృతం పూర్ణం ప్రసన్నం కర్మశక్తితః ।**
**ప్రసంగః ఈదృశోఽయం తుజ్ఞాతుం తత్రాఽధికాధికమ్ ॥ 91**

కర్మత్వశక్తి నుండి పరిపూర్ణమైన, ప్రసన్నమైన పరిష్కృతిని తెల్సుకుని, అధికాధికమైన ఉత్సాహంతో తెల్సుకొనుటకు ప్రయత్నించవలెను. ఇటువంటి ప్రాసంగిక చర్చలు, మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించి కర్తవ్యాన్ని ప్రబోధించును.

**ఔత్సుక్యం హి మహర్షీణాం, తీవ్రతామభజత్తతః ।**
**శ్వోఽధికం జ్ఞాస్యతే సారాంశః, కాలేస్యుః, సూత్రికాజ్ఞయా ॥ 92**

మహర్షుల ఉత్సాహం, తీవ్రమైన పట్టుదలను పరిగణించి, సూత్రకారుల ఆజ్ఞానుసారంగా, భవిష్యత్తులో మరెందరో శ్రోతలు విని, తెల్సుకుని, ఆసారాంశాన్ని క్రమం తప్పకుండా ఆచరించగలరని విశ్వసిద్దాం.

ఈవిధంగా ప్రజ్ఞోపనిషత్తులో శ్రీ పిప్పలాద మహర్షి, శ్వేతకేతు మహర్షుల సంభాషణ ద్వారా యుగదర్శనాన్ని, యుగసాధనాది విషయాలను, "సంయమశీలత, కర్తవ్య పరాయణతా" అనే నాలుగవ అధ్యాయం ముగిసింది.

వచ్చే సంచికలో 5వ అధ్యాయమైన 'ఉదారభక్తిభావన' అనే ప్రకరణలో గురుదేవుల మార్గదర్శనంలో మరెన్నో క్రొత్త విషయాలను తెల్సుకుందాం.

– స్వేచ్ఛానువాదం : *శ్రీ మారెళ్ళ కామరాజు*

ప్రతిపనికి ఇతరులను అర్థించేవాడు సాఫల్యాన్ని సాధించలేడు.

### యుగ గీత-7 : రెండవ అధ్యాయం-సాంఖ్య యోగము

# పరమాత్మలో అధిష్టితులైనవారే స్థితప్రజ్ఞులు

కిందటి సంచికలో యుగధర్మం, సమత్వం మరియు యోగస్థులమై ఎలా పని చేయాలి అనేది తెలుసుకున్నాము. కర్మలోని కౌశలం యోగమని, కర్మబంధనం నుండి విముక్తే మోక్షానికి మార్గమనీ మహాకాలుడు అర్జునుడి ద్వారా మనకు చెబుతున్నాడు. అర్జునుడి శోకాన్ని, సంశయాన్నీ పోగొట్టి, అతనిలో శిష్యత్వాన్ని జాగృతపరచి, దేహాతీత ఆత్మను గురించి తెలియచేసి, శరీరంతో స్వధర్మాచరణ ఏ విధంగా చేయాలో చెప్పి, అతనిని స్థితప్రజ్ఞుని గురించి తెలుసుకోగల స్థాయికి భగవంతుడు తీసుకువచ్చాడు. ఏ విధంగా బ్రహ్మయందు ప్రతిష్ఠితుడయ్యే యోగిగా మారవచ్చు, స్థితప్రజ్ఞుని లక్షణాలేమిటి అనేది ఇప్పుడు చదువుతాము.

‘ఓ కేశవ! సమాధిస్థితుడై పరమాత్మ ప్రాప్తిని పొందిన స్థితప్రజ్ఞుని యొక్క లక్షణములేంటి? అతడు ఎలా మాట్లాడతాడు? ఎలా కూర్చుంటాడు? ఎలా నడుస్తాడు? (2.54) అని అర్జునుడు శ్రీకృష్ణుడ్ని ప్రశ్నిస్తున్నాడు. అర్జునుడికి ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. స్థిరబుద్ధిగలవాడే పరమాత్మప్రాప్తిని పొందుతాడు, అందుకే పరమాత్మను పొందిన స్థిరబుద్ధిగలవాడి లక్షణాలేంటి అని అడుగుతున్నాడు. లేకపోతే భోగాలలో ఆసక్తి కలవాడికి అందులోనే ఆనందం దొరుకుతుంది. ఈ బుద్ధివాదమనే చెడు చక్రం నుండి బయటపడడానికే పరమపూజ్య గురుదేవులు మనకు యుగానుకూల ఆలోచనలను అందించారు. ప్రతిభగలవారు సమాజానికి నేతృత్వం వహించడానికి ముందుకు వచ్చేందుకు ఈ ఆలోచనాధార ఎంతో ఉపయోగపడుతుంది. నేడు జ్ఞానవిజ్ఞానాలకు ఎన్నో శాఖలు, ఉపశాఖలు వచ్చాయి; జీవితంలో ఎంత మెరిసినా నిజానికి అందరూ సంపాదించేది. ‘ప్రొఫెషనల్ ఇంటెలిజెన్స్’ మాత్రమే. బుద్ధి ప్రజ్ఞగా రూపొందితే కాని మనిషి సమాధి స్థితిని పొందలేడు. స్వార్థబుద్ధి పోతేగాని స్థితప్రజ్ఞత్వం రాదు. నేడు సమాజంలోని సమస్యలన్నింటికీ కారణం దృష్టికోణంలోని లోపం. బుద్ధివాదం నుండి బయటపడి, నిష్కామ కర్మ ప్రవృత్తి పెంచుకోవాలని గురుదేవులు మనకి సందేశాన్నిస్తున్నారు. త్యాగం విలువ తెలుసుకోవాలి. త్యాగం, బలిదానం వల్ల కలిగే ఆనందాన్ని, శ్రేయస్సును స్థిరబుద్ధిలేని వారికి తెలియవచ్చేలా చేయాలి. గురుదేవులు చాలాసార్లు ఉపనిషత్తులోని ఈ వాక్యాన్ని చెబుతూండేవారు. **‘త్యాగేనైకే అమృతత్వ మానుశుః’**. త్యాగం వల్లనే అమృతం లభిస్తుంది. బుద్ధివాది అయిన మనిషి త్యాగంలోని మర్మాన్ని, ఇవ్వడంలోని ఆనందాన్ని ఎలా అర్థం చేసుకోగలడు! నీ బుద్ధి మోహమనే ఊబిలోనుండి బయట పడినప్పుడే వెంటనే నీకు భోగాల పట్ల వైరాగ్యం కలుగుతుంది అని శ్రీకృష్ణుడు ఇదివరకే చెప్పాడు. ఇప్పుడు, ‘అర్జునా! మనస్సులోని కోరికలన్నీ పూర్తిగా తొలగిపోయి ఆత్మద్వారా ఆత్మయందు సంతుష్టుడైన వానిని, అనగా పరమాత్మ సంయోగం వలన ఆత్మానందాన్ని పొందినవాడిని స్థితప్రజ్ఞుడని అంటారు’.(2.55) అని చెపుతున్నారు.

శ్రీకృష్ణుడు మళ్ళీ మళ్ళీ ఒకే విషయం చెపుతున్నారు. కోరికల్ని త్యజించి, మోహాన్ని పోగొట్టుకుంటేనే గురుశిష్యుల మధ్య శాశ్వత సంబంధం ఏర్పడుతుంది. మహామానవులుగా మారడానికి దారి తెరుచుకుంటుంది. గురువును ‘భగరోగహరుడు’ అంటారు. మనలో అస్థిరత్వం పోయి, పరమాత్మపైనే బుద్ధిని స్థాపించాలని అనుకుంటే, మన లోపల పవిత్రత కూడా పెరుగుతుంది. త్యాగమార్గాన్ని ఎంతగా అనుసరించుకుంటూ పోతామో, అంతగా బుద్ధి ప్రజ్ఞగా పరమాత్మయందే స్థిరమై ఉంటుంది, అంటే మనం స్థితప్రజ్ఞులమవుతాము. **‘తస్య ప్రజ్ఞ ఋతుంభర’** అని యోగ దర్శనంలో చెప్పబడి ఉంది.

తను పెడదోవ పట్టకుండా, అలౌకిక అవకాశాల ద్వారం తెరిచే ప్రక్రియ భగవంతుడు మొదలుపెట్టినట్టు అర్జునుడు తెలుసుకుంటున్నాడు. అందుకే, అసలు స్థితప్రజ్ఞత్వం అంటే ఏంటి, అలాంటి వాడి లక్షణాలేంటి అని తెలుసుకోవాలనుకుంటున్నాడు. మనలో చాలా మందికి, యువతకు, ప్రధానమంత్రి దినచర్య ఎలా ఉంటుంది, నటీనటుల రొటీన్ ఎలా గడుస్తుంది తెలుసుకోవాలనే ఉత్సాహం ఉంటుంది. పరమేశ్వరుడి సన్నిహితుడు, తన సర్వస్వాన్నీ త్యజించి పరమసుఖాన్ని సొంతం చేసుకున్నవాడు, పరమేశ్వరుని గురించే ఆలోచించే భావన చేసేవాడు ఎలా ఉంటాడు అనే ప్రశ్న రావాలి మనందరికీ. ఒక స్థితప్రజ్ఞుని గురించి తెలుసుకోదలుచుకుంటే గురుదేవుల జీవితంలోని ప్రతి కోణాన్నీ, పక్షాన్నీ నిశితంగా అధ్యయనం చేయాలి.

జీవితంలోని అన్ని పక్షాల గురించి గురుదేవులు రాయడమే

**మనం ఏమి చేశామన్నది ముఖ్యం కాదు, ఏ భావంతో చేశామన్నది ముఖ్యం.**

కాదు, జీవించారు కూడా. మనిషి యొక్క ఆలోచనలనే అతని ఉన్నతికైనా, దుర్గతికైనా కారణము. అందుకే ఆలోచనలలో క్రాంతి రావాలని శిష్యులకు, సాధకులకు ప్రేరణనిచ్చారు. మన బుద్ధి సరైనదైతే, ఆలోచనలు సరైనవైతే, వాటి నిర్మాణ ప్రక్రియ మనకొస్తే లక్ష్యాన్ని ఎలా సాధించవచ్చు కూడా మనకు అర్థమవుతుంది. పరమాత్మతో నిత్య సంయోగం ఎలా కలుగుతుందో తెలిసిపోతుంది. ధ్యాన–ధారణలు మొదలైన యోగోపచారాలు, తపోసాధనలు వ్యక్తి యొక్క ఆలోచనలు సవ్యమైన దిశలో పెట్టటానికేనని గురుదేవులు స్పష్టంగా జీవించి చెప్పారు. 1969 అఖండజ్యోతిలో గురుదేవులు ఇలా రాసారు. కాలం గడిచినకొద్దీ, **ఆలోచన అనే ఒక తత్త్వం ఉందని, మానవ జీవనం మీద దాని ప్రభావం ఉంటుందనే విషయాన్ని మనం మర్చిపోయాము.** ఈ మరుపుకు కారణం – మనం జీవన నిర్మాణం గురించి, మనిషి ఎదుర్కొనే స్పష్టమైన సమస్యలను గురించి ఎప్పుడూ ఆలోచించము, మాట్లాడము, చదవము, వినము. ఒక చెంచికకు రత్నాల రాశి యొక్క విలువ, గొప్పతనం గురించిన చర్చ ఎంత నిరర్థకంగా అనిపిస్తుందో, మనకు కూడా వాటి చర్చ అంత నిరర్థకంగా అనిపిస్తుంది. మనకి తెలియని విషయాల గురించి ఆసక్తిని ఎలా చూపించగలం? మానవ జీవితం యొక్క సర్వోపర శక్తి, సంపద ఆలోచనల గురించి ఎవరూ మనకి ఏమీ చెప్పకపోతే మనకు మాత్రం ఏం తెలుస్తుంది? అందుకే మనము ఆ క్షేత్రానికి సంబంధించినంత వరకు అజ్ఞానులం, అంటరానివాళ్ళం.

వ్యక్తి సరైన రీతిలో ఆలోచించి, సద్బుద్ధిని వికసింపచేసుకుని, జీవించే కళను నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతోటే గురుదేవుల విచార క్రాంతి అభియానం (ఆలోచనలో క్రాంతి) రూపుదిద్దబడింది. జీవితాన్ని కళగా జీవించాలనే ఆలోచన కలిగి, భోగవస్తు సామగ్రి పట్ల సరైన దృష్టి వికసిస్తే జీవితంలో నిష్కామకర్మ ఆచరించే ప్రవృత్తి వస్తుంది. ఈ దిశలో పయనించడం మొదలుపెట్టగానే మొట్టమొదట మోహం నుండి బయటపడతాము, అప్పుడు స్థితప్రజ్ఞులవ్వడానికి మార్గం స్పష్టంగా కనిపిస్తుంది. కోరికలన్నిటినీ త్యజించి, ఆత్మ ద్వారా ఆత్మయందే తృప్తి పొందేవాడిని స్థితప్రజ్ఞుడంటారని భగవంతుడు చెప్తున్నాడు.

**ప్రజహాతి యదా కామన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥ 2.55**

అర్జునుడి జిజ్ఞాస ఆధారంగా, ఈ శ్లోకంలో చెప్పబడినట్టి స్థితప్రజ్ఞుని గురించి తెలుసుకోవాలి. అటువంటి మహాపురుషుల తత్త్వాన్ని తెలుసుకోవాలని భగవంతుడు ఇదివరకే చెప్పాడు. అసలు స్థితప్రజ్ఞుడు ఎలా ఉంటాడు, ఎలా మాట్లాడతాడు, ఎలా నడుస్తాడు అని అర్జునుడు అడిగితే, ఇదే మూర్ఖత్వం? బాహ్యపు అలవాట్లతో స్థితప్రజ్ఞుడ్ని ఎలా తెలుసుకుంటాము అనిపిస్తుంది. **'యో మాం వేత్తి తత్త్వతః'**, నా తత్త్వాన్ని తెలుసుకున్నవాడు నా మార్గాన్ని తెలుసుకున్నట్టే అని కృష్ణుడు చెప్పాక కూడా అర్జునుడు ఈ విధమైన ప్రశ్న ఎందుకు అడిగాడో తెలుసుకోవాలి. స్థూల కర్మేంద్రియాలకు తెలిసే విధంగా, అంటే కంటి చూపు ద్వారా చూసి, అర్థం చేసుకోగలిగేది, మాట విధానం ఎలా ఉంటుంది, నడకలో గాంభీర్యం ఎలాంటిది, మొదలైన బహిరంగ విహారం మనఃస్థితిని కనబరుస్తుంది. కార్యకర్తలు, లోకనాయకుల స్థాయి వారి బాహ్యస్వరూపంతోనే ముందుగా తెలుసుకోవచ్చు, ఆ తరువాత మాటలు పనిచేస్తాయి.

భగవంతుని విలక్షణ జవాబు – మనిషిలో స్థితప్రజ్ఞత్వం ఉదయించగానే కోరికలన్నిటినీ త్యజిస్తాడు. ఆత్మద్వారా ఆత్మయందు సంతృప్తి కలిగి ఉంటాడు. కోరికల నుండి తేరుకుని ఆత్మరాజ్యంలో సంచరించే వాడు స్థితప్రజ్ఞుడు.

**విహాయ కామాన్ యః సర్వాన్ పుమాంశ్చరతి నిః స్పృహః।**
**నిర్మమో నిరహంకారః స శాంతిమధిగచ్ఛతి ॥ 2.71**

**అర్థం :–** కోరికలన్నింటినీ త్యజించి, మమతా, అహంకార, స్పృహారహితుడై చరించు పురుషుడు శాంతిని పొందును.

అంటే మానసిక శాంతి, జీవన యోగం అన్నిటికీ ఆధారం ఒక్కటే – విహాయ కామస్యః – అన్ని కోరికల (ఇహలోకంలోనూ, పరలోకంలోనూ) పరిపూర్ణ త్యాగం. ఏ కోరికలూ లేకుండా శాంతంగా కనిపించడమే నిజమైన శిష్యుడికి, సంతులిత (balanced) వ్యక్తికి గుర్తు. ఎవరి మీద మోహం లేకుండా ఉంటాడు. ఇలాంటివాడు మాత్రమే స్థితప్రజ్ఞుడు కాగలడు. కోరిక – భక్తి, కోరిక – ప్రేమ ఒక చోట ఉండలేవు. కోరికలున్నంత కాలం బుద్ధి స్థిరంగా ఉండదు. కోరిక వదిలివేస్తే, భక్తి ముక్తినిస్తుంది. కోరికలు ఆకర్షిస్తూంటే, భక్తి విసర్జిస్తూంటుంది. కోరికలనుంచుకుని, అస్థిర బుద్ధికలవాడు పరమాత్మ చైతన్యంలో స్థిరంగా ఎలా ఉండగలడు? బుద్ధి స్థిరంగా ఉన్నవాడే భక్తిప్రజ్ఞుడు కాగలడు. అలా జరిగాక ప్రాపంచిక విషయాల మీద ఆసక్తి ఉండదు; సృష్టి కేంద్రంలో స్థిరమై, అన్నిటికీ తానే కేంద్రబిందువని గుర్తిస్తాడు. బుద్ధికి అతీతంగా ఉన్నట్టు గమనిస్తాడు. ఇక భూమిమీద ప్రపంచమేదీ తనను విసిగించలేదని తెలుసుకుంటాడు. పేరెందుకు రాలేదు, నన్నెందుకు కీర్తించట్లేదు, నన్నెందుకు అవమానించారు ఈ విషయాలేమీ విసిగించలేవు. చిన్న పిల్లవాడు బొమ్మ విరిగిపోతే

**దృష్టికి అనుగుణంగా సృష్టి జరుగుతుంది.**

ఏడుస్తాడు, అలాగే స్థిరత్వం లేని వ్యక్తి కోరికలు తీరకపోతే ఏడుస్తాడు, బాధపడతాడు, ఒత్తిడికి గురవుతాడు. పెద్ద పిల్లవాడికి బొమ్మ అంత ముఖ్యం కాదు, అలాగే ఒక పరిపక్వ వ్యక్తి కూడా స్థితప్రజ్ఞుడై ఉంటాడు. రామకృష్ణ పరమహంస సోదరుని కొడుకు చనిపోయాడు. దిండులోంచి దూది తీసినట్టు అనిపించిదాయనికి. ఆయనంతటి స్థితప్రజ్ఞుడు అంత సునాయాసంగా ఈ విషయాన్ని దులిపేసారు. కోరికలనుంచి విముక్తిని పొంది ఆత్మలో స్థిరపడితే ఇటువంటి పరిస్థితి వస్తుంది.

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥ 2.56**

**అర్థం :–** దుఃఖానికి కుంగిపోనివాడు, సుఖాలకు పొంగిపోనివాడు, ఆసక్తిని, భయక్రోధాలను వీడినివాడు అయినట్టి మననశీలుడు (ముని) స్థితప్రజ్ఞుడనడును.

చాలా కారణాల వల్ల బాధలు కలుగుతాయి, కాని స్థితప్రజ్ఞుడు అటువంటి పరిస్థితులను సునాయాసంగా తట్టుకోగలుగుతాడు. సంతోషం కూడా కోరుకోడు. రాగ, భయ, క్రోధాలకు అతీతుడై ఉన్నత స్థాయి మానసిక స్థితిని పొందుతాడు. మనలాంటి సామాన్య వ్యక్తులు ఎప్పుడూ సంతోషాలు కావాలని కోరుకుంటూ ఉంటారు, బాధలను తట్టుకోలేరు. ఇదే మనకీ, స్థితప్రజ్ఞులకీ తేడా.

దుఃఖాన్ని తపస్సు చేసుకో, సుఖాన్ని యోగం చేసుకో అని గురుదేవులు చెప్పారు. కాని చాలా వరకు దుఃఖాన్ని దేవుడు వేసే శిక్ష అనుకుంటారు, సంతోషాన్ని భోగంగా మార్చేసుకుంటారు. భోగమనేది చివరికి దుఃఖంగానే పరిణమిస్తుంది. కష్టం వచ్చినప్పుడే అందరూ దేవుడిని గుర్తు తెచ్చుకుంటారు, సంతోషంలో ఎవ్వరూ తలచుకోరు. సంతోషాన్ని యోగంగా మార్చుకుని, ప్రతి క్షణం భోగిలాగా కాకుండా, ఒక యోగిలాగా వ్యవహరిస్తే ఎప్పటికీ కష్టాలు, నష్టాలు మనల్ని బాధించవు. 'జీవించే కళ', 'సంజీవని సాధన', 'జీవన దేవతా సాధన – ఆరాధన', 'ఆత్మ కథ – అనే ఐతిహాసిక రచనల్లో అసలు మనం యోగస్థులమెలా అవ్వాలి అన్న విషయాన్ని గురుదేవులు విశదీకరించారు. స్థితప్రజ్ఞులమవడానికి మొదటి మెట్టు – సుఖాన్ని యోగంగాను, దుఃఖాన్ని తపస్సుగానూ మార్చుకోవడం. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖదుఃఖాలు వస్తూంటాయి, వాటిని ఎదుర్కోవటం తప్పదు. అవన్నీ మనలను యోగులుగా, తపస్వులుగా చేయడానికే వస్తాయి. తరువాతి శ్లోకాల్లో స్థితప్రజ్ఞుని లక్షణాలు చెపుతూ శ్రీకృష్ణుడు –

**యః సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్ ।**
**నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 2.57**

**అర్థం :–** దేనియందును మమతాసక్తులు లేనివాడు, అనుకూల పరిస్థితులయందు హర్షము, ప్రతికూల పరిస్థితులయందు ద్వేషము మొదలైన వికారాలకు లోనుగానివాడు స్థితప్రజ్ఞుడనబడును.

**యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః ।**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 2.58**

**అర్థం :–** తాబేలు తన అంగాలను అన్ని వైపులనుండి లోపలికి ముడుచుకున్నట్లు, ఇంద్రియాలను ఇంద్రియార్థముల (విషయాదుల) నుండి అన్ని విధముల ఉపసంహరించుకొనిన పురుషుని యొక్క బుద్ధి స్థిరముగా ఉన్నట్లు భావించాలి.

అంటే, ఎవరి ప్రజ్ఞ ఆత్మలో స్థిరంగా ఉంటుందో వారికి ఎవరి పట్ల విశేషమైన మోహం కలిగి ఉండదు. పరమాత్మ చైతన్యం యొక్క ఏ ఒక్క అంశ ఉన్నా అక్కడే స్నేహం, దయ పుడతాయి. మానవుడి జీవితంలో ఇదే అన్నిటికన్నా పెద్ద పరీక్ష. ఆధ్యాత్మిక పురుషార్థం ప్రసాదించే గొప్ప వరం – మనిషి స్వయంగా మమత, దయలకు అతీతుడై పరమాత్మ చైతన్యాన్నే ప్రేమిస్తూ, వారికి అనుకూలంగా పనిచేస్తాడు. ఒక ప్రత్యేకమైన వ్యక్తి పట్ల స్నేహం మనల్ని బంధిస్తుంది. ఇష్టమైన వస్తు ప్రాప్తి వల్ల మనకు హర్షం అది లభ్యం కాకపోతే, క్లేశం కలగకపోవడం ఒక సౌభాగ్యం. ఈ మానసిక స్థితిని చేరుకున్నవారే దీన్ని అర్థం చేసుకోగలరు. ఈర్ష్య, ద్వేషాలు అన్నిటికన్నా పెద్ద కీటకాలు, అవి వ్యక్తిత్వమనే వస్త్రాన్ని తిని తిని చింపి పీలికలు చేసి నాశనం చేస్తాయి. ఈ దుర్గుణాలే ప్రగతిపథంలో పయనించే వ్యక్తిని దుర్గతి అంచుల్లోకి నెట్టివేస్తాయి.

గాయత్రి తీర్థమైన శాంతికుంజ్ క్షేత్రంలోని అసంఖ్యాకులైన గాయత్రి పరిజనుల్లో ఎక్కడైనా పరమాత్మ చైతన్యం యొక్క చిన్న అంశ కనిపించినా ఆ చైతన్యాన్ని ప్రేమించండి, మనిషిని కాదు. వ్యక్తిని కాక అతను చేసే పనిపట్ల ప్రేమ మనలను ఆధ్యాత్మిక శిఖరాలకు చేరవేస్తుంది. పరమాత్మ చైతన్యం పరమాత్ముని గుణాలన్నింటినీ కలిగి ఉండి, లౌకిక బంధాలకు అతీతంగా సాగుతూ వ్యక్తి జీవితంలో ఒక క్రాంతిని తెస్తుంది.

తరువాతి శ్లోకంలో, ఏ విధంగా తాబేలు తన అవయవాలన్నింటినీ, దృఢంగా కనిపించే పైకప్పులోపల దాచుకుని కాపాడుతుందో, మనిషి కూడా తన ఇంద్రియాలను ముడుచుకోవలి అని చెప్పడంలో అర్థం, ఇంద్రియాలకు దాసుడుగా మారకుండా వాటిని నియంత్రించే సాధన చేయాలి. ఎవరైతే ఈ సాధనలో, విషయభోగాలపట్ల ఇంద్రియ నియంత్రణ

దృష్టి మార్చుకుంటే కొత్త సృష్టిని దర్శిస్తావు.

సాధించడంలో ప్రావీణ్యం పొందుతాడో అతడు ఋతుంభర ప్రజ్ఞలో స్థితుడై, స్థితప్రజ్ఞుడు, మహాపురుషుడు అవుతాడు.

శ్రీరామకృష్ణ పరమహంస పరమశిష్యులైన అఖండానంద మహరాజ్‌గారు వారి గురుదేవులను గాయత్రీ జప సాధన యొక్క ప్రక్రియ గురించి అడిగేవారు. ఆయన చెప్పేవారు – ఏ విధంగా సంధ్య గాయత్రిలో విలీనమౌతుందో, గాయత్రి ఓంకారంలో విలీనమౌతుందో, ఓంకారం ఆత్మతత్త్వంలో విలీనమౌతుందో, అదేవిధంగా మనం గాయత్రి జపం చేయాలి. ఒక్కొక్కటిగా విలీనమౌతూ మనల్ని మనం సమకూర్చుకునే ప్రక్రియను చెప్పేవారు. ఏ విధంగా తాబేలు తన అవయవాలను సమీకరించుకుంటుందో, అదే సాధన బుద్ధిని సూక్ష్మాతిసూక్ష్మంగా మార్చి సవితలో స్థాపిస్తుంది, సాధకుడ్ని స్థితప్రజ్ఞుడ్ని చేస్తుంది. ఈ ఉదాహరణ శ్రీరామకృష్ణ మఠం యొక్క డైరీ నుండి సేకరించబడింది; ఇది సాధన ద్వారా స్థితప్రజ్ఞులమయ్యే కళను వివరిస్తోంది. ఇంద్రియాలను మనస్సులో, మనస్సును చిత్తంలో, చిత్తాన్ని అహంకారంలో, అహంకారాన్ని ఆత్మలో (పరిశుద్ధ అహంలో), ఆత్మను పరమాత్మ తత్త్వంలో సమీకరించే ప్రక్రియలో స్థితప్రజ్ఞుడు నిష్ఠాతుడై ఉండాలి. ఈ ప్రక్రియ జీవిత సాధనగా మారిపోతే మన అస్తిత్వం యొక్క అణువణువులో పరమాత్మ చైతన్యం వర్షిస్తుంది. గీతాచార్యుడు తాబేలును ఉదాహరణగా చెప్పి సాధనా విజ్ఞానంలోని మర్మాన్ని మనముందుంచారు.

ఈ ప్రక్రియ బలవంతంగా జరగదని చెప్తున్నారు. మనస్సును సమాధానపరచకుండా బలవంతంగా ఇంద్రియాలను నిగ్రహించాలనుకుంటే శరీరాన్ని కష్టపెట్టినవాళ్ళమవుతాము కాని కోరుకున్నది సిద్ధించదు. మనము గొప్ప త్యాగులం, తపస్వులం అయినప్పటికీ, అస్వాదవ్రతం చేయడానికి ఉప్పుని, తీపినీ లేదా రెండింటినీ వదిలేసినా కూడా మనస్సులోంచి రుచిని తొలగించకపోతే రుచికి అతీతులం కాలేము. మనస్సు నుండి స్వాదేంద్రియాలను నియంత్రించాలి.

ఉప్పు తినడం మానేస్తే హై బ్లెడ్ ప్రెషర్ లాంటి రోగాలు రావు, కిడ్నీలు పాడుకావు, శరీరంలో నీరు పేరుకోదు. తీపి తినడం మానేసినా చాలా రోగాలు రావు. కాని తీపి పదార్థాలు ముందు కూర్చుని, లోలోపల ఆస్వాదిస్తూ, కంట్రోల్ చేసుకుంటున్నాను, లేకపోతే హాయిగా ఆనందించేవాడిని అని అనుకుంటారు. అప్పుడది తపస్సు కాదు, యోగం కాదు. మనం ఇంద్రియాలను నియంత్రించాలంటే మనస్సు చేరాలి – మనస్సు నుండి చిత్తాన్ని చేరాలి, అక్కడే అలవాట్లు, చిరకాల సంచిత సంస్కారాలు చేరి ఉంటాయి. చిత్తం నుండి అహానికి, శుద్ధ అహంలోకి ప్రవేశించాలి.

ఇంద్రియాలను ఇంద్రియ విషయాల నుండి తప్పించి ప్రజ్ఞలో స్థిరపరచడంలో ఉద్దేశ్యం ఇదే. మనస్సును బాహ్యేంద్రియ రుచి నుండి తప్పించి రసో వైసః అన్నట్లు పరమాత్మరుచిలో జోడించాలి. అది విలక్షణమైన ఆనందక్షేత్రం. ఆ అనుభూతి కలిగాక ఇంద్రియవిషయాల మీద విరక్తి కలుగుతుంది. అప్పుడు మనస్సు కోరికల్ని కోరుకోదు, కళ్ళు చెడ్డవాటిని చూడాలనుకోవు, ఇంద్రియాలను కుళ్ళబరిచే ఆశలు కలగవు. ఇంద్రియాలను మాత్రమే నియంత్రించినవాడు విషయాల నుండి నివృత్తిని పొందుతాడే తప్ప ఆసక్తి నుండి నివృత్తి పొందదు. పరమాత్మ సత్తాలో అధిష్ఠితుడౌతాడు. కనుక స్థితప్రజ్ఞుడు ఆసక్తి నుండి నివృత్తుడవుతాడు. వచ్చే సంచికలో స్థితప్రజ్ఞుని గురించి మరింత వివరంగా తెలుసుకుందాం.

*– అఖండజ్యోతి, నవంబరు 1999*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

## సరస్వతీ శిశుమందిరాల ద్వారా భారతీయ సంస్కృతీ పునరుద్ధరణ

భారతీయ సంస్కృతి పునరుద్ధరణలో భాగంగా రాష్ట్రములోని 524 సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ప్రతి సంవత్సరము మాఘ శుద్ధ పంచమి అనగా శ్రీ పంచమి రోజున శ్రీ సరస్వతీ మాత జన్మదినాన్ని పురస్కరించుకొని "అక్షరాభ్యాస సంస్కారాన్ని" జరిపే కార్యక్రమానికి శ్రీకారము చుట్టారు. దీనిలో భాగంగా 5000 మంది బాలలకు అక్షరాభ్యాస సంస్కారాన్ని చేయుట జరిగినది. అట్లే పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞాన్ని ప్రతి సంవత్సరము 524 ఉన్నత పాఠశాలలలో క్రమము తప్పక జరుపుచూ భారతీయ సంస్కృతికి పునరుద్ధరించడానికి, తద్వారా లోక కళ్యాణమునకై తమ వంతు కృషిని అందించుచున్న ఈ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలల యాజమాన్యమును గాయత్రీ చేతనా కేంద్రము అభినందించుచున్నది. ఇతర పాఠశాలల యాజమాన్యాలు కూడా దీనిని స్ఫూర్తిగాతీసుకొని లోకకళ్యాణానికై తమ వంతు బాధ్యతను తీసికొనవలసినదిగా కోరుతున్నాము. ఈ 524 శిశు మందిరాలను అభినందించుచూ, ప్రోత్సాహముగా శ్రీ టి.ఎస్.ఎన్.ప్రసాద్, ఎల్.ఐ.సి. డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఒంగోలు వారి ఆర్థిక సాయంతో అక్టోబర్ 2011 వరకు యుగశక్తి గాయత్రి మాస పత్రికను వీరికి పంపబడుతుంది.

**సద్గుణాలు సిల్కు దుస్తులలో ఎంత శోభిస్తాయో సాదా దుస్తులలో అంతే శోభిస్తాయి.**

సూర్య విజ్ఞానం - 6

# వైదిక వాఙ్మయంలో సూర్యుని మహత్యం

వైదిక వాఙ్మయంలో సూర్యభగవానుని మహత్యం, విశ్వ సంచాలన, ఆయన చేతనాత్మక భూమిక, సూర్యోపాసన వల్ల కలిగే లాభముల వివరణతో నిండి ఉన్నాయి. వేదములలో సూర్యుని జీవనం మహా ప్రేరకుని రూపంలోను, పృథ్విని తన గర్భం నుండి ఉత్పన్నం చేసిన సృజేత రూపంలోను, సమస్త ప్రపంచాన్ని నడిపింపజేసే చైతన్యములలో ప్రముఖుడైన గ్రహాధిపతిగా భావిస్తారు. వైదిక ఋషుల దృష్టిలో సూర్యుడు చరాచర విశ్వ సంచాలకుడేగాక, ఘడియలను, క్షణాలను, అహోరాత్రులను, మాసాలను, ఋతువులను కలిగించే వాడు కూడాను, ఋగ్వేదంలోను సూర్యుని ఈ విధంగా వ్యాఖ్యానం చేశారు.

**సరతి గచ్ఛంతి వా సురయతి ప్రేరయతి వా తత్తద్ వ్యాపారేషు కృత్యం జగతిది సూర్యః । యద్వా నుష్ట ఈర్యతే ప్రకాశ పవర్షణాది వ్యాపారేషు ప్రేర్యతే ఇతి సూర్యః**

*(1-114-3 ఋగ్వేదసాయణ భాష్యం)*

సూర్యుని గురించి 14 సూక్తములలో ఋగ్వేద ఋషి మనకు చెబుతారు – **"అగ్నేరనీకం బహ్వతః సంపర్య దివి శుకం యజతం సూర్యస్య"** *(10-7-3)* అంటే ఆకాశంలో సూర్యుని జ్వలించే ప్రకాశం రూపంలేని అగ్నిదేవుని ముఖము. ఇంకా **శం నః సూర్య ఉరుచక్షా ఉదేతు** *(7-35-8)* అంటే దూరద్రష్ట **"విశ్వస్య జగతో వహంతి"** అని చెప్తూ ఋషి సూర్యుని జగత్తు యొక్క పాలకునిగాను, రక్షకుడిగాను చెప్పారు.

సూర్యుడు ఆదికాలం నుండి చరాచర జగత్తుకు ఆత్మగాను, రక్షకునిగాను భావించారు. **"సూర్య ఆత్మ జగస్తస్థుషశ్చ"** *(ఋగ్వేదం 1-115-1, యజ్వుర్వేదం 7-42).* ఈ విషయాన్నే వేరే మాటలలో మరోచోట **"విశ్వస్య స్థాతుర్జగతశ్చ గోపాః"** *(ఋగ్వేదం 7-60-2)* లో కూడా ప్రతిపాదించబడింది. ఋగ్వేదం యొక్క ఐదవ మండలంలోని 81వ సూక్తం యొక్క మొదటి ఋక్కులను వ్యాఖ్యానిస్తూ శ్రీ అరవిందులవారు తమ ఐతిహాసిక "వేద రహస్యం" లో ఇలా వ్రాశారు. వైదిక సూర్యుడు సత్యానికి అధిపతి, కాంతిని ప్రసాదిస్తాడు. ఆయన కిరణములలో అంతః ప్రేరణ, అంతర్జ్ఞానం ఉంటాయి.

ఋగ్వేదంలోని ఈ సూత్రంలో సవితా దేవత యొక్క శక్తి ప్రక్రియను గురించిన అందమైన వ్యాఖ్య, సూర్యోపాసన వలన కలిగే లాభాలు ఇవ్వబడ్డాయి.

**ఉతేశిషే ప్రసవస్య త్వమేక ఇదుత పూషా భవసి దేవ యామభిః । ఉతేదం విశ్వం భువనం వి రాజసి శ్వావాశ్వస్తే సవిత ః స్తోమమానశే ॥** *(ఋగ్వేదం 5-81-5)*

దీని భావార్థం ఏమంటే దేవాధిపతి సూర్యుడు – సవిత పోషకుడు, సమస్త లోకాలను ప్రకాశింపచేస్తాడు. ఈవిధంగా అత్రికులం యొక్క శ్వావస్య – సవితను ఆత్మసత్తాలోపల సత్యరూపంలో ప్రతిష్ఠించడంలో సఫలీకృతుడయ్యాడు. ఆయన మానవమాత్రులందరికీ పోషకుడు, మనిషిలోని నేను అనే భావన విశ్వవ్యాప్తి చెయ్యగలడు. సామాన్యుని సర్వసమర్థుడుగా చేయగలడు.

వైదిక ఋషుల దృష్టిలో సత్యం ప్రకాశం యొక్క పర్యాయ పదం. అంధకారం అజ్ఞానం యొక్క పర్యాయ వాచకం. సూర్యుని జ్యోతియే అతని శరీరమనేది సత్యం. ఈ సూర్యుడు సత్యమనే రూపంలో అంధకారంలోని అవచేతన యొక్క గుహలో ఉన్నాడు. ఆయనను ప్రయత్నపూర్వకంగా సాక్షాత్కరింపజేసుకోవచ్చు. వస్తుతః వేదముల ఆలంకారిక వర్ణన పవిత్ర దార్శిక గ్రంథముల రూపంలో కనిపిస్తాయి. సూర్యుని పూజను అజ్ఞానాంధకారమును పటాపంచలు చేసి వెలుగుతో నింపే ప్రక్రియగా వివరించారు. **సత్యం తదిన్ద్రో దశభిర్దశగ్వైః సూర్యం వివేద తమసి క్షియంతమ్** *– (ఋగ్వేదం 3-3-9-5 ఉత్తరార్థం)*

వేదములలో అనేకచోట్ల సూర్యుని మహత్యాన్ని తెలిపే ఉదాహరణలు కనిపిస్తాయి. ఋషి అంటాడు. **"పశ్యేమ్ ను సూర్యముచ్చన్తమ"** *(ఋగ్వేదం 6-52-5)* అంటే జీవనం యొక్క అర్థమే సూర్యోదయాన్ని వర్ణించడం. ఈవిధంగా సూర్యుడు ధరిత్రిపై జీవనం యొక్క ప్రకటీకరణకు ప్రతీక. ప్రాణులన్నీ ఆయనపై ఆధారపడి ఉన్నాయి. **"సూర్యస్య చక్షు రజ సైత్యావృత్తం తస్మిన్నార్పిత భువనాని విశ్వా"** *(ఋగ్వేదం 1-164-14).* ఇంతేకాదు వైదిక మనీషుల ప్రకారం సూర్యుడే విశ్వకర్మ, సృష్టి రచయిత. **"యేనేమా విశ్వా భువనాన్యా భృతా విశ్వకర్మణా విశ్వదేవ్యావతా"** *(ఋగ్వేదం. 10-170-4)* అంతేకాదు, ఆయనను సహస్రయుగములకు ఆద్యంతములుగా పేర్కొంటారు. దీనినే బ్రహ్మయొక్క ఒక రోజు అని అంటారు.

**యదహో బ్రహ్మణః ప్రోక్తం సహస్రయుగ సమ్మితమ్ ।**
**తస్య త్వమాదిరన్తశ్చ కాలజ్ఞైః సమ్ప్రకీర్తితః ॥**

వర్తమానాన్ని సద్వినియోగపరిస్తే భవిష్యత్తు ఉత్తమంగా ఉంటుంది.

వేదం సూర్యుని గురించి, సవిత గురించి స్పష్టంగా తెలిపింది. సవిత అంటే సంపూర్ణ బ్రహ్మాండములలోని సూర్యులలో సమానంగా విరాజమానుడై ప్రేరణ ఇచ్చేవాడు, దివ్య శక్తి స్వరూపుడు, పరబ్రహ్మ, పరమాత్మ. ఋషులు ప్రకారం ప్రతి సూర్యుడు సవితయే.

**సవితా సర్వస్య ప్రసవితా** *(నిరుక్తం 10-31)*

సవితా అంటే అన్నింటికి ప్రేరణ ఇచ్చేవాడు. శతపథమును అనుసరించి **"సవితా దేవానాం ప్రసవితా"** దేవతలకు ప్రేరణ ఇచ్చి, పాలించేది సవిత.

ఋగ్వేదంలోని 14వ మండలంలోని 14వ సూక్తం యొక్క రెండవ శ్లోకంలో ఇలా వర్ణన ఇవ్వబడింది. **"ఊర్ధ్వ కేతుం సవితా దేవో అశ్రేజ్యోతిర్విశ్వస్మై భువనాయ కణ్వన్", "అప్రాద్యావా పృథివి అంతరిక్షం వి సూర్యోరశ్మి భిశ్చేకతానః"** అంటే సవితాదేవత తన వెలుగుతో లోకములన్నింటిని ప్రకాశింపచేస్తాడు. సూర్యుడు తీక్షణంగా ప్రకాశిస్తూ, ద్యులోకమును, పృథ్విని, అంతరిక్షమును తన కిరణములతో నింపుతున్నాడు. దీని అర్థం ఏమిటంటే సూర్యుడు భౌతిక సౌరమండలమునకు అధిపతి అయితే సవిత అనేది అంతర్ నిహిత దివ్యశక్తి యొక్క ధ్యానస్థితిలో ఉన్న మహర్షుల అంతఃకరణ యందు ఆవిర్భవించిన ఆధ్యాత్మిక ప్రేరణననుసరించి వర్ణింపబడిన రూపం. ఇది సూర్యుని ఆదిభౌతిక రూపం. తరువాత ఆదిదైవిక ఆధ్యాత్మిక రూపం యొక్క వర్ణనే సవితా దేవత రూపం. ఇంతకన్నా వేరే రూపం ఏమి లేదు.

వేదం అంటున్నది - సంపూర్ణ విశ్వాసాన్ని ప్రసవం చేసే సర్వ ప్రేరకుడు సవితా దేవతయే. ఆయన తన సాధన ద్వారా వర్షం మొదలైన ఉపాయాల ద్వారా పృథ్విని సుఖమయంగా చేశాడు. ఆవలంబన లేని ప్రదేశంలో ద్యులోకమును దృఢంగా చేస్తాడు. క్రింద పడకుండా చూస్తాడు. అతనే అంతరిక్షంలో ఉండి వాయువుతో బంధింపబడి ఉన్న మేఘమయ సముద్రమును పిండుతాడు.

**సవితా మంత్రై పృథివీయ రమ్ణా**
**దస్కంభనే సవితా ద్యామిహందత్**
**అశ్వమివా ధుక్షద్ధ నియన్తరిక్ష**
**మతూర్తే బద్ధం సవితా సముద్రమ్**

సూర్యుని పాపనాశకునిగా భావిస్తారు. భర్గ అనే సూర్యుని తేజస్సు పాపములను నాశనం చేసే శక్తిగలది. ఈ స్తుతి ఋగ్వేదంలోని 14వ మండలంలోని 54వ సూక్తంలోని అతి సుందరమైన 3వ శ్లోకం. దీని అర్థం – "హే సవితా దేవతా! మీ జీవనం దివ్య గుణములతో నిండి ఉన్నది. మేము అజ్ఞానం వల్ల అపరాధం చేశాము. శ్రద్ధలోను, నిష్ఠలోను పొరపాట్లు జరిగాయి. మేము మా చాతుర్యం, ఐశ్వర్యం పౌరుషం యొక్క మదంతో అన్యదేవతల పట్ల, మనుష్యుల పట్ల అపరాధములు చేశాము. మీరు మా అపరాధములను క్షమించి పాపములనుండి విముక్తి ప్రసాదించండి. ఇదే మా అభ్యర్థన''. ఈ విషయాన్నే 1-115-1లో "హే! ప్రకాశవంతమైన సూర్యకిరణములారా! సూర్యదేవుని ఆగమనమును ప్రకటించే, మీరు మా పాపములను తీసివేసి రక్షించండి. తప్పులు చేయకుండా కాపాడండి. **(అద్యా దేవా ఉదితా సూర్యస్య నిరహంసః పిప్రుతా నిరవద్యాత్)**

అందువల్ల పాపముల నుండి విముక్తి పొందటానికి సద్బుద్ధిని ప్రసాదించే గాయత్రీ మంత్రం సవితా దేవతా ధ్యానంతో చేయబడుతుంది. ఇంకా **ఉద్యతే నమః ఉదాయతే నమః ఉదితాయ నమః** (అథర్వణ వేదం 17-1-12) మరియు **"అస్తం యతే నమోఽస్తు మేష్యతే నమోఽస్తు మితాయ నమః"** సూక్తాలలో సూర్యోదయం, ప్రకటన, సూర్యాస్తమయం ఈ మూడు సమయములలో ఋషి నమస్కరిస్తూ ప్రార్థన చేస్తాడు.

సూర్యుడు మానసిక శాంతిని ప్రసాదిస్తాడు. మానవుని అభీష్టములను, వ్రతములను నెరవేర్చుకోగలిగే సామర్థ్యమునిచ్చి తద్వారా అన్ని రకాలైన సుఖాలను కలుగజేస్తాడు.

యజుర్వేదంలో ఇలా ఉన్నది. "సూర్యుడు స్వయంభువు. సౌర జగత్తులో శ్రేష్ఠుడు, జగత్తునంతటికి వెలుగునిస్తాడు. అందరికి వర్చస్సును ఇస్తాడు. ఎవరైతే సూర్యుని నియమాలను పాటిస్తారో వారు సూర్యునితో సమానంగా వర్చస్వి కాగలరు. **స్వయంభూరసి శ్రేష్ఠో రశ్మిర్వర్చోదా అసివర్చో మే దేహి సూర్యస్యావృత మన్వవర్తే** *(యజుర్వేదం 2-26)*

సూర్య భగవానుడు కర్మయోగి, వాంఛిత ఫలములనిస్తాడు. సూర్యుని నుండి ప్రేరణ పొంది మనిషి ఎంత కర్మ చేస్తాడో దానికి తగిన విధంగా పదార్థములను, ధన లాభాన్ని పొందుతాడు. ఈ భావం ఋగ్వేదంలో ఇలా చెప్పబడింది.

**"నూనం జనాః సూర్యేణ ప్రసుతా అయన్నర్థని కృణ వన్న పాంసి" (ఋగ్వేదం 7-43-4)**

పైన చెప్పబడిన వేదములయందలి ఉదాహరణలు ఒకే తథ్యాన్ని ఉద్ఘాటిస్తాయి. మానవుని ఆదర్శం, లక్ష్యం, ఇష్టదైవం సూర్యుడు, సవిత అయినట్లయితే అతనికి బ్రహ్మదేవుని దర్శనమే గాక ఆయనను ప్రాప్తించుకుంటాడు.

– *అఖండజ్యోతి, జూన్ 1993*

మనస్సులో మాలిన్యాలను కడుక్కోవటానికి స్వాధ్యాయం అవసరం.

జన్మశతాబ్ది ప్రత్యేకం

# గురుదేవుల అణువణువునా కరుణే

"ఆత్మజ్ఞానం కలవారు చాలా సుఖంగా ఉంటారు, హాయిగా నిద్రిస్తారని వినికిడి. మాకు అటువంటి ఆత్మజ్ఞానం నేటికి దుర్లభమైనది. ఇటువంటి ఆత్మజ్ఞానం ఎప్పుడైనా దొరుకుతుందా లేదా అనే విషయమై పూర్తిగా అనుమానమే. వ్యధ, వేదనల అస్తిత్వం ఈ జగతిలో నిలిచి ఉన్నంతకాలం, ప్రాణులు, క్లేశం మరియు కష్టముల కొలిమిలో కాలుతున్నంతకాలం, నాకు హాయిగా కూర్చునే కోరిక కలుగ రాదు. ప్రార్థన చేసే ప్రతిసారి భగవంతునికి ఇదే నివేదించాను. నాకు హాయి కాదు. పీడితుల వ్యధని నా వ్యధగా భావించే అనుభూతి రావాలి. నాకు సమృద్ధి కాక కంటినీరు తుడవగలిగే శక్తి కలిగి ఆ విషయంలో మా సార్థకతని నిరూపించుకోగలగాలి. ఇదే మేము భగవంతుని కోరిన అనుదానము, వరదానము కూడా! ద్రౌపది మానాన్ని రక్షించిన ఆ భగవంతుడు నాకు కరుణ అనే అనంత సంవేదనను ప్రసాదించాడు.

నా ఎన్నో రాత్రులు ఏడుస్తూ గడిచాయి, ఎన్నో సార్లు నేను చిన్న బాలుని వలె వెక్కి-వెక్కి ఏడ్చాను. ఇవన్నీ ఎవరికి తెలుసు? మనుషులు నన్ను సంత్ అని, విద్వాంసుడని, సిద్ధుడని, జ్ఞాని అని అనుకొంటూ ఉంటారు. కొంత మంది నన్ను రచయిత, వక్త, నాయకుడని అనుకొంటారు. కాని ఎవరైనా నా అంతః కరణాన్ని తెరిచి చదివారా? అర్థం చేసుకొన్నారా? ఎవరైనా చూడగలిగిఉంటే మానవీయ వ్యధ, వేదన అనే అనుభూతులతో, కరుణ అనే బాధతో హాహాకారాలు చేస్తున్నా ఒక ఉద్విగ్నమైన ఆత్మ ఈ ఎముకల గూడు మధ్య ఏడుస్తూ కనిపించి ఉండేది. ఎక్కడి ఆత్మజ్ఞానంతో కూడుకొన్న నిశ్చింతత, ఎక్కడ నా కరుణతో కూడిన బాధతో నిండిన నా అంతరాత్మ? ఈ రెండింటి మధ్య ఎక్కడా సమన్వయం కుదరటం లేదు. అందుకనే ఎప్పుడు ఆలోచించినా నిశ్చింతత, ఏకాగ్రతకి సంబంధించిన, సమాధి సుఖాన్ని ఇవ్వగలిగే ఆ జ్ఞానం ఇంకా చాలా దూరంలో ఉందనే అనుకొన్నాను. దాని మీద నాకు కోరిక కూడా లేదు..."

పైన పేర్కొన్న పంక్తులు 1975లో పూజ్య గురుదేవులు ఫిబ్రవరిలో "నా వారితో నా మాట" అనే శీర్షికలో ఆయన అంతర్వేదనగా ప్రస్ఫుటితమైనది. ఒక సిద్ధ పురుషునిలో దాగి ఉన్న సంవేదనలతో నిండి ఎవరికైతే ఇతరుల బాధ తన బాధగా కనిపిస్తుందో ఆయన అలా కనిపిస్తారు. ఆయన హృదయం నవనీతం వంటిది. తన ముక్తి, సమాధి, ఆత్మప్రగతి వంటి సర్వోత్కృష్టమైన స్థాయికి చేరుకోవడానికి ఏ విధమైన ఆతృత లేకుండా, పరహితం కోసం జీవిస్తూ ఇతరుల ముక్తిని ప్రప్రథమంగా కాంక్షించే వ్యక్తిగా గోచరిస్తారు. గతంలో ఒక మామూలు ఫకీరు, అవతార మహా పురుషుడు మనకి గుర్తుకు వస్తారు. ఆయన పేరే 'కబీరు'. అతడు తన సరళమైన భాషలో ఈ విధంగా అంటాడు.

**సుఖియా సబ్ సంసార్ హై, ఖాయె అరు సోయ్ ।**
**దుఖియా దాస్ కబీర్ హై, జాగే అరు రోయ్ ॥**

ఇద్దరు జీవితాన్ని చూసే విధానములు ఒకటిగా కనిపిస్తాయి. ఇద్దరు సిద్ధికి సంబంధించి సర్వోత్కృష్టమైన స్థాయి వరకు చేరుకొనే దక్షత కలిగి ఉన్నారు. అయితే పసిపిల్లవాడి వంటి సరళత్వము, ఒక పరిపక్వత కలిగిన వృద్ధుని వలె గొప్పతనాన్ని, కరుణకి ప్రతిమూర్తి వలె గోచరిస్తున్నారు.

పూజ్య గురుదేవుల జీవిత సాధన యొక్క చాలా ముఖ్యమైన అంగము "ఆత్మవత్ సర్వభూతేషు", "మాతృవత్ పరదారేషు" మరియు "పరద్రవ్యేషు లోష్ఠవత్" అనగా శారీరిక పరిధిని వారెప్పుడో దాటి వేశారు. కాని తమని తాము చూసుకొన్నట్టే ఎదుటివారిని చూడగలగటం (ఇతరుల కష్టసుఖాలు తమవిగా భావించడం) ఇతరుల అంతఃకరణతో తనని ఎంత లోతుగా కలిపి వేసుకొన్నారంటే లక్షల కొద్ది పరిజనులు వారిని తమ పరమప్రియ సఖునిగా, తండ్రిగా, భావించడం ప్రారంభించారు, ఇదే సాధనలోని సర్వోపరి సిద్ధి.

ప్రపంచములోని వైభవమంతా, కౌశలమంతా సామర్థ్యాన్నంతా త్రాసులోని ఒక వైపు ఉంచి, సరసమైన భావ సంవేదనలను త్రాసులోని రెండవవైపు ఉంచితే రెండవ వైపే ఆ త్రాసు ఎక్కువ మొగ్గు చూపుతుంది. అందులోనే శక్తి ఉంది. ఇతరుల హృదయాన్ని గెలుచుకొని ఆ బలంతోనే వ్యక్తి ఆత్మసత్తాని

**కటువైన మాట చేసిన గాయం ఎన్నటికీ మానదు.**

క్రమంగా పైకి లేపుతూ ఉచ్చస్థాయి సోపానాలను అధిరోహిస్తూ ముందుకి సాగిపోతాడు. ఈ భావనలే అంతరంగంలో జాగృతమైతే సాధారణ మనిషి దేవ మానవునిగా, మహామానవునిగా మారిపోతాడు. ఆయన 'ఆత్మవత్ సర్వభూతేషు' అనే ఆత్మవిస్తారము సర్వత్ర తానే అయి వ్యాపించినట్టు చూపుతుంది. అంటే ఈ విధానంలో కేవలం దృష్టిద్వారా ఆ విధంగా దర్శించడమే కాక ఇతరుల వ్యథ, వేదనలను కూడా తనవిగానే భావించారు, అంతేకాక ఎంత ఎక్కువగా బాధను మేల్కొల్పాయంటే వాటిపై మందు పూయడం మినహా ఇంకేమి గోచరించలేదు. ఇక పుణ్యపరమార్థములు గురించి వేరుగా ఇక చింతించేదేమిటి? ఆయన బాధంతా పీడితులైన మానవ జాతి, నీరసించిన ప్రాణి సముదాయాన్ని కష్టముల నుండి వ్యథల నుండి, పతనము నుండి ఎలా ముక్తి కలిగించాలి?

ఈ సందర్భంగా ఆయన బాల్యానికి సంబంధించిన ఒక సంఘటన తెలుసుకోవాలి. ఈ సంఘటన 12 ఏళ్ళ వయస్సులో వారి గ్రామమైన ఆవల్ ఖేడాలో జరిగింది. వారు ఒక సమృద్ధిగా ఉండే ఒక బ్రాహ్మణ పరివారంలో జన్మించారు. తండ్రి కులపురోహితునిగా ఉండేవారు. చుట్టు ప్రక్కల ఉండే అన్ని జమీందారీలో చాలా గౌరవం ఉండేది. ఎప్పుడు భాగవత పారాయణ జరిగినా ఆయన తండ్రి పండిత రూపకిశోర్ గారినే పిలిచేవారు. గ్రామం మధ్య ఒక కోటలాంటి భవనంలో ఆయన నివసించేవారు. కాని ఆ బాలుడు తన స్నేహితులతో బాధల్లో ఉండేవారిని, వ్యాధులు ఉన్నవారిని వెతుక్కొంటూ వెళ్ళిపోయేవాడు. ఆ గ్రామంలో ఎప్పుడైనా తిరునాళ్ళు జరిగితే ఆ స్వయం సేవకులు అందరికి మంచినీళ్ళు తాగించేవారు. అందరికి ప్రాథమిక సహాయం నుంచి పశు చికిత్స పేంప్లెట్స్ వరకు పంచేవారు. అందరు ఎన్నో ఆశీర్వాదాలు ఇచ్చేవారు. ఇటువంటి సమయంలోనే ఒక రోజు ఒక హరిజన మహిళ రావటం మానేసినదన్న సంగతి తెలిసింది. ఆమెని ఈయన ప్రేమగా 'అమ్మ' అని సంబోధించేవారు. ఆ విషయం తెలిసి ఆ బాలుడు హరిజన వాడకి చేరుకొన్నాడు. ఆ గ్రామంలోని బ్రాహ్మణులు అడ్డుపడి ఇంటికి వెళ్ళి చదువుకో, మాలవాళ్ళతో నీకేంపని నువు వారిని ముట్టుకొంటే ప్రాయశ్చితం చేయాల్సి ఉంటుంది' అన్నారు.

ఆతడు ఆగలేదు. మురికి కాలువల గుండా ప్రయాణిస్తూ ఆ 'అమ్మ' ఇంటికి వెళ్ళి చూసి తెల్లబోయాడు. ఎందుకంటే ఆమె అరచేతిలో పెద్ద గాయం ఉంది. ఆమె మందులు లేక జ్వరంతో మంచంపై పడి ఉంది. ఎన్నో రకాలుగా నచ్చ చెప్పి ఇప్పుడే ప్రాథమిక చికిత్సకి కావలసిన సామాన్లు తీసుకొని వస్తానని చెప్పి వెళ్లాడు. కాని ఆ వృద్ధురాలు శ్రీరామ్‌ని ఆపి తాను స్వయంగా ఐదు మైళ్ళ దూరంలో ఉన్న ఆస్పత్రికి వెళ్ళి వైద్యం చేయించుకొంటానని చెప్పింది. కాని ఆ బాలుడు ఇంటికెళ్ళి కావలసిన సామాన్లు తెచ్చుకొని తిరిగి వచ్చాడు. ఎంతో దీక్షగా ఇన్‌ఫెక్షన్ ఎక్కువయి గాంగ్రిన్‌లాగా మారుతున్న ఆ గాయాన్ని కడిగాడు. ఎర్ర మందు రాసి బేండేజి కట్టాడు. తరువాత కషాయం చేసి ఇచ్చి జ్వరం తగ్గిపోతుందని చెప్పి వెళ్ళాడు. ఆమె అశ్రుపూరిత నయనాలతో ఎన్నో ఆశీర్వాదాలు ఇచ్చింది. కాని ముందు మార్గం ఇంకా దుష్కరముగా ఉంది. ఇంటికి చేరేసరికి గంగా జలముతో నిండిన కుండతో ఇంటి వారంతా ఎదురుచూస్తున్నారు. స్నానం చేయించి పవిత్రం చేయాలని ఆ తరువాత దండించి ముందు - ముందు ఇలా చేయకుండా జాగ్రత్తపడాలని చూస్తున్నారు. శ్రీరామ్ వారికి 'నీవు లక్షసార్లు చెప్పినా నేను ఆ ఇంటికి ఆ ముసలమ్మ గాయం మానేవరకు వెళ్తూనే ఉంటాను. కాబట్టి ఇంకా గంగాజలం తెప్పించుకోండి. ఎందుకంటే రోజు నన్ను మీరు పవిత్రం చేయాలి' అని చెప్పాడు. ఎన్నో తిట్లు తిట్టి చివరికి భోజనం కూడా పెట్టలేదు. కాని ఆ బాలుడు ఏ మాత్రం చలించలేదు. ఆతడు తిరిగి రెండవ రోజు మళ్ళీ అక్కడికి వెళ్ళాడు. ఆ విధంగా ఆ వృద్ధురాలి గాయం మానిపోయి, ఆమె నడవగలిగే స్థితికి వచ్చేవరకు ఐదు రోజుల పాటు రోజు ఆమె వద్దకు వెళ్ళాడు. రోజు గంగాజలముతో స్నానం చేయాల్సి వచ్చింది, నడిచే మార్గాన్ని మార్చాల్సి వచ్చింది. ఇతరుల బాధని పోగొట్టాలనే సంకల్పమును పూర్తి చేసుకొన్నాడు. బహుశా మహాకాలుడే ఆ వృద్ధురాలైన హరిజన మహిళ నోటితో ఎన్నో ఆశీర్వాదాలు ఇప్పించి, ముందు-ముందు చాలా పెద్ద మహాత్ముడుగా మారుతాడని చెప్పించాడేమో. ఇదే జరిగింది కూడా. 20వ శతాబ్దపు ఆ వృద్ధురాలైన తల్లి ఆత్మ ఎక్కడున్నా ఆ చిన్న బాలుడి రూపంలోని వామనావతారం వలె జరుగుతున్న ఈ లీలను చూస్తూనే ఉంటుంది. అంతేకాక స్వయంగా నిష్కళంగా ప్రజ్ఞావతార ప్రతినిధి తన సేవ చేయడానికి వచ్చాడు తానెంత అదృష్టవంతురాలో అనుకొంటూ ఉంటుంది.

ఈ సంఘటన చాలా చిన్నది కాని ఒక బాలుడి

**అసత్యం వల్ల డబ్బు రావచ్చు కానీ ఆనందం మాత్రం రాదు.**

సుసంస్కారానికి సంబంధించిన చిన్న ఉదాహరణ మాత్రమే. ఇది 'ఆత్మవత్ సర్వభూతేషు' అనే బీజాంకురం ఆ రోజులలోనే మొలకెత్తిందని తెలియచెప్తోంది. వారి గ్రామంలోనే ఒక పట్వారి ఉండేవాడు, ఆతడి పేరు లాలా హుబ్బాలాల్. ఆతడు ఎంత భయంకరమైన వాడంటే ఎదుటివాడిని పీల్చి పిప్పి చేస్తే కాని వదిలేవాడు కాదు. ఎన్నో చల్లని సంసారాలను మట్టి కరిపించాడు. బాలుడైన శ్రీరామ్ ఆ రోజులలోనే గ్రామంలోని చర్చిని దాటి ఆగ్రాకి వచ్చేశాడు. పూర్తి జనపదంలో తిరిగి చూసే ఒక సేవా సమితిని ఏర్పాటు చేసుకొన్నాడు. వీరు వికలాంగులకి, ఆశ్రయంలేని వారికి రగ్గులు రజాయిలు (బొంతలు) పంచుతూ ఉండేవారు. తిరుగుతూ వారు తమ గ్రామానికి సంబంధించిన సూచిక కూడా తయారు చేశారు. చూస్తే అందరికంటే ముందు లాలా హుబ్బాలాల్ పేరు ఉంది. ఆతడు కొన్నేళ్ళు ముందు తన చుట్టు ప్రక్కల వారిలో మకుటంలేని రాజుగా వెలిగాడు. కాని నేడు చింపిరి బట్టలు చుట్టబెట్టుకొని, చుట్టూ ఈగలు ముసురుతూ, మురికిగా ఉన్న విరిగిన మంచం మీద పడి ఉన్నాడు. రోజంతా ఏడుస్తూ అందరికి చెప్పేవాడు. "మనుషుల్లారా చూడండి పాపం యొక్క పరిణామం చూడండి. భగవంతుడు నాకెలాంటి దండన నిచ్చాడో".

గురుదేవులైన శ్రీరామ్‌గారు రగ్గులు అవి తీసుకొని ఆతని వద్దకి చేరుకొన్నారు, ఆతడిని కౌగిలించుకొని ఏడవసాగాడు. "లల్లు ఇదెలా జరిగింది? భగవంతుడు నన్ను ఎప్పటివరకు శిక్షిస్తాడు?" గురుదేవులు ఆతనికి ధైర్యం చెప్పారు. ఊరడించారు. తన సమితి సదస్యులందరితో కలిసి ఆతనికి ఎంతో సేవ చేశారు. ఆతని దరిదాపులకి రాని వారికి "పాపాన్ని ద్వేషించండి కాని పాపిని కాదు" అనే ప్రేరణనిచ్చారు. లాలాగారు పోయేవరకు ప్రతి ఒక్కరు పూజ్య గురుదేవుల ప్రేరణతో ఆయనికి సేవ చేస్తూనే ఉన్నారు.

ఇదే యుగద్రష్ట, అవతార సత్తా యొక్క మమతతో కలిసిన మహాప్రాణ సత్తా స్వరూపం. ఇటువంటి మహామానవులకి శత్రువులు, మిత్రులు ఎవరు ఉండరు. అందరు వారికి తమ స్వంతవారే. ఆయన జీవన యాత్రలో లెక్కలేనంత మంది ఈర్ష్యతో ఆయనకు విరుద్ధంగా ఎన్నో పనులు చేశారు. ఎన్నో మాటలు అన్నారు. ప్రత్యుత్తరంగా ఆయన ఏమి చెప్పలేదు. అందరితో స్నేహమే ఆయన నైజం. స్నేహమనేది ఈశ్వరుని యొక్క అంతరంగ రూపం. దీనివల్ల ఆత్మిక ప్రగతి లభిస్తుంది. భౌతిక సమృద్ధి లభిస్తుంది. ప్రేమను పంచి బాధలు – పతనముల నివారణలో మునిగి పోవాలనే ఏ మార్గదర్శనమైతే ఆయన ఇచ్చారో, అవి ఇతర ఉపదేశముల కంటే ఎంతో విలువైనవి, శ్రేష్ఠమైనవి కూడా.

*– అఖండజ్యోతి, ఆగస్టు 1990*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీ సుందరి*

## కదిలించే కళ్లు

43 సీ॥ *అందాల నందించు నందనవనములో*
*మరుసటి దినమంత మరులు గొలిపె*
*విరులన్ని వరుసగా వికసించి మెరయుచు*
*పూలపానుపోలె పోగువడియె*
*వెలుగులో ప్రభలను వెలువరించుచు సామి*
*ఎదురుగా నిలుచుండి మదిని నిలిపె*
*ఓర్పుతోనే చూపునేర్పును గమనించి*
*సామర్థ్యమును చూసి సంతసించె*

తే॥ దృఢతలోనున్నట్టి బెదురు దించు కొరకు
తెలిపినట్టి యా విధులన్ని సలుపు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

44 సీ॥ *పెద్ద పెద్ద పనులు సిద్ధింపవలెనన్న*
*ఇరువది నాల్గేండ్లు నేక బిగిని*
*గాయత్రిదేవిని ఘనమైన నిష్ఠతో*
*జపియించవలయును చక్కగాను*
*స్వాధ్యాయ కార్యంబు సక్రియంబుగ చేసి*
*ఆర్ష సాహిత్యమున్ అనువదించి*
*అందరికందించి ఆనందమొందుచు*
*దేవసంస్కృతిగూర్చి తెలుపుమనుచు*

తే॥ ఆనతీయగనేనంత ఆసచేసి
కార్యరంగానదిగినట్టి కరణినంత
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

*రచన–మధుర కవయిత్రి*
*పొన్నూరు హైమవతీ శాస్త్రి*

**ఆలోచన, ఆచరణలే అదృష్టాన్ని నిర్మిస్తాయి.**

జన్మశతాబ్ది ప్రత్యేకం

# సత్యయుగ పునరాగమనము

అభివృద్ధి యొక్క చివరి మెట్టుకు చేరుకోవటానికి మనస్సు నిండా భావసంవేదనలను నింపుకొని కరుణను పెంపొందింపజేసుకోవాలి. దీనినే ఆంతరిక ఉన్నతి అని కూడా అంటారు. అనుభూతులు ఉన్నప్పుడే సేవాసాధన చేయడం సాధ్యమౌతుంది. ధర్మాచరణ కూడా ఇందులో తక్కువేమీ లేదు. ఏదోవిధంగా సంవేదనలు జాగృతమైనప్పుడు అవసరమైనవారికి అవసరమైన వాటిని ఇవ్వకుండా ఉండలేని దేవత్వమును సాధకునిలో సాక్షాత్కరింపజేయటమే తపశ్చర్య, యోగసాధనల యొక్క లక్ష్యము. **ఇచ్చే స్వభావము ఎవరికి ఉంటుందో వారు ఈ భూమిమీద దేవతలుగా పిలవబడతారు.**

ఇచ్చే ప్రవృత్తి గలవారందరూ ఒక చోట చేరి ఎక్కడైతే కలిసి నివసిస్తూ ఉంటారో ఆ ప్రాంతం స్వర్గధామంగా సంబోధించబడుతుంది. ఇలాంటి లోకం, ప్రాంతం ఎక్కడ ఉన్నా లేకపోయినా సత్యం ఏమిటంటే సహృదయులు, సేవాభావనలు కలవారు, ఉదారచేతనాపరులు స్వయంగా దేవమానవులే కాక స్వర్గం లాంటి లేదా సత్యయుగకాల సంస్కరణలు ఏదో ఒకటి చేయకుండా ఉండలేరు.

### మహావినాశనము దగ్గరలోనే ఉన్నదా?

గొప్పతనాన్ని సాధించినంత మాత్రాన సరిపోదు. దానిని స్థిరంగా ఉంచుకోవడం, సద్వినియోగము చేసుకోవడం ద్వారా లాభాలను పొందటానికి తెలివి, మంచి తార్కిక స్వభావం మరియు ప్రతిభ అవసరము. భావసంవేదనలతో నిండిన వ్యక్తులే ఈ రీతిని, నీతిని అర్థం చేసుకోగలుగుతారు. ఈ ఆధారం పైనే సంపద సద్వినియోగం అవుతుంది. ఈనాటి ప్రజలు భావసంవేదనల మహత్వాన్ని మర్చిపోయారు. వాటిని పతనం చేస్తూ, పోగొట్టుకుంటూ వస్తున్నారు.

అపరిమిత వైభవమును సంపాదించవచ్చు, అయితే దానిని ఒక్కడే జీర్ణం చేసుకోలేడు. కామం, కోరికలు మనిషిని ఎంతగా తినివేస్తాయంటే వాటిని తృప్తిపరచటానికి కుబేరుని సంపద, ఇంద్రుని సామర్థ్యం కూడా తక్కువే అవుతాయి. కోరికలనే ఎడారిలోని వేడిని చల్లార్చటానికి కొద్దిపాటి సాధనసామాగ్రి అనే నీటితో సాధ్యం కాకపోగా ఎక్కడికక్కడ అసంతృప్తియే మిగిలిపోతుంది. కొద్దిపాటి భోగం అయితే ఆ దాహాన్ని ఇంకా పెంచి అగ్నికి ఆజ్యం పోసినట్లు ఆ కోరికను మరింత పెంచుతుంది.

చెలరేగే కోరికలు, అనియంత్రితమైన కోరికలు, ఉన్మాదం లాంటి దోషాలు తారాస్థాయికి చేరి మానవీయ గౌరవాన్ని కాలరాస్తున్నప్పుడు తప్పించుకోవటానికి ఏ మార్గమూ మిగలదు. ప్రస్తుతం తుఫానులా ఉప్పొంగుతున్న అనాచారాలను చూస్తుంటే నిజంగా మనం మహావినాశన ప్రళయం వైపు నేరుగా పరుగులు తీస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రచండ ప్రవాహాన్ని ఆపగలిగే ఆనకట్టను కట్టి జలధారను కాలువల ద్వారా పొలాలకు అందించే పని కచ్చితంగా కష్టసాధ్యమైనది, శ్రమతో కూడుకున్నది. అయితే ప్రాణములను పణంగా పెట్టి సదాశయంతో కలిపిచేసే వారి శ్రమసాధన చమత్కారమైన మార్పులను తీసుకొస్తుంది. కొండలు తొలిచి పొడవైన కాలువలు తవ్వడంలో ఒంటరిగా చేసిన ప్రయత్నాలే విజయవంతమైనాయి. గంగను భూమిమీదకు తీసుకురావటానికి భగీరథుడు ఒంటరిగానే ప్రయత్నం చేశాడు. సర్వత్రా వ్యాపించిన చీకటిమీద చిన్నవాడుగా కనిపించే సూర్యుడే విజయమును పొందుతాడు. కాబట్టి ఈనాడు ప్రతి విషయంలోనూ భయమే ఆవహించివున్నా మానవులలో ఉత్కృష్టమైన ఆలోచనలు ఉదయించినప్పుడు ఈ పరిస్థితులు తప్పక మారిపోతాయి.

కవి రవీంద్రనాథ్ టాగూర్ 'సత్ప్రయోజనముల దిశగా ఏదైనా చేయాలనుకుంటే – ఏకలా చలో రే' (ఒంటరిగానే సాగిపో) అన్న నీతిని పాటించాలి అని చెప్పారు. గీతాకారుని సూచనల ప్రకారం ప్రపంచం అంతా మోహనిద్రలో సొమ్మసిల్లి జోగుతున్నప్పుడు కూడా యోగులు పరిస్థితులను ఎదుర్కొనేందుకు, సవ్యమైన దిశలోనికి మళ్ళించేందుకు, జనుల రక్షణకు ధైర్యాన్ని కూడదీసుకోవాలి.

గాఢాంధకారాన్ని రూపుమాపటానికి ఒక అగ్గిపుల్ల తనని తాను జ్వలింపచేసుకునే సాహసాన్ని ఎప్పుడైతే ప్రకటిస్తుందో

**గృహస్థ ధర్మం పవిత్రం, ఆవశ్యకం, ఉపయోగకరం.**

అప్పుడు, దీపము అగ్గిపుల్ల ఆరిపోకముందే తాను జ్యోతిర్మయమౌతుంది. అంతేకాదు దీపావళి లాంటి విశేష పర్వదినాలలో ప్రజ్వలించే దీపాల సమూహం అంతటా వెలుగు విరజిమ్ముతూ కనిపిస్తుంది.

సమర్థత, నైపుణ్యం మరియు సంపన్నతల జయజయధ్వానాలు అంతటా వినిపిస్తాయి. అయితే ఈ మూడు రంగాలలో వ్యాపించిన అరాజకత్వమే ఆపదలను ముందుకు తెచ్చిందని, వాటినుండి బయటపడటానికి వ్యక్తులు, సమాజం విలవిలలాడుతున్నాయని గుర్తుంచుకోవాలి.

ఈ మూడింటినీ మించిన శక్తి మరొకటి ఉంది. అవే భావానుభూతులు. ఇవే దైవీవరాల రూపంలో మనిషి యొక్క స్వచ్ఛమైన అంతరాత్మలో ప్రవేశించినపుడు మనిషిని మృదువుగా తయారుచేస్తాయి. ఇవి అంత:కరణతో కలసినపుడు అతడు దేవదూతస్థాయికి చేరుతాడు. ఈ ఒక్క ఆధారం మీదే సాధకునిలో పలు దైవీతత్త్వాలు నిండుతూవుంటాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే రాబోయేరోజులలో క్రూరమైన స్వార్థాన్ని పోగొట్టుకుని, దాని స్థానంలో **ఉదార భావసంవేదనలను అంత:కరణ లోతుల్లో ప్రతిష్ఠింపజేసి, వృద్ధిచేయవలసిన అవసరం ఉన్నది. అదే యుగపరివర్తనకు ఆధారం.**

అంత:కరణలో శ్రద్ధ, సంవేదనల శీతలత్వం, సరసత్వం నిండి ఉంటేనే సదాశయ వాతావరణము తయారౌతుంది అని అర్థం చేసుకోవాలి. మనస్సు ఒక దాసి, అంతఃశ్రద్ధ అనే రాణి చేసే ఆజ్ఞల కోసం అది ప్రతిక్షణం ఎదురుచూస్తూవుంటుంది.

దేవమానవులలో ప్రతివొక్కరూ తమ అవసరాలు తగ్గించుకుని, కోరికలను తగ్గించుకొని తద్వారా మిగిలిన ఉదాత్త ఆశయాలను భగవంతుని చరణాల వద్ద సమర్పించవలసివచ్చింది అనేది స్పష్టం. లోకకళ్యాణము, ఆత్మికసంస్కరణ కోసము తమ శక్తిలోని అణువణువు సమర్పించవలసివచ్చింది. ఈ మూల్యాన్ని చెల్లించిన తరువాత ఎవరికైనాసరే దైవీ అనుగ్రహం మరియు దానిద్వారా వికసించే అత్యున్నత వ్యక్తిత్వం లభిస్తుంది. ఈ శ్రేష్ఠత్వాన్ని చరితార్థము చేసుకునేవారినే దేవమానవులు, దేవదూతలు అంటారు. వారి ప్రబలమైన శ్రమవల్ల శాంతిమయ వాతావరణము తయారౌతుంది. ప్రపంచమంతా సుందరంగా, సమున్నతంగా తయారౌతుంది.

అంతఃకరణ శ్రద్ధ, దివ్యచేతన సంయోగాల ఫలితంగా లభించిన దానినే దివ్యసంవేదన అంటారు. అది నూతన ఉల్లాసముతో, నూతన రూపముతో ఉప్పొంగుతుంది. ఇదే దాని యథార్థతకు గుర్తింపు. చిత్రపటాలను చూసికూడా ఆత్మీయులను స్మరించుకోవచ్చు. అయితే వారితో ప్రత్యక్ష కలయిక మనసుల్లో ఎంత ఉల్లాసాన్ని నింపుతుందంటే దాని అనుభూతి అమృతపు సెలయేరులాగా ప్రవహిస్తుంది. ఈ అవగాహన కలుగగానే మనిషి కాయకల్పం లాంటి దేవోపమ స్థితికి చేరుతాడు.

**మానసికస్థితే పరిస్థితులకు జన్మదాత్రి అన్న విషయాన్ని వేలసార్లు తెలుసుకోవాలి. లక్షలసార్లు తెలియజేయాలి.** అందువలన పరిస్థితులలోని ఆపదలను పూర్తిగా తొలగించాలంటే ప్రజల మానసికస్థితిలో దూరదృష్టితో కూడిన వివేకమును ఉదయింపజేయాలి. అయితే ఇక్కడ మానసికక్షేత్రము మరియు బుద్ధిసంస్థానము కూడా స్వతంత్రము కావనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. భావనలు, ఆకాంక్షలు, నమ్మకాల ఆధారంగా వాటి దిశాధారను నిర్మించుకోవాలి. వాటి ఆదర్శవాద ఉత్కృష్టమైన స్వరూపము అంత:కరణలో భావ–అనుభూతులుగా ఉంటాయి. ఈ సూత్రాన్ని ఉపయోగించుకుంటే ఏ వ్యక్తి అయినా ఋషిగా, దేవమానవుడుగా తయారుకాగలుగుతాడు.

21వ శతాబ్దం భావసంవేదనలు ఉదయించి, ఉదయింపజేసే సమయం. నిర్లక్ష్యము చేయబడిన ఈ రంగాన్ని పచ్చదనంతో కళకళలాడేట్టుగా తయారుచేసే తోటమాలిగా తయారుకావాలి. ఈ విశ్వ ఉద్యానవనం ఈ ఆధారంగా పచ్చపచ్చగా పూలు పళ్ళతో కళకళలాడుతుంది. అది స్వర్గలోక నందనవనంవలె కనిపించినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

– *అఖండజ్యోతి, ఫిబ్రవరి 2011*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

యుగశక్తి గాయత్రి
మాస పత్రిక చదవండి !
చదివించండి !!

**ఉత్కృష్టతల పట్ల విశ్వాసాన్ని నిర్మించడమే ప్రజాసేవ.**

## గాయత్రి - 24 శక్తి ధారలు (22)

# మహామాయ

భ్రాంతిని మాయ అంటారు. మాయ పదార్థానికి సంబంధించినది, మహామాయ జ్ఞానానికి సంబంధించినది. మానవీయ సత్తా పరిమితమైనది. అందువలన సమగ్రమైన దర్శనం చేయలేదు. ఎంత దాని పరిధిలోకి వస్తుందో, అదే సమస్తమని భావిస్తుంది. నూతిలోని కప్ప అదే సమస్త విశ్వంగా భావిస్తుంది. అది ఉన్న పరిస్థితిలో అంతే సాధ్యమవుతుంది. కాని దానిని బావిలో నుంచి బయటకు తీసుకువస్తే, ఆకాశంలో ఎగరగలిగితే, ఆకాశంలో తిరగగలిగితే పూర్వం బావియే సమస్త విశ్వం అనే భావన తప్పని తెలుస్తుంది. అప్పుడు అదే సత్యమని భావించి ఉండవచ్చును.

జీవుడు మాయ యొక్క బంధనములలో కట్టివేయబడి ఉన్నాడు. కోరికలు, ఆలోచనలు, కర్మల మాయాజాలంలో మునిగిపోవడంవ్లల అవాంఛనీయస్థాయిలో ఉంటాడు. ఆ జంజాటంలో కస్తూరి మృగం వలె మృగమరీచికలలో కొట్టుకుపోయి, జీవసంపదలను వ్యర్థం చేసుకుంటాడు. మాయలోనుంచి జిజ్ఞాసువులైన ముముక్షువులు బయటపడాలని ప్రయత్నిస్తుంటారు. ఆత్మజ్ఞానం జీవనాన్ని సఫలం చేస్తుంది, కాని మహామాయ మాయలో పడినవాడు దుఃఖాన్ని పొందుతాడు. మహామాయ శరణులో వెళ్ళినవాడు పరమశాంతి యొక్క రసాస్వాదన చేస్తారు. వాడికి శ్రేయస్కరమైన మార్గము ప్రత్యక్షంగా కనిపిస్తుంది. పొంగిపొరలే ఆత్మబలం వల్ల ఆ మార్గంలో పయనించడం కూడా సులభతరమవుతుంది.

ఆత్మ తన అస్తిత్వం శరీరం మాత్రమే అనుకోవడం మొదటి భ్రాంతి. దీని మాయలో మనిషి కోరికలు, తృష్ణ, అహంకారంల బాలక్రీడలో చిక్కుకొని, పశువువలె జీవిస్తూ, మానవజన్మయొక్క సుయోగం వ్యర్థం చేస్తుంటాడు. చివరికి ఉత్తచేతులతో వెళ్ళిపోతాడు, పాపములను మూటగట్టుకుని నెత్తి మీద పెట్టుకుంటాడు. 84 లక్షల యోనులలో పరిభ్రమించిన తరువాత లభించిన అవకాశాన్ని పోగొట్టుకుని ఏడుస్తూ, జీవనమంతా పాపముల వల్ల దుఃఖములను, కష్టాలను భరించవలసి వస్తుంది. ఇదంతా భ్రాంతులలో మునిగిజీవించడం వల్ల జరిగిన దుష్పరిణామాలు ఈ మహాసంకటం నుండి మహామాయే తప్పించగలదు.

గాయత్రిని మహామాయ అంటారు. సాధనవల్ల ఆమె అనుగ్రహం సాధకుని అంతరాళములో దిగి భ్రాంతిలేని స్థితికి వెళ్ళడానికి అవకాశం లభిస్తుంది. ఇదే దివ్యదృష్టి. జ్ఞాన చక్షువుల ఉన్మూలన అని దీనినే అంటారు. జీవన రహస్యాల ఉద్ఘాటన ఈ స్థితిలో జరుగుతుంది. పట్టుకున్న జంఝాటములు పండుటాకుల వలె రాలిపోతాయి. ఆత్మజాగరణ వల్ల కొత్త కోణంతో చూడటం, ఆలోచించడానికి అవకాశం లభిస్తుంది.

రాత్రి స్వప్నముల తరువాత ప్రాతఃకాలములో పరిస్థితి ఎలా మారిపోతుందో అదేవిధంగా మహామాయ యొక్క అనుగ్రహంతో జాగృతి అనే ద్వారం తెరువబడుతుంది. కోరికలు, ఆలోచనలు, క్రియలు ఎలా అవుతాయంటే దేవోపమయ స్వర్గీయ జీవనం యొక్క ఆనందం లభిస్తూనే ఉంటుంది. బంధముల విముక్తి యొక్క బ్రహ్మానుభూతి యొక్క రసాస్వాదన అనవతరం లభిస్తూనే ఉంటుంది. మహామాయ పరబ్రహ్మ సమీపం వరకు తీసుకువెళ్ళే నిజమైన దేవమాతగా చెప్పబడింది. దేవత్వమే ఆమె అనుగ్రహం. గాయత్రి ఉపాసన ఒక స్థాయిలో మహామాయ రూపంలో సాధకుని ప్రతి దృష్టికోణంలో కృతకృత్యుడిని చేయడం జరుగుతుంది.

– అనువాదం : శ్రీమతి జ్ఞానప్రసూన

## ఆత్మిక ప్రగతికి సహకారి మహిళ

*భిక్షుకురాలు ఉద్యానవనంలో సువాసన కలిగిన పూలను ఏరి కొసుకొచ్చింది. సగం మూసుకున్న కనులతోనే తన ఆరాధ్యుడిని వెతుకుతూ వెళ్తున్నది. అడుగులు స్పష్టంగా పడుతున్నాయి. దారిలో దోసిలి నుంచి పూలు జారిపడినపుడు దిశలన్నీ సుగంధితమవుతున్నాయి. ఎండిన ఆకులు నవ్వుతున్నాయి. ఆమె ఎవరిని వెతుకుతున్నదో అతడు లభించాడు. ఆమె ధ్యానమగ్నుడయిన భిక్షువు చరణాలపై పువ్వులను సమర్పించింది. శిరస్సు కూడా శ్రద్ధతో వంచింది.*

*భిక్షువు కనులు తెరచి సంకోచిస్తూ అన్నాడు. "ఎందుకు ఇలా చేశావు" ఆమె స్థిర స్వరంతో ఇలా అన్నది. "నా భగవానునికి ఏమి తెచ్చానో అది సమర్పించాను" భిక్షువు తీక్షణ స్వరంతో అన్నాడు. "నీవు నా మార్గంలో అడ్డంకి అవుతావా?" ఆమె అన్నది "కాను, మీ దారిలో మీరు వెళ్ళండి. నేను నా భగవంతుడిని మార్చుకున్నాను. ఇద్దరి దారి ఒకటి చేసుకున్నా. ప్రేమలో వైరుధ్యం ఉత్పన్నమే కాదు ప్రగతి మార్గంలో స్త్రీ అడ్డంకి అనుకోవడం పొరపాటు" సత్యమేమిటంటే ఆత్మిక ప్రగతి ఆమె సహకారంతో సరళతరమవుతుంది.* – *ప్రజ్ఞాపురాణం నుండి*

**వ్యక్తి, వ్యక్తి మారితేనే సమాజం మారుతుంది.**

ఆదిశక్తి యొక్క లీలాకథలు - 9

# భావనలనే అర్ఘ్యాన్ని భవానీకి సమర్పించుదాం

ఆదిశక్తి యొక్క లీలాగాథలలో ప్రకృతి లేక సృష్టియొక్క సంఘటనాక్రమాలన్నీ ఇమిడివున్నాయి. ప్రకృతియొక్క మూడుగుణాలు, వాటికి సంబంధించిన సృజన-లయం ఆయామముల (dimensions) యొక్క క్రమంతోనే విశ్వ బ్రహ్మాండం యొక్క నిర్మాణం జరుగుతున్నది. వీటినుండే సృష్టి యొక్క ఆరోహ, అవరోహములన్నీ జనిస్తున్నవి. ఈ యావత్ సృష్టి యొక్క సమస్తమైన సంఘటనాక్రమాలనూ పర్యవేక్షించే శక్తి నిజంగా ప్రకృతికి మాత్రమే ఉంది. ఈ మూలశక్తిలో ఏర్పడే పలువిధాలైన మార్పుల వల్లనే ఈ సృష్టి నిర్మాణంలో ఎన్నో కోణాలు అభివృద్ధి చెందుతున్నవి. దేవతాశక్తి మొదలుకొని, పదార్థకణాలలో ఉండే శక్తి యొక్క వివిధరూపాల రహస్యమే మూల ప్రకృతియొక్క వైకృతిక రహస్యం. తమ భావనాజగత్తులో భవానియొక్క స్నేహస్పర్శను పొందగలిగినవారు 'తల్లియైన ఆదిశక్తియే మూలశక్తి' అన్న విషయం తెలుసుకొనగలరు. ఆమెయే ఈ సృష్టి నిర్మాణానికి మూలశక్తి. ఈ జగన్మాతయొక్క వివిధరూపాలే యావత్ సృష్టిలోని అన్ని సంఘటనలకూ ఆధారభూతమగుచున్నవి.

ఆదిశక్తి యొక్క ఈ రహస్యపూర్ణమైన లీలాగాథలయొక్క అన్ని సూత్రాలనూ తనలో ఇముడ్చుకొనియున్న శ్రీదుర్గాసప్తశతి యొక్క చివరి మూడు భాగాలలో రెండవ భాగమైన వైకృతిక రహస్యంలో ఈ సత్యమే వెల్లడిచేయబడినది. లభ్యమైన వివరణలలో ఈ సత్యము పూర్తిగా గోచరిస్తూనే ఉంటుంది. ఎందుకంటే ఈ మూడు అంగాలలోనే విశాలమైన, వ్యాపకమైన ఈ సృష్టి యొక్క నిర్మాణం-స్థితి-లయములకు సంబంధించిన అన్ని రహస్యాలు ఇమిడియున్నవి. ఐనప్పటికీ ఈ సత్యాన్ని సంపూర్ణరూపంలో చెప్పుట, వ్రాయుట, తెలియజేయుట అత్యంత కష్టమైనదేకాదు, దాదాపుగా అసంభవం. ఐతే ఈ సత్యాన్ని సంకేతాలద్వారా కొంతవరకు చెప్పగలం, వినగలం, మాట్లాడగలం, వ్రాయగలం. తెలివికలిగినవారు ఈ సంకేతాలను సహజంగా అర్థం చేసుకొనగలరనే నమ్మకం మాకు కలుగుతున్నది.

నిజానికి ఈ విశ్వబ్రహ్మాండం యొక్క చేతనత్వంలోని అన్ని ఆయామాలలో జరుగుతూ ఉండే శక్తి యొక్క క్రీడను, శక్తి సాధకుడు తన చేతనత్వంలోనే అనుభూతి చెందగలడు. తనలో ఇమిడియున్న మూలశక్తిని స్వయంగా సాక్షాత్కరింప జేసుకున్న వ్యక్తి ఆ శక్తి యొక్క వివిధరూపాలనూ తనలోని వివిధ అంగాల రూపంలోనే అనుభూతి చెందుతాడు. తన శక్తి యొక్క వివిధ అంగాలే విస్తృతంగా వ్యాపించి, సృష్టియొక్క లోక లోకాంతరములుగా రూపుదాల్చినవి అన్న సత్యాన్ని కూడా అతడు అర్థం చేసుకొనగలడు. ప్రతి ఒక్క జీవాత్మ యొక్క మూలప్రకృతి వర్తులాకారపు మూడున్నర చుట్టలలో చుట్టుకుని ఉన్న కుండలినీ శక్తియే. ఈ మూల ప్రకృతియే వ్యక్తిగతమైన ఉనికిలోనూ, సమిష్టిగతమైన వ్యాపకత్వంలోనూ, వివిధ దేవీదేవతాశక్తుల రూపంలోనూ ప్రకటీకృతమైయున్నది.

ఈ సత్యానికి సాంకేతిక, మాంత్రిక, తాంత్రిక మరియు తాత్త్వికపరమైన వ్యాఖ్యానమును తెలియజేసేదే వైకృతిక రహస్యం. యోగసాధకులైనవారు ఈ సంకేతాన్ని అర్థం చేసుకొని భగవతి యొక్క లీలలను సాక్షాత్కరింపజేసుకుంటారు. మంత్రవిదులైనవారు దీనిలోని మాంత్రికశక్తులను జాగృతం చేసి, తద్వారా ఎన్నో అద్భుతాలను సాకారం చేసుకొనగలరు. ఇందులో దాగియున్న తాంత్రిక ప్రక్రియలు కూడా ఎంతో సమర్థవంతమైనవి. ఏ వ్యక్తియైనా వీనిని సరియైన రీతిలో ప్రయోగించగలిగితే కనుక అసంభవాలన్నీ సంభవం కాగలవు. దీనియొక్క తత్త్వచర్చ వేదాంతపరమైన అన్ని సిద్ధాంతాలకూ సారం.

ఈ తత్త్వాలనూ, సత్యములనూ, రహస్యాలనన్నింటినీ తనలో ఇముడ్చుకున్నటువంటి ఈ వైకృతిక రహస్యంలో 39 మంత్రములున్నవి. ఋషివాక్కుతో ఈ అధ్యాయం ప్రారంభమౌతుంది. ఋషి ఈవిధంగా చెప్తున్నాడు. 'ఓరాజా! దీనికి ముందు చెప్పబడిన ప్రాథమిక రహస్యంలో మూల ప్రకృతి రూపమైన మహాలక్ష్మి యొక్క స్వరూపాన్ని గురించి వివరించడం జరిగింది. ఆమెయే మూడు గుణాలకు ఆధారం.' దీని తరువాత ఋషిసత్తముడు ఆమెయొక్క త్రిగుణధారల యొక్క మూడు రూపాలను గురించి వివరించారు. మహాకాళీ రూపంలో ఆమె తమోగుణమునకు అధిష్ఠాత్రియై మధుకైటభులను నశింపజేసినది. మహాలక్ష్మీస్వరూపంలో ఆమె రజోగుణమునకు అధిష్ఠానశక్తి. ఈ రూపంలో జగన్మాత మహిషాసురుని వధించినది. మహాసరస్వతి రూపంలో ఆమె సత్త్వగుణమునకు అధిష్ఠాత్రియై శుంభ నిశుంభులను సంహరించినది. ఈ మూడు రూపాలను గురించి

**ప్రసన్నంగా ఉండేవారికే ప్రసన్నంగా ఉండే పరిస్థితులు లభిస్తాయి.**

ఎంతో సమ్మోహనంగా వివరించబడిన ఈ కావ్యంలో మనోహరత్వంతోపాటు స్వరూపచిత్రణ కూడా చెయ్యబడినది.

దీని తదుపరి మంత్రాలలో ఈమెను పూజించవల్సిన తాంత్రిక విధానం చెప్పబడినది. ఈ విధానం సాంకేతికపద్ధతిలో తెలియజెయ్యబడినది. ఏమయినా ఈ ప్రయోగం చాలా కఠినమైనది, ఉన్నతస్థాయీ సాధకులకు మాత్రమే సాధ్యమయ్యేది. జగన్మాతను సాత్త్వికరూపంలో పూజించేవారికి దేవీసూక్తంలోని 'నమోదైవ్యై' మొదలైన మంత్రాలద్వారా అమ్మను స్తుతించవల్సినదిగా ఋషి ఉపదేశిస్తున్నాడు. ఈ అధ్యాయంలో శ్రీదుర్గాసప్తశతి యొక్క మంత్రాలలోని గొప్పతనం ఎంతో లోతుగా వెల్లడిచేయబడినది. భగవతిని సాత్త్వికరూపంలో నిష్కామభావంతో సేవించే సాధకులు బలి ఇవ్వడం, మాంసం నివేదించడం వంటివి చేయరాదనికూడా సూచించబడినది.

ఈ అధ్యాయం తదుపరి శక్తి సాధకులందరికీ ఉపయుక్తమైన వైకృతిక రహస్యం యొక్క పారాయణా విధానం చర్చించబడినది. సంపూర్ణమైన భక్తితో, భావపూరితమైన హృదయంతో దేవియొక్క ప్రతిమ లేదా పటం ముందు కూర్చుని శ్రీదుర్గాసప్తశతియొక్క మూడు చరిత్రలను పారాయణ చెయ్యాలి అని ఇందులో చెప్పబడినది. పారాయణక్రమంలో గుర్తుంచుకొనవల్సిన ముఖ్య విషయం- ఏదైనా ఒక చరిత్రను మాత్రమే పారాయణ చెయ్యదలచుకున్నవారు కేవలం మధ్యమ చరిత్రను మాత్రమే చదువవలెను, కానీ ప్రథమచరిత్ర, ఉత్తరచరిత్రలలో ఏదో ఒకదానిని మాత్రమే పారాయణ చేయుట సుముచితం కాదు. ఏ చరిత్ర అయినా సగం పారాయణ చెయ్యటంకూడా ఉచితం కాదు. ఇలా చెయ్యటం వలన సాధకుని సాధన సఫలీకృతం కావటంలో కొంచెం సంశయం ఏర్పడుతుంది. పారాయణమునకు వలెనే హోమమునకు కూడా ప్రాముఖ్యత ఉంది. ఈ విషయమై ఋషి ఈ క్రిందివిధంగా చెప్తున్నాడు.

**ప్రతి శ్లోకంచ జుహుయాత్పాయసం తిల సర్పిషా ।**
**జుహుయాత్స్తోత్ర మన్త్రైర్వా చణ్డికాయై శుభంహవిః ॥**

**(34-35)**

ఈ శ్లోకానికి అర్థం – శ్రీదుర్గాసప్తశతి యొక్క ప్రతివొక్క శ్లోకమూ మంత్రమే! ఆ మంత్రంతోపాటు నువ్వులు, నెయ్యి కలిపి చేసిన పాయసంతో ఆహుతి నివ్వండి. లేకపోతే సప్తశతిలో ఏదైనా స్తోత్రం వచ్చినప్పుడు ఆ స్తోత్రమంత్రంతోపాటు చండికకు పవిత్రమైన హవనసామగ్రితో హోమాన్ని చెయ్యండి. హోమం తరువాత భగవతిని భక్తిపూర్వకంగా ప్రార్థించండి. తదనంతరం మనస్సునూ, ఇంద్రియాలనూ వశంలో ఉంచుకుంటూ చేతులు జోడించి వినమ్రభావంతో దేవికి నమస్కరించి, మీ అంతరంగంలో ఆమెను స్థాపించుకొని, ఆ సర్వేశ్వరియైన చండికను ఎంతోసేపు ధ్యానించండి. అది ఎంతసేపంటే- ధ్యానిస్తూ ధ్యానిస్తూ ఆమెలో లీనమయ్యేంత తన్మయత్వం మీలో కలగాలి.

'భగవతి భావమయి' అనేదే శక్తిసాధకులందరి యొక్క అనుభవం. ఆమెకు తన భక్తులంటే ఎంతో ప్రీతి. సాధనలో విధివిధానాలకీ, కర్మకాండకీ ఎంతో ప్రాముఖ్యత ఉన్నదనేది నిజం. సాధన ఏదైనా కోర్కెతో కూడుకున్నట్లయితే, ఈ ప్రాముఖ్యత ఇంకా అధికంగా ఉంటుంది. కానీ సాధకుని మనస్సు భక్తితో నిండి, ఆ భక్తిభావం హృదయం లోతులలోపలివరకూ వ్యాపించివున్నట్లయితే విధివిధానాలు, కర్మకాండంలో ఎటువంటి లోటుపాట్లు ఉన్నా వాటంతట అవే సమసిపోతాయి. ఏ బిడ్డ అయినా ఆ జగన్మాతను 'అమ్మా!' అని పిలిచి, దేనినైనా అడిగితే ఆ తల్లి తప్పకుండా ఇచ్చి తీరుతుంది. అందుచేత ఆదిశక్తి యొక్క ఉపాసకులందరికీ తమ భావనలనుకూడా ఎల్లప్పుడూ అంతరంగపు లోతులలోపలి వరకూ స్వచ్ఛంగా, పవిత్రంగా ఉంచుకొనటం ముఖ్య కర్తవ్యం. భవానికి తమ భావనలతో అర్ఘ్యాన్ని సమర్పించే సాధకులకు, వారి కోర్కెలన్నీ నెరవేరుతాయి.

*– అఖండజ్యోతి, సెప్టెంబర్ 2007*
*అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి*

## నెపోలియన్

*నెపోలియన్ బోనాపార్ట్ అప్పుడు ఒక విద్యార్థి. అతను ఉండటానికి ఒక మంగలి ఇంట్లో గది అద్దెకు తీసుకున్నాడు. అతనికి ఒక అందమైన కూతురు వుండేది. ఆమె 'నెపోలియన్'ని తన ఆకర్షణలో పడవేసుకోవాలని అనేక ప్రయత్నాలు చేస్తువుండేది. నెపోలియన్ ఉపేక్షించి తన మానాన తను చదువుకునేవాడు. రోజులు గడిచాయి. నెపోలియన్ సేనలో చేరాడు. బాల్యంలో సంయమన జీవితం వలన శారీరక శక్తి, బుద్ధి, కౌశలాలకి కొదవలేదు. అందువల్ల 25 సంవత్సరముల అల్పప్రాయంలోనే సేనాపతి అయ్యాడు. ఒకసారి అతను తను చదువుకున్న విద్యాలయానికి వెళ్ళాడు. ఆ యువతిని కూడ కలసి – గుర్తున్నానా? అని అడిగాడు. 'ఆ వర్తి పుస్తకాల పురుగువి' అన్నది. అప్పుడు నెపోలియన్ అన్నాడు, 'నిజమే నీ ఆకర్షణకు లోనైవుంటే ఈనాడు సేనాపతిగా నీ ముందు ఉండేవాడినికాదు.'*

**ఉత్సాహం + కృషి = సాఫల్యం.**



ధారావాహిక: హనుమత్ కథామృతం-33

# వరప్రాప్తితో పులకించిన హనుమంతుడు

శివుని సహస్రార్చన చేసిన తర్వాత శ్రీరామునికి, హనుమంతునికి మనస్సు స్థిమితపడింది. వారి హృదయాలలో మారుమ్రోగుతున్న భగవాన్ మహేశ్వరుని కంఠస్వరం స్పష్టంగా వినిపిస్తోంది. శ్రీరాముని ముఖంపై చిరునవ్వు మెరిసింది. ప్రసన్నత ఆవరించింది. హనుమంతుడు పరమశివుని కంఠస్వరం విని పులకించిపోయాడు. భగవంతుని స్వరం వినడంతో అతని రోమరోమం స్పందించిపోతున్నాయి. భగవంతునిలో భక్తునిలో వచ్చిన పరివర్తన చుట్టుప్రక్కల వారిని ఆశ్చర్యంలో ముంచివేసింది.

శ్రీరాముని ఎదురుగా ఆయన సోదరులు ముగ్గురు నిలబడి ఉన్నారు. సహస్రదళ పద్మంలాగా వికసించిన శ్రీరాముని ముఖాన్ని అందరు దర్శించారు. ఆయన ముఖంలో వేలవేల చంద్రులు ప్రకాశిస్తూ ఉన్నారు. శ్రీరాముని గంభీర స్వభావం అందరికీ పరిచయమే. ఆయన మితభాషి. ఆయన నోటినుండి ఏమాట వచ్చినా ఆధ్యాత్మిక చర్చ జరుగుతుంది. అంతేకాక జీవితంలోని నిగూఢ విషయాలను అతిసులభంగా వివరిస్తాడు. కాని ఈనాటి మాట వేరుగా ఉంది. ఆయన హృదయంలోని ప్రసన్నత పెదవుల మీద, ముఖం మీద స్పష్టంగా కనిపిస్తోంది. సంతోషం పట్టలేక శ్రీరాముడు సోదరులను హృదయానికి హత్తుకున్నాడు.

సోదరుల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. వారికి ఇదంతా విచిత్రంగా కనిపిస్తోంది. వారి తండ్రి దశరథ మహారాజు రాణులను వెంటబెట్టుకుని వస్తూ ఉన్నాడు. వారితోపాటు కులగురువు వశిష్ఠ మహర్షి కూడా ఉన్నాడు. ఆయన వెనుక ఋషిముని గణం ఉంది. దూరం నుండి చూస్తూ ఉంటే వీరంతా ఆధ్యాత్మిక చర్చలో నిమగ్నమై ఉన్నట్లుగా కనిపిస్తోంది. వారిని చూసిన లక్ష్మణుని మనస్సులో సహజమైన జిజ్ఞాస అంకురించింది. వేగంగా నడుచుకుంటూ తల్లిదండ్రులకు ప్రణామం చేశాడు. కౌసల్యాదేవి నవ్వుతూ – "కుమారా! లక్ష్మణా! ఈరోజు నీవు చాలా ప్రత్యేకమైన ఆనందంలో కనిపిస్తూ ఉన్నావు ఏమిటి సంగతి?" అని ప్రశ్నించింది.

లక్ష్మణుడు కూడా నవ్వుతూ – "పెద్దమ్మా! నేను ఒక్కడినే కాదు. భరత, శత్రుఘ్నులు కూడా చాలా ఆనందంగా ఉన్నారు. గ్రహణకాలంలో అన్నగారు సాధన చేసి చాలా ఆనందంగా ఉన్నారు. వారి సాధనకు పరమశివుడు సంతోషించి విశేష వరములు ప్రసాదించాడు. అందువల్ల వేమంతా ఆనందడోలలో ఊగులాడుతున్నాం" అని సమాధానం చెప్పాడు. ఇంతలో శ్రీరాముడు కూడా మిగిలిన సోదరులతో కలసి వచ్చేశాడు. వారు కూడా అందరికీ నమస్కరించి ఆశీస్సులు అందుకున్నారు. వశిష్ఠుడు చిరునవ్వుతో "నాయనా! లక్ష్మణా! శ్రీరాముని ఆనందానికి కారణం కేవలం పరమశివుని వరదానం మాత్రమే కాదు. మరొక్కకారణం కూడా ఉంది" అన్నాడు. "అదేంటో త్వరగా సెలవివ్వండి" అంటూ లక్ష్మణుడు తొందరచేశాడు. తెలుసుకోవాలి అన్న ఆతృత లక్ష్మణుని ముఖం మీద కొట్టొచ్చినట్లు కనపడుతోంది. అతని ఆతృత చూసి ఒక్క వశిష్ఠుడు తప్ప అందరూ ఒక్కసారిగా పక్కున నవ్వారు. వశిష్ఠుడు అందరినీ సున్నితంగా మందలిస్తూ – "మీరంతా మా లక్ష్మణుని చూచి నవ్వుతున్నారెందుకు? అతడు తగిన విధంగానే అడిగాడు" అంటూ లక్ష్మణుని వైపు తిరిగాడు. ప్రేమతో లక్ష్మణుని ముఖాన్ని తిలకిస్తూ – "కుమారా! **భగవంతుడు ఎప్పుడూ తన ప్రియమైన భక్తుడు ఆనందంగా ఉంటే తాను ఆనందంగా ఉంటాడు.** తన భక్తుని ఆనందం చూచి రాముడు కూడా ఆనందంగా ఉన్నాడు" అంటూ వివరించాడు.

గురుదేవుల సమాధానం విని లక్ష్మణుడు మరికొంత ఆలోచనలో పడ్డాడు. మరల ప్రశ్నించాడు – "గురువర్యా! ఆ రామభక్తుడు ఎవరు? ఎవరి ఆనందం శ్రీరాముని ఇంత ముగ్ధుణ్ణి చేస్తోంది? దయచేసి త్వరగా వివరించండి" అంటూ వేడుకున్నాడు. వశిష్ఠుడు శాంత స్వరంలో – "కంగారుపడకు నాయనా! దీనికి సమాధానం నీకు నెమ్మదిగా తెలుస్తుంది. ఇప్పటికి ఈ మాత్రం చాలు" అని ముగించాడు. లక్ష్మణుడు ఇక మాట్లాడలేదు. భరత శత్రుఘ్నులు చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. దశరథ మహారాజుకు, మహారాణులకు వశిష్ఠుని మాటలు సరిగా అర్థం కాలేదు. ఆయన తన కుమారులను

**సదాలోచనల, సత్కర్మల ఆచరణే శీలం.**

చూస్తూ – "నాయనలారా! మీరంతా ఇదేవిధంగా ఆనందంగా జీవించాలి. మీ ఆనందంలోనే మేమూ ఆనందంగా గడిపివేస్తాము" అన్నాడు. తరువాత మహామంత్రి సుమంతుని వైపు తిరిగి రాజమహలుకు ప్రయాణం కమ్మని సైగ చేశాడు.

ఈ సంకేతంతో అందరి ఆలోచనలు మారిపోయాయి. అందరు తిరుగు ప్రయాణం సందడిలో ఉన్నారు. శ్రీరాముని మనస్సులో మాత్రం హనుమంతుడు కనిపిస్తూ ఉన్నాడు. హనుమంతుడు కూడా సదాశివుని వరదానం వల్ల పులకించి పోయాడు. శ్రీరాముని హృదయంలో స్మరిస్తూ జపిస్తున్నాడు. నా ఆరాధ్య దైవాన్ని నాకు తొందరగా చూపించు అని పరమశివుని వేడుకుంటున్నాడు. హనుమంతుని ముఖంలో హర్ష విషాదాలు రెండూ తాండవమాడుతున్నాయి. శ్రీరామదర్శనం కోసం తపించిపోతున్నాడు. ఈ స్థితిలో ఉన్న ఆంజనేయుని చూచి తల్లి అంజనాదేవి – "కుమారా! ఈరోజు ఇంత ఆందోళనగా ఉన్నావెందుకు? ఆనందంతో పాటు ఆందోళనకూడా స్పష్టంగా కనిపిస్తుంది. కారణం ఏమిటి?" అని ప్రశ్నించింది. హనుమంతుడు ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా తిరిగి ప్రశ్నించాడు "అమ్మా! భగవంతుని వరదానం ఏవిధంగా ఫలిస్తుంది? అని, అంజనాదేవి హనుమంతుని శిరస్సుపై చేయివేసి నిమురుతూ – "పుత్రా! భగవంతుని మాట ఎన్నడూ కల్లకాదు. దానిని ఫలింపచేసే బాధ్యత కూడా ఆయనదే. ఆయన వరదానం సఫలం కావడానికి క్రమేపీ ప్రకృతి తగిన సంఘటనలను తానే సృష్టించుకుంటుంది. దాని ప్రకారమే వరం ఫలించి తీరుతుంది. ప్రకృతి ఏదో ఒక రూపంలో సహకరిస్తుంది. అని నచ్చచెప్పింది.

అంజనాదేవి హనుమంతుని కళ్లల్లోకి చూస్తూ – "కుమారా! ఇంతకీ నీకు లభించిన వరదానం ఏమిటి?" అని ప్రశ్నించింది. "అమ్మా! శివునికి సహస్రార్చన చేశాను. సదాశివుడు పరమానందపడి తొందరలోనే నీకు శ్రీరామదర్శనం లభిస్తుంది అని వరమిచ్చాడు" అని మెల్లగా మెల్లగా చెప్పాడు. అంజనీమాత ఆనందం వర్ణించడానికి వీలులేదు.

ఆనందంగా "అదా సంగతి? అలాంటప్పుడు నువ్వు చాలా ఆనందంగా ఉండాలి కదా? ఈ విషాద ఛాయలు ఎందుకు? నీవు పరమశివుని మాటపైన నమ్మకం ఉంచుకోవాలి. శివుడు తన మాటను తానే నిలబెట్టుకుంటాడు. పరమేశ్వరుడు సర్వ సమర్థుడు. ఆయన కనుసన్నలలోనే ఈ జగత్తు సర్వం నడుస్తూ ఉంటుంది. ఆయన భూత భవిష్య వర్తమానాలను తెలిసినవాడు. ఏది ఎప్పుడు ఎలా జరగాలో ఆయనకు బాగా తెలుసు" అంటూ ఓదార్పుగా మందలించింది. వెంటనే హనుమంతుడు ఆనందం పట్టలేక అమ్మను ఆలింగనం చేసుకున్నాడు. తల్లి ప్రేమగా అనునయిస్తూ కుమారుని భర్త దగ్గరకు తీసుకునిపోయింది.

– అఖండజ్యోతి, ఏప్రిల్ 2010

## శ్రీ గాయత్రీ శతకం

45. *అరయ 'సద్బుద్ధి' యగును గాయత్రి యన్న*
*అగును 'సత్కర్మ' పావన యజ్ఞమనగ*
*అవియె మాతాపితరులని 'అంబ' యనును*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– నిశితంగా ఆలోచిస్తే 'గాయత్రి' అనగా 'సద్బుద్ధి' అని అర్థం. పవిత్రమైన 'యజ్ఞము' అనగా 'సత్కర్మ' అని అర్థం. ఈ రెండే వరుసగా సాధకుని తల్లిదండ్రులని వేదమాత గాయత్రి తెలియజేస్తుంది.*

46. *విశ్వమిత్రుడు, సువిశిష్ఠ విమలగుణుడు*
*బ్రహ్మనిష్ఠుడౌ గురుబోధ ఫలమునిచ్చు*
*పాపినేర్పిన మంత్రమే శాపమనును*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– గాయత్రీ మంత్ర విషయమై ఒక శాపం ఉందంటారు కొందరు. అది ఏ సందర్భంలో శాపంగా మారుతుందో ఆ తల్లే పలికింది. విశ్వమంతటికీ మిత్రుని లాంటివాడు, సువిశిష్టమైన నిర్మలమైన గుణములు కలిగినవాడు, బ్రహ్మదేవుడంతటి నిష్ఠాగరిష్ఠుడు అయిన గురువును ఆశ్రయించి గాయత్రీ మంత్రమును సాధన చేస్తే ఫలితం ప్రయోజనకరమైన వరంలా అందుతుంది. అలా కాకుండ కపట గురువుని ఆశ్రయించి జపిస్తే ఆ మంత్రమే శాపమై సాధకునికి శోకాన్ని మిగిలిస్తుందని వేదమాత వాక్కు.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**నిజాయితీ వల్ల నిజమైన శాంతి లభిస్తుంది.**



పూజ్య గురుదేవుల అమృతవాణి

# యుగపరివర్తన కాలములో పంచశీలములను పాటించండి

*(గతసంచిక తరువాయి...)*

మీకు అప్పగించబడిన పనులు సామాన్యమైనవి కావు, అవి చాలా పెద్ద పెద్ద పనులు. ఇల్లు కట్టడం, భవంతులు నిర్మించటం వంటివి సామాన్యమైన పనులను కూలీలు చేయగలరు. బావులు తవ్వటం, ఫ్యాక్టరీలు నడపటం కూడా చాలా సాధారణమైన పనే కానీ మనుష్యుల మనస్సులను మార్చటం మాత్రం చాలా కష్టమైన పని. శరీరానికి వచ్చిన వ్యాధులను నయం చేయటం, పేదరికాన్ని తొలగించటం, అలవాట్లను చక్కదిద్దటం ఎంత కష్టమైన పనులో, మానవుని విశ్వాసాలను మార్చటం కూడా అంతకన్నా కష్టమైన పనే. వందమందిలో ఒకరిద్దరు కూడా మారరు. లక్షల మంది మానవుల విశ్వాసంలో, దృష్టికోణంలో, ఆలోచనలలో మార్పును తీసుకువస్తామని మీరు ప్రతిజ్ఞ చేస్తున్నారు. మీరు చేపడుతున్న పని ఎంత కఠినమైనదో అర్థం చేసుకోండి. మీ భుజస్కంధాలపై ఎత్తుకున్న ఈ బాధ్యత ఎంతో సాహసంతో కూడుకున్నది. ఈ దుస్సాహసాన్ని నిర్వర్తించటానికి మీలోపల నుండి కొన్ని బలమైన శక్తులను వెలికితీయవలసియున్నది.

## గొప్ప మనోబల సంపన్నులు కండి

మిమ్మలను మీరు అధిక శక్తివంతులుగా తీర్చిదిద్దుకోండి. ఇతరుల కన్నా అధిక మనోబల సంపన్నులుగా, మంచి వ్యక్తిత్వం కలవారుగా తయారుకండి. అలా కాకపోతే మీరు అపజయం పాలై రోదించవలసి ఉంటుంది. ఏసుక్రీస్తు ఒంటరిగానే ఈ ప్రపంచంలోకి వచ్చాడు. వందలకోట్లకు పైగా ప్రజలు ఆయనను అనుసరించి క్రీస్తుమతాన్ని స్వీకరించారు. బుద్ధభగవానుడు కూడా అంతే. యావత్తు ప్రపంచం యొక్క రూపునే మార్చివేసాడు. సప్తఋషులు సప్తద్వీపాలను నియంత్రించగలిగారు. ఎవ్వరూ మీ మాట వినలేదని భావించవద్దు. ఫలాన పని మంచిది, ఫలాన పని చెడ్డది అని అందరూ చెప్పగలరు. ప్రతి వ్యక్తి ప్రపంచంలోని విషయాలన్నీ చెప్తుంటాడు. కానీ తన గురించి ఏమి చెప్పడు. మన దగ్గర మంచితనం ఉంటే అందరు మనం చెప్పిన మాట వింటారు.

## సంస్కారములను నింపుకోండి

ఇతరుల కన్నా మిన్నగా మిమ్మలను మీరు తీర్చుదిద్దుకోవాలనుకుంటే కొన్ని పనులను చేసి తీరాలి. మీ చేత పంచకోశసాధన, ఉపాసన చేయించటానికి నిర్ణయించుకున్నాను. ఈ శిబిరంలో వానప్రస్థంలోని బాధ్యతలను, కర్తవ్యాలను చెప్పిన తరువాత పంచకోశముల ఉపాసన గురించి తెలియజేయబడుతుంది. గాయత్రికి ఐదు ముఖములు ఉంటాయి. అలాగే మన లోపల అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ అనే ఐదు కోశములు ఉంటాయి. ఈ ఐదు కోశములు జాగృతం చేయటానికి కావలసిన ఉపాసన నేర్పించబడుతుంది. మా గురుదేవులు మాకు జ్ఞానాన్ని, శిక్షణను, సాధనను, తెలివినీ అన్నింటిని మించి అంతులేని ఆధ్యాత్మిక బలాన్ని, ఆత్మబలాన్ని అందించారు. ఆత్మబలాన్ని అభివృద్ధి చేసుకొనడానికి మనం మనలోపల ఉన్న పంచతత్వాలను, పంచ ప్రాణాలను సంస్కరించుకొనవలసి ఉంది.

## పంచతత్వములు, పంచప్రాణముల బ్రహ్మావర్చస్

మన శరీరం పంచతత్వములతో తయారు చేయబడినది. ఈ పంచతత్వములను ఉత్కృష్టము గావించుకొనుటకు పంచకోశముల ఉపాసన ఎంతో అవసరం. మన యొక్క చేతనత్వము పంచప్రాణములతో జోడించబడి ఉంటుంది. ప్రాణ, అపాన, సమాన, ఉదాన, వ్యానములని చెప్పబడే ఈ ఐదు ప్రాణములను కూడా ఉన్నతముగా శక్తివంతంగా తీర్చిదిద్దకోవాలి. చేతనత్వముతో పాటు అంతరంగ బహిరంగములు కూడా శక్తివంతం కావటానికి ఉపాసన చేయాలి. ఇందుకోసమే "బ్రహ్మావర్చస్" నిర్మాణము చేయబడింది. జప ధ్యానముల గురించి, సోహం సాధన గురించి, ఖేచరీ ముద్ర గురించి గతంలో చెప్పటం జరిగింది. మీరు వీటిని ఇంటి వద్ద అభ్యాసం చేస్తూ ఉంటే మంచిది, ఇది ఎంతో మంచి ఉపాసన. ఉపాసన ఏ సమయంలోనైనా ఎంత అవధిలోనైనా చేయవచ్చు. మా గురుదేవులు మా చేత చేయించిన విధంగానే మీరు కూడా ఉపాసన, సాధన చేయవలసి ఉంటుంది. ఇందుకు కనీసం రెండు

**తనపై తాను విజయం సాధించినవాడే నిజమైన విజేత.**

నెలల వ్యవధి అవసరమవుతుంది. ఎప్పుడో జరగబోయేది అయినా, అందుకు ఇప్పటి నుండే పృష్ఠభూమిని సిద్ధం చేయాలి.

## పంచశీలములను తయారు చేసుకొనుట

ఆధ్యాత్మికలోని పంచశీలములను ముందునుండే తయారు చేసుకోవాలి. నేలను త్రవ్వి, నీరుపెట్టి, నాగలితో దున్ని, ఎరువును వేసిన తరువాతనే మంచి విత్తనములను నాటాలి. రాతి నేలలో విత్తనములు మొలకెత్తవు. అలాగే పంచకోశసాధన, కుండలినీ సాధన, జపము, ధ్యానమూ ఇవన్నీ ముందుగానే నేర్చుకొనవలెనని అనుకోవద్దు. అలా చేస్తే, ఎమ్.ఎ. పాసయిన తర్వాత తిరిగి వెనుకకు వచ్చి బి.ఎ., ఇంటర్, హైస్కూలు చదువులు చదవాలని అనుకున్నట్లుగా ఉంటుంది. ఆధ్యాత్మికత లోనికి ప్రవేశించటానికి దగ్గర దారులు ఏమీ లేవు. నేషనల్ హైవే మీద నుండే మీరు నడక ప్రారంభించండి.

## పంచకోశ ఉపాసనకు ముందు ఏర్పాట్లు

పంచకోశ ఉపాసనకు ముందుగా మన మనఃస్థితిని, మనోభూమిని సంస్కరించుకోవాలి. భూమి సంస్కారపూరితమై ఉంటే ఔన్నత్యం దానంతటే అదే వస్తుంది. పూజలు, పునస్కారాల పట్ల కన్నా, మిమ్ములను మీరు సంస్కారపూరితంగా, యోగ్యతాయుక్తంగా, సమున్నతంగా, తీర్చిదిద్దుకొనటం పట్ల ఎక్కువ శ్రద్ధ వహించండి. అప్పుడు మీరు ఎంతో శక్తివంతులవుతారు. మీరాబాయి, రైదాసు, తులసీదాసు, కబీరు మొదలైన వారంతా చూడటానికి అందరివలె మామూలు మనుష్యులే! ఐతే వారికున్న జ్ఞానం, మనోబలం, పరిస్థితుల దృష్ట్యా ఏర్పడిన ఉన్నతమైన అంతరంగం వారిని నేల మీద నుండే ఆకాశాన్ని స్పృశించేటట్లు చేశాయి.

## మీ కుటీరంలో మీరు ఒంటరిగా ఉండండి

పంచకోశ జాగరణకు మూలభూతమైన ఆధారంగా ఒకే ఒక్క మార్గం ఉంది. మీకు మీరు ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని నిర్మించుకొని అందులో ఉంటూ ఉండాలి. యవ్వనవంతులుగా మారటానికి ప్రజలు ఒక ప్రత్యేకమైన కుటీరాన్ని నిర్మించుకుంటూ ఉంటారు. మధురా జిల్లాలో కోశీ అనే ప్రదేశంలో ఉండే ఒక స్వామీజీ మహానుభావుడైన మాలవ్యాజీని యవ్వనవంతులుగా చేయదలచి ఆయనను తన వద్దనే 40 రోజులు పాటు ఒక ప్రత్యేకమైన కుటీరంలో ఉంచారు. ఆ కుటీరానికి 5,6 ప్రాకారాలు ఉన్నాయి. అన్నింటికన్నా లోపలి ప్రాకారంలో ఉన్న కుటీరంలో మాలవ్యాగారు ఉండేవారు. స్నానపానాదులు, ఆహార విహారములు అన్నీ అక్కడే జరిగిపోతూ ఉండేవి. ఎండ తగలకూడదు కాబట్టి అంతా లోపలే ఏర్పాటు చేయబడేవి. అదేవిధంగా హిమాలయాలలోని గుహాలలో కూడా మునులు తమ తమ గుహలలో ఒంటరిగా నివశిస్తూ ఉంటారు. సూరత్‌లో ఒక స్వామీజీ ఉండేవారు ఆయన తన వద్దకు వచ్చిన వారిని ఎన్ని రోజులు ఉంటారు అని ప్రశ్నించేవారు. “ఒక నెల ఉంటాము అన్న జవాబు” రాగానే వారిని ఒక ప్రత్యేకమైన గదిలో ఉంచి బయట తాళం వేసేవారు, ఆ రోజులలో ఇలాంటి సాధన చేయించబడుతుండేది. ఐతే ప్రస్తుతం ఇంత కఠినమైన సాధనను వదిలివేసి, మనస్సును మాత్రం కుటీరంలో ఏకాకిగా ఉన్నట్లు బందీ చేసేసుకోండి, ఏకాంతంగా ఉండటం వదిలివేసి, మనస్సును మాత్రం కుటీరంలో ఏకాకిగా ఉన్నట్లు బందీ చేసేసుకోండి, ఏకాంతంగా ఉండటం నేర్చుకొని, మీదైన ఒక ఒంటరి ప్రపంచాన్ని నిర్మించుకోండి. ఆ ప్రపంచంలో ఉంటూ మరి ఎవ్వరికి లభించనంత శక్తినీ, ధైర్యాన్నీ సంపాదించుకోగలరు. ఇది ఒంటరితనం మీకు ప్రసాదించే వరం. ఎంతో మహత్వ పూర్ణమైన శక్తిని గలిగిన సూర్యుడు, చంద్రుడు, భూమి మొదలైన గ్రహములన్నీ కూడా ఒంటరిగానే పయనిస్తూ ఉంటాయి. ఇతరులపైన ఆధారపడటమనేది పూర్తిగా మానివేయండి.

మీ ఒంటరి ప్రపంచంలో, మీ ఏకాంతపు నివాసంలోకి ఇంకెవ్వరినీ రానీయవద్దు. కేవలం దేవతలను మాత్రమే అచ్చట స్థాపించుకొనండి. కానీ మీ ప్రపంచంలోనే మీరు ఉండండి. ఖైదీలకు ఎవరి ‘సెల్’ వారికి ఉంటుంది. ఖైదీ జైలులో ఉంటూ, తింటూ, పనిచేస్తూ ఉంటాడు. కానీ అతడు మనస్సు మాత్రం ఇంటిలో భార్య, బిడ్డలను గురించే ఆలోచిస్తూ వారి చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుంది. మీరు మీ జైలులో ఉండండి. అందరితో కలిసే ఉండండి. కాని వేరుగా ఉండండి. వారి మాటలు పట్టించుకోకండి. పట్టించుకుంటే మిమ్మల్ని చాలా తప్పుదారిలోకి తీసుకువెళతారు. మన మనస్సు హేయమైనది, ఆలోచనలు, సంస్కారములు చాలా అల్పమైనవి. అందుచేత ఇతరులు మనకు ఇచ్చే నీచమైన సలహాల వల్ల మన వినాశనం, పతనం తక్షణమే మొదలవుతాయి.

**మానవత్వం అమూల్యం. దానిని రక్షించుకోవడం పరమ కర్తవ్యం.**

## లౌకికమైన స్నేహితులను ఆపేద్దాం

మన కుటుంబ సభ్యులు, వంశీకులు, ఇంకా కొంత మంది దగ్గరి వ్యక్తులను మనం "స్నేహితులు" అంటూ ఉంటాము. వీళ్ళు మనకి పెళ్ళి పేరంటాలలో సహాయం చేస్తారు. విందు వినోదాలను ఏర్పాట్లు చేస్తారు. అంతేకానీ మీ యొక్క ఆత్మోన్నతికి ఉపయోగపడే మార్గాన్ని ఎన్నుకోమని సలహా ఇవ్వరు. త్యాగం, వైరాగ్యం, సమాజసేవ... మొదలైన అంశములతో కూడిన మార్గంలోకి మనలను వెళ్ళమని చెప్పరు పైగా మనం వెళ్ళాలనుకున్నా అడ్డు పడుతుంటారు.

జీవితంలో మనలను అడ్డుకునే వాళ్ళ సంఖ్య ఎక్కువే! ఉప్పుసత్యాగ్రహం మొదలైన రోజునే నేను కార్యకర్త (వాలంటీర్) వలె పని చేయాలని నిర్ణయించుకున్నాను. అయితే మా బంధువులు యావన్మందీ, ఇంటిలోని వారూ నన్ను చేయిజారి పోనీయరాదని నా చెప్పులు, బట్టలు, మొదలైనవన్నీ దాచేశారు. నా మీద వాచ్‌మెన్‌ని కాపలాకు పెట్టారు. నేను బహిర్భూమికి వెళ్ళాలని గట్టిగా పట్టుబట్టి జంధ్యాన్ని చెవిమీదుగా వేసుకొని, ఒంటినున్న బట్టలతో ఒక నీటి చెంబుతో బయటకు వచ్చేశాను. ఏప్రిల్ 6న సత్యాగ్రహం ప్రారంభం కాబోతున్నది ఆగ్రా పట్టణంలో. ఆగ్రా పట్టణం మా పల్లె నుండి దక్షిణంగా 12 మైళ్ళ దూరంలో ఉన్నది. ఏప్రిల్ 5వ తేదీ రాత్రి ఇంటి నుండి బయటకు వచ్చి ముందర ఉత్తరంగా, పడమరగా రాత్రంతా 40 మైళ్ళు నడిచి నడిచి ఇంటిలోని వారికి చిక్కకుండా చుట్టూ తిరిగి వెళ్ళాను.

బహిర్భూమికి వెళ్ళాలనే వంకతో బయటపడి, కాంగ్రెస్ కేంప్‌లోకి వచ్చి చేరాను. కాంగ్రెస్ వారు నాకు ఒక చొక్కా, ధోవతి, చెప్పులు ఇచ్చి, మరొక ప్రదేశంలో పని చేయటానికి పంపించారు.

ఇది యుగ పరివర్తనకు చెందిన విషమ సమయం. ప్రస్తుత కాలంలో విజ్ఞానపరమైన అభివృద్ధితోపాటు, నాగరికత కూడా అత్యంత వేగంగా మారిపోతున్నది. క్వాలిటీ పరంగా చూస్తే మనిషి సోమరి అవుతున్నాడు. ఒకరి పట్ల ఒకరికి అనుమానం, అవిశ్వాసం, ద్వేషాలనుకొని ఉన్న వాతావరణంలో అందరూ జీవిస్తున్నారు. సంతానోత్పత్తి పరమైన నియంత్రణ లేకపోవటం వల్ల జనసంఖ్య పెరిగిపోతూ ఉన్నది. రావణుడు ప్రజలను హింసించినప్పుడే దేవీ దేవతలతో పాటు రాముడు ఈ భూమిపైన అవతరించారు. తరువాత శ్రీకృష్ణుడు, బుద్ధుడు, గాంధీ మొదలైన మహనీయులెందరో ఏతెంచారు. ఇప్పుడు కూడా అలాంటి ప్రత్యేక సమయం వచ్చింది. మనం నర పశువుల వలె జీవించకుండా, జీవితాన్ని ధన్యం చేసుకునే విషయమై ఆలోచించాలి. ఎంతో విలువైన పనులకు సమయాన్ని వెచ్చించాలి. నిజమైన ఆధ్యాత్మికతను జీవితంలోకి దింపుకొనవలెను. ఇందుకుగాను కొన్ని పంచశీలమును ఆచరించుట అవసరం.

(సశేషం)

– అఖండజ్యోతి, అక్టోబరు 2009

అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి

## పరిపూర్ణ ప్రయత్నంతో యశస్సు

*లోటుపాట్లు, కష్టాలు కలిగితే బాధపడతారు. కాని అవే అనేక పర్యాయాలు మనిషిలో అణగారిన పౌరుషాన్ని మేలుకొల్పడానికి సహాయపడతాయి.*

*నెపోలియన్ చాలా పొట్టివాడు. పేద కుటుంబంలో పుట్టినవాడు. ఈ రెండు కారణాల వల్ల అతని బాల్యం అవమానాలతో, తిరస్కారాలతో గడిచింది. ఈ పరిస్థితులపై ఆయన చేసిన తిరుగుబాటు ఎన్ని యుద్ధాలను గెలిపించిందో! ఒక రాజు కుమార్తెను వివాహమాడిన తరువాత పొట్టివాడిననే ఆత్మ న్యూనతా భావం పోయి మనస్సుకు శాంతి లభించింది.*

*ఒకప్పటి బ్రిటిష్ ప్రధానమంత్రి చర్చిల్ నత్తిగా మాట్లాడేవాడు. వాక్కు మీద అధికారాన్ని, ఉచ్చారణలో పొందికను సంపాదించుకోవడానికి విపరీతంగా కృషి చేసి మహావక్తగా పేరుగాంచాడు. అమెరికా రాష్ట్రపతి రూజ్‌వెల్ట్‌కు ఒక కన్ను సరిగా లేదు. దానివలన పొందిన అవమానాన్ని విజయంగా మార్చుకోవడానికి ఆయన తుపాకి పేల్చడంలో నైపుణ్యాన్ని సాధించాడు. ఆయన పెట్టిన గురి తప్పడానికి వీలులేదని పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు. లార్డ్ బైరన్ కుంటివాడు. తన మిత్రులు పర్వతారోహణం చేయడం చూచి ఆయన వ్యధ చెందాడు. ఏదో విధంగా కీర్తివంతుడుగా జీవించాలని సంకల్పించుకున్నాడు. వేదాంత శాస్త్రాన్ని కార్యక్షేత్రంగా ఎంచుకుని విశ్వ విఖ్యాతి చెందిన వేదాంతిగా పేరుగాంచాడు.*

*పేరు ప్రఖ్యాతులు పొందటానికి అన్ని సదుపాయాలు, సౌకర్యాలు అవసరం లేదు. పరిపూర్ణ ప్రయత్నంతోనే యశస్సు లభిస్తుంది.* – *ప్రజ్ఞా పురాణం నుండి*

**ఇతరులను మంచి చేసుకోవాలనుకుంటే అందరితో మంచిగా ఉండాలి.**

మనం - మన ఆరోగ్యం

# మొలకెత్తిన గింజలలో అద్భుత ఆహార విలువలు

జీవితానికి ఆహారం అత్యంత అవసరం. ఆహారంలో ప్రాణశక్తి లేకపోతే శరీరానికి బలం, చైతన్యం కలుగవు. కనుక– ఆహారం ప్రాణవంతంగా ఉండాలి. సంస్కారవంతంగా ఉండాలి. శరీరాన్ని క్షాళన చేయాలి. నవ నిర్మాణం జరపాలి. మొలకెత్తిన గింజలు ఈ అవసరాలను అద్భుతంగా తీర్చుతాయి.

ప్రకృతి సిద్ధమైన ఆహారం పోషణ ఇవ్వడంలో ఉత్తమమైనది. అది ఔషధుల పాత్ర కూడా నిర్వహిస్తుంది. మొలకెత్తిన గింజలు ఈ విషయంలో ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. గింజలు మొలకెత్తినపుడు కొత్త గుణాలు ఏర్పడతాయి. విటమిన్‌లు, ఖనిజ లవణాలు, ప్రొటీన్‌లు, కార్బోహైడ్రేట్‌లు భారీయెత్తున ఉత్పత్తి అవుతాయి. వీటిని తీసుకోవడంవల్ల వనస్పతి ఔషధాలు తీసుకోవడం వల్ల కలిగే విధంగా రక్తశుద్ధి, ధాతువులశుద్ధి జరుగుతుంది. మొలకెత్తడంతో కొత్త రసాయనాలు వచ్చి చేరతాయి. కనుక, మొలకెత్తిన గింజలను తినడం వల్ల జీవశక్తి పెరుగుతుంది. ఆయుష్షు పెరుగుతుంది. కాయకల్ప చికిత్సవల్ల కలిగే ఫలితాలు లభిస్తాయి. మొలకెత్తిన గింజలు ప్రకృతి సిద్ధమైనవి కనుక, వాటిలో ఉన్న ప్రొటీన్‌లను, విటమిన్‌లను, కార్బోహైడ్రేట్‌లను ప్రేగులు తేలికగా పీల్చుకుంటాయి. అవి రక్తంగా, శక్తిగా త్వరగా మారుతాయి.

దాదాపు అన్ని రకాల గింజలనూ మొలకెత్తించి ఆహారంగా వాడవచ్చు. గోధుమలు, శెనగలు, వేరుశెనగలు, పెసలు మొదలగు గింజలు మొలకెత్తిన తర్వాత మరింత రుచికరంగా ఉంటాయి. మరింతగా పోషణ ఇస్తాయి. మరింతగా అరుగుతాయి. ప్రేగులు బలహీనంగా ఉన్న వ్యక్తులు మొలకెత్తిన గింజలను కొంచెం ఉడికించుకొని, తీసుకోవచ్చు. మంచి జీర్ణశక్తి కలిగినవారికి, వ్యాయామం చేసేవారికి మొలకెత్తిన శెనగలు, వేరుశెనగలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

స్వచ్ఛమైన గింజలను నీళ్లలో నానబెట్టి సుమారు 12 గంటల తర్వాత నూలు బట్టలో కట్టి ఉంచితే, అవి మొలకెత్తి తినడానికి అనువుగా ఉంటాయి.

మొలకెత్తిన గోధుమలు చాలా ఉపయోగకరంగా ఉంటాయని పరిశోధనలవల్ల స్పష్టమయింది. అవి సంపూర్ణ ఆహారమని ప్రఖ్యాత ఆహార నిపుణుడు డా॥ థామస్ పేర్కొన్నారు. అన్ని వయసులవారికి అది మంచి టానిక్‌గా పనిచేస్తుందని ఆయన ప్రకటించారు. పెరిగిన మొలకలను నమలడంవల్ల రిబోఫ్లైవిన్, థైమిన్, నికోటినిక్ యాసిడ్, కాల్షియం మున్నగు పోషకతత్వాలు బాగా లభ్యమవుతాయి. ఆకుకూరలలో, పాలలో ఆరోగ్యాన్ని పెంచే, రక్తాన్ని శుద్ధిచేసే గుణం ఉంది. తాజా మొలకలలో క్లోరోఫిల్ హెచ్చుగా ఉంటుంది. పండ్లలో కన్నా, కూరగాయలలో కన్నా వీటిలో 21 రెట్లు పోషక శక్తి ఉంది. పెరిగిన గోధుమ మొలకలను తినడంవల్ల గుండె గట్టి పడుతుంది. దాని శక్తి పెరుగుతుంది. రక్త ప్రసరణ ప్రక్రియలో సమతూకం ఏర్పడుతుంది. రక్తహీనత, అల్సర్ వంటి రోగాలకు ఇది అద్భుతమైన మందు. గర్భాశయం, జీర్ణక్రియ, చర్మరోగాలు దీనివల్ల నయమవుతాయి. ప్రఖ్యాత పత్రిక 'ది అమెరికన్ జర్నల్ ఆఫ్ సర్జరీ' ప్రచురించిన పరిశోధనా వ్యాసంలో పై విషయాలు ఉన్నాయి.

మొలకెత్తిన గింజలు సంపూర్ణ ఆహారం. వాటితో కడుపు నిండుతుంది, చికిత్స జరుగుతుంది. పాశ్చాత్య వైద్య శాస్త్రానికి మూలపురుషుడు హిప్పోక్రెటీస్ పై విషయం తెలిపారు. ప్రసిద్ధ అమెరికన్ వైద్య నిపుణులు డా॥ ఎన్. నిగ్మోర్ ఈ విషయంపై విస్తృత పరిశోధనలు జరిపారు. వాటి ఫలితాలను 'హవాఈ సఫర్', 'ది ఆన్సర్', 'వీట్ గ్రాస్ మెన్నా' అనే గ్రంథాలలో ప్రచురించారు. చిన్న చిన్న గోధుమ మొక్కలతో ఆమె అనేక రోగాలకు చికిత్స చేశారు. ఆ మొక్కను 'గ్రీన్ బ్లడ్' (పచ్చ రక్తం) అని వర్ణించారు.

ప్రతి విత్తనంలో పోషకతత్వం కేంద్రీకృతమై ఉంటుంది. నీరు, గాలి తగిన వేడి తీసుకుని విత్తనం మేలుకొంటుంది. అంతవరకు అది నిద్రాణమై ఉంటుంది. నిద్రా స్థితిలో దానిలో ప్రాణతత్వం తక్కువగా ఉంది. మేలుకొనగానే దానిలోని ప్రాణతత్వం అత్యధికం అవుతుంది. కనుకనే, మొలకెత్తిన గింజలలో ప్రాణతత్వం హెచ్చుగా ఉంటుంది. గింజలను వేయిస్తే, పిండిచేస్తే వాటిలోని పోషక తత్వాలు తగ్గిపోతాయి. కనుక వాటిని హెచ్చు మోతాదులో తినవలసి వస్తుంది. మొలకెత్తిన గింజలు కొద్దిగా తిన్నప్పటికీ పోషకతత్వాలు అధికంగా లభిస్తాయి. ఇందువల్ల ఆహారం పొదుపు అవుతుంది. కొద్ది ఆహారం హెచ్చుమందికి సరిపోతుంది.

చెట్టున పండిన పండ్లు మనిషికి ఉత్తమ ఆహారం. మొలకెత్తిన గింజలు వాటి తర్వాత ఉత్తమ ఆహారం. ఇవి పేదలూ, ధనికులూ అందరికీ అందుబాటులో ఉన్నవి. మనం ఈ గింజల ప్రయోజనాన్ని గుర్తించాలి. వీటి రుచిని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి.

★★★

**ఉత్సాహం పొంగిపొరలేదే నిజమైన జీవితం.**

సాధన విజ్ఞానం

# ఉపాసనలో ఏకాగ్రతను సాధించడం ఎలా?

## భగవానునితో బాంధవ్యం

ఉపాసనా విధానంలో జపం, పూజ, అర్చన, స్తోత్రం, ధ్యానం మొదలైనవి చేస్తున్నప్పుడు మన ఇష్టదైవం మనకు అతిదగ్గర బంధువు, మిత్రుడు, మనకుటుంబంలోనివాడూ, అత్యంత ఆత్మీయుడు అన్న అనుభూతి కలగాలి. లోకంలో అనేక రకాల బంధుత్వాలున్నాయి. వాటిలో ఏదో ఒక బంధుత్వాన్ని ఏర్పరచుకోవాలి. తల్లి, తండ్రి, గురువు, బంధువు, మిత్రుడు, భర్త ఇటువంటి సంబంధాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అప్పుడప్పుడు పుత్రుడు, భార్య మొదలైన సంబంధాలను కూడ ఏర్పరచుకోవచ్చు. కౌసల్య, దేవకి, యశోద, సూరదాసు వీరందరు బాలగోవిందుని ఇష్టదైవమనుకున్నారు. పారసీభాషలో సూఫీకవులు భక్తిధారలో భగవంతుని తమ ప్రేయసిగా చిత్రీకరించారు. ఉమర్ ఖయ్యామ్ కవితలో మధుశాలలోని అర్థాన్ని ఆధ్యాత్మికంగా తీసుకున్నారు. భక్తిని మద్యంగానూ, ఈశ్వరుని మద్యాన్ని అందరికీ త్రాగించే 'సాకీ'గానూ చిత్రించడం జరిగింది. ఇటువంటి భావనలు చాలా కఠినమైనవి. అన్నిటికంటే సులభమైంది భగవంతునితో మనకంటె పెద్దగా ఉన్న బంధుత్వాన్ని తీసుకోవడం. తల్లిగా భావించే సంబంధం అన్నింటిలోనూ సులభమైందీ, భావపూర్ణమైందీ.

## తల్లిగా భావించడం తేలిక

గాయత్రి ఉపసానలో కూడా ఈశ్వరుని తల్లిగా భావించడమే జరిగింది. పిల్లవాడికి తల్లి యందుండే ప్రేమ చాలా సరళమైనదీ, సహజమైనదీ. మనుష్యులేకాక పశువులు, పక్షులూ, కీటకాలు కూడా తమ పిల్లల్ని ఎంతగానో ప్రేమిస్తాయి. వాటిల్లో శిశు సంరక్షణ బాధ్యత తల్లిదే. తల్లితప్ప మిగిలిన ఏ బాంధవ్యాన్ని తీసుకున్నా వాటిలో గుణ దోషాలుంటాయి. కానీ తల్లిప్రేమ అన్నింటి కన్నా గొప్పది, నిస్వార్థమైనది. ఇది త్యాగ, బలిదానాలతో నిండి ఉంటుంది. **"కుపుత్రో జాయేత్ క్వచితపి, కుమాతా న భవతి"** చెడ్డపుత్రులు ఉండవచ్చు కానీ, చెడ్డతల్లి మాత్రం ఉండదు. ఈ మాట ఆధారంగా తల్లితో ఉన్న బంధుత్వం ప్రపంచంలో శ్రేష్ఠమైన ప్రేమకు ప్రతీకగా చెప్పబడుతోంది. కనుక ఈశ్వరునిలో తల్లిని ప్రతిష్ఠించుకోవడమే శ్రేయస్కరం. తల్లిగా భావించినపుడు ఈశ్వరుడు అనంతమైన ప్రేమ వాత్సల్యాల వర్షం తన పిల్లలపై కురిపిస్తే, ఆ ప్రేమ పరంపర అత్యంత ఆనందదాయకం అవుతుంది. భావనాత్మకంగా ఇచ్చిపుచ్చుకోవడానికి ఈ విధమైన ప్రతిష్ఠ ఆవశ్యకం.

## దేవుడికి లంచం ఇవ్వడమా?

తర్వాత మన ఇష్టదైవం సర్వవ్యాపకుడని, న్యాయాధీశుడని, ప్రతిచోటా అణువణువునా నిండి ఉన్నాడని అనుభూతి కలగాలి. మన లోపలా బయటా, రోమరోమాల్లో ఆయన శక్తి ప్రవహిస్తున్నది. ఆయన లేని స్థలం ఆవగింజంత కూడా లేదు. జడ, చేతన పదార్థాలలో, ఈ ప్రకృతి అంతటా ఆ ప్రకాశం మిరుమిట్లు గొల్పుతోంది. అంతటా ఆయన అనుభూతి మనకు కలుగుతోంది. ఈశ్వరుడు తన సహస్రనేత్రాలతో మన అంతరంగాల్లో అతి సూక్ష్మమైనదాన్ని కూడా చూస్తున్నాడు. మనం చేసే ఏ పనిగాని, ఏ భావంగాని, ఏ ఆలోచనగాని ఆయనకు తెలియకుండా ఉండవు.

సర్వవ్యాపకమైన ఈ శక్తికి ఏ విధమైన పక్షపాతమూ లేదు. ఆయన పరిపూర్ణ న్యాయశీలుడు. నిష్పాక్షపాతియైన న్యాయాధికారి. చేసిన కర్మలే ఆయన దృష్టిలో మంచి చెడులను నిర్ణయించే గీటురాళ్లు, సత్కర్మలు, సద్భావనలు, సదాలోచనలు ఆయనకు ప్రియమైనవి. న్యాయాన్ని తూచే త్రాసులు ఇవే. ఈ కర్మలే కొందరిని ఇష్టులుగా, మరికొందరిని అయిష్టులుగా చేస్తాయి. నిర్ధారిత ధర్మమర్యాదలను పాటించనివారు ఈశ్వరునికి నచ్చరు. ధర్మ, కర్తవ్యపాలన చేసేవారు ప్రియాతి ప్రియమైన బిడ్డలు. నిజాయితీపరుడైన ఒక న్యాయాధికారి పాప పుణ్యాల నెరిగి శిక్ష విధిస్తాడు. అతనిలో రాగ ద్వేషాలుండవు. నిందలు, పొగడ్తలు అతనిని ప్రభావితం చేయలేవు. అలాగే ఈశ్వరుడు కూడా నైవేద్యం, పూలమాలలు, హారతి, తాంబూలం, సుగంధద్రవ్యాలలాంటివి సమర్పించారని అనుచితమైన కోర్కెలు తీర్చడు. పొగడ్తలూ, లంచాలతో పనులు నెరవేర్చుకోవాలని రకరకాల ఆశల్ని పెట్టుకోవడం ఆ మహత్తరశక్తిని కించపరచే అసహ్యకరమైన చేష్ట.

## సదాచారమే భక్తి

ఈశ్వరుని ఉనికిని, అతని ఇష్టాన్ని, కార్యపద్ధతిని, ప్రేమను

ఎవరితోనూ వాదించవద్దు.

బాగా తెలిసికొన్నట్లైతే మన ఉపాసన ఎంతో ప్రేరణాత్మకంగా, ప్రకాశవంతంగా ఉంటుంది. మన సమీపంలో, లోపలా, బయటా అంతటా ఈశ్వరుని అనుభవిస్తూ ఆలోచనలనూ, కార్యపద్ధతిని బాగుపరచుకోవడం తప్పనిసరి – అని తెలుసుకుంటాము. అప్పుడు ఈశ్వరునికి అప్రియమైన పనులు, ఆయనకు నచ్చని పనులు చేయము. పోలీసు సమక్షంలో ఒక దొంగ, ఆఫీసరు సమక్షంలో ఒక అవినీతిపరుడూ తావెక్కడ పట్టుబడతావోనని భయపడతారు. అలాంటప్పుడు సర్వత్రా వ్యాపించిన నిష్పక్షపాతి ఐన ఒక న్యాయాధికారి మనల్ని గమనిస్తున్నాడంటే అతను దండిస్తాడనీ, కోపగిస్తాడనీ నిరంతరం భయం కలుగుతుంది. వ్యక్తులు ఎటువంటి దుర్భావనలూ, దుష్కర్మలూ చేయలేరు.

నిజమైన ఆస్తికత వ్యక్తిని నిర్మలునిగా, పాపరహితునిగా చేస్తుంది. పాప పంకిలంలో చిక్కుకున్న వ్యక్తి ఎన్ని భజనలు చేస్తూ ఎంత ఆడంబరంగా కన్పించినా – అతడు నాస్తికుడే. ఆస్తికత, దుష్టత్వం ఒకేచోట ఉండడం అసంభవం. ఈశ్వరునికీ, పాపకర్మలకూ భయపడేవారు ఇంకెవరికీ భయపడరు. ఉపాసనా క్రియలు సరిగా తెలియనప్పటికీ, ఎవరైతే సదాచార ప్రియులో, సదాశయులో, సన్మార్గంలో నడుస్తారో వారే భగవంతునికి నిజమైన భక్తులు.

## ఆత్మపరీక్ష అనివార్యం

సర్వవ్యాపియైన భగవంతుడు మనం చేసే ప్రతి పనిని వేయి కళ్ళతో గమనిస్తున్నాడనీ, మంచి కర్మలకు చెడు కర్మలకు ఉచితమైన పురస్కారాన్నిగాని, శిక్షనుగాని నిర్ధారిస్తున్నాడన్న భావం ఉపాసకుని మనస్సులో దృఢంగా ఉండాలి. ఈ వాస్తవాన్ని హృదయంగమం చేసుకున్నప్పుడు మన స్వభావాన్నీ, చరిత్రనూ శోధించుకోవలసి అవసరమేర్పడుతుంది. పొరపాట్లను సరిదిద్దుకోవాలి. ఈ సాహసాన్ని చేస్తూ పోతే మన అంతఃకరణ నిర్మలమై, మన వ్యవహారాలు పాపరహితములౌతాయి. భగవంతునితో నిజమైన స్నేహమేర్పడే మార్గం సుగమమౌతుంది. దొంగ తన అపరాధ మనస్తత్వాన్ని కలిగి ఉన్నంతకాలం పోలీసులకూ, జైలుకూ, కోర్టుకూ భయపడుతూ ఉంటాడు. తన ఆచరణ సరిచేసుకున్నాక నిర్భయుడౌతాడు. అతనికి శత్రువులంటూ ఉండరు. అధికారులు కూడా అతడిని గౌరవిస్తారు. ఈశ్వరుని స్నేహాన్ని పొందాలంటే మొట్టమొదటిది నిర్మలంగా, పాపరహితంగా ఉండడం, ఇంతకంటే తక్కువ ప్రయత్నానికి భగవంతుడు మనకు లభ్యం కాడు.

ఉపాసకునిగా అర్హత పొందాలంటే ఉపాసకుడు తన జీవితాన్ని పరిశోధించుకోవడం వెంటనే ప్రారంభించాలి. మాలిన్యాన్ని పోగొట్టుకొని ఉన్నతమైన వాటిని జీవితంలో అలవరచుకోవాలి. ఈ స్థితి ఎంత దృఢమైతే ఈశ్వరుడు అంత సన్నిహిత మిత్రుడౌతాడు. భయం, సంకోచం, ఈసడించుకోవడం, నీచత్వం ఉన్న వ్యక్తి మనస్సు విప్పి ప్రేమించే సాహసం చేయలేడు. మనస్సు పవిత్రంగా ఉంటేనే అది సాధ్యమవుతుంది.

## నిర్మలత్వం ద్వారా నిర్భయత్వం

నిర్మలమైన మనస్సుతో, శుద్ధ ఆచరణతో ప్రారంభింపబడిన ఆధ్యాత్మిక ప్రగతి పరిణామం పరిపూర్ణంగానూ, నిర్భయత్వంతో కూడినదిగా ఉంటుంది. భగవంతుడెప్పుడూ మనకు తోడుగా ఉన్నట్లు అనుభవం కలుగుతుంది. ఒక అంగరక్షకుడుగా, ఒక సహచరుడుగా అతడు మన వెంటవెంటనే నడుస్తున్న భావన కలుగుతుంది. వెంట ఈశ్వరుడుండగా భయమెందుకు?

భగవంతునిపై అచంచల విశ్వాసమున్నవారికి కొద్ది సాధనములతోనే పెద్ద పెద్ద ప్రణాళికలు వేసికొని కార్యాన్వితం చేయడం సాధ్యమవుతుంది. సత్కర్మలకు భగవంతుని సహాయం ఎప్పుడూ ఉంటుంది. కర్తవ్య పథంలో నడవడానికి పరమార్థ పరాయణత్వానికి ప్రతిఫలం లభిస్తుంది. ఈ విషయంలో చరిత్రపుటల్లో ఎన్నో ఉదాహరణలు, లెక్కలేనన్ని ప్రమాణాలు మనకు కన్పిస్తాయి. నిరుపేద కుటుంబంలో పుట్టి, సదుపాయాలు కానీ, సహచరుల సహకారంగానీ లేకపోయినప్పటికీ పరమార్థ పథంలో పయనించినవారు ఎన్నో గొప్ప కార్యాలు చేయగలిగారు. సదుద్దేశ్యంతో చేసే సత్ప్రయత్నాలకు భగవంతుని సహాయం ఎప్పుడూ ఉంటుంది. తాను వ్యక్తిత్వాన్ని ఈశ్వర ప్రేమకు యోగ్యంగా చేసికొని ప్రయత్నిస్తే ఇది సత్యమని అవగతమౌతుంది.

## ఏకాగ్రతకు దారి ఇదే

ఈ విశిష్టతలు కలిగిన ఉపాసకుడు భగవంతుని సమీపంలోని ఆనందాన్ని పొందగలడు కేవలం ప్రేమభావం నింపుకోవడమే తరువాయి. భగవంతుని తల్లి, తండ్రి, గురువు, స్నేహితుడు అనే రూపంలో చూడగలిగితే ఆ భావన సుఖాన్ని ఇస్తుంది. ఆ ప్రేమ అనంతం. ఇక మనస్సెక్కడికీ పరిగెత్తదు. అతడు ధ్యానంలో ఎక్కువకాలం గడపగలడు. మనస్సుని వశపరచుకుని చిత్తాన్ని ఏకాగ్రం చేయడానికి వేరే దారిలేదు.

– *అనువాదం : కె. అరవిందమ్మ*

**కష్టాలు భగవంతుడు మనిషికి ఇచ్చే పరీక్షలు.**

జీవించే కళ

# నవ్వు నాలుగు విధాల మేలు

**హాస్యచికిత్స :** ప్రముఖ వైద్య నిపుణుడు డా॥ శామ్సన్ వద్దకు ఒక రోగిని తీసుకువచ్చారు. అతడి పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉంది. కుటుంబ సభ్యులు అతడిపై ఆశలు వదులుకున్నారు. వైద్యం చేసేముందు ఆ డాక్టరు రోగితో సంభాషణ మొదలుపెట్టాడు. ఎంతో ఆత్మీయతతో, చిరునవ్వులు చిందిస్తూ ఆయన మాట్లాడుతూ ఉండడంతో, రోగి ముఖంలో కూడా చిరునవ్వు తొంగిచూచింది. "మీరు గాబరాపడవలసిన అవసరం లేదు. రోగికి జబ్బు నయమవుతుంది. ఎందుకంటే ఇతనికి నవ్వే సామర్థ్యం ఇంకా మిగిలి ఉంది' – అని డాక్టరు రోగితో వచ్చిన వారికి ధైర్యం చెప్పాడు. కొద్ది కాలం చికిత్స తర్వాత ఆ రోగి జబ్బు నయమయింది. రోగికి మందు మాకులు ఇవ్వడం, చికిత్స చేయడంకన్నా అతడికి ఉల్లాసం కలిగించడం, అతడు నవ్వుతూ తుళ్లుతూ ఉండడం, చిరునవ్వుతో కబుర్లు చెప్పడం మరింత ముఖ్యమైనవి డా॥ శామ్సన్ నమ్మకం. నవ్వు మందులకన్నా మిన్నగా పనిచేసిందని ఋజువయింది.

**నవ్వులో యవ్వనం :** తత్వవేత్త బైరన్ ఇలా వ్రాశాడు – నవ్వు యౌవనంలోని ఆనందరేఖ, యౌవన సౌందర్యం. యౌవన శృంగారం. ఈ సౌందర్యాన్నీ, శృంగారాన్నీ అనుభవించని వ్యక్తికి యౌవనం నిలచి ఉండదు.

స్టర్న్ ఇలా వ్రాశాడు – వ్యక్తి నవ్వినప్పుడల్లా, దానితోపాటు తన ఆయుష్షును పెంచుకుంటున్నాడని నా నమ్మకం. విరగడబడి నవ్వడంవల్ల, ఎప్పుడూ ఉల్లాసంగా సంతోషంగా ఉండడంవల్ల మనిషి శరీరంలోని జీర్ణక్రియ మెరుగుపడుతుందనీ, రక్త కణాలు వృద్ధిపొందుతాయనీ, నాడీ వ్యవస్థలో తాజాదనం వస్తుందనీ, ఆరోగ్యం పెరుగుతుందనీ డా॥ విలియం తన ప్రయోగాలు ఆధారంగా ఋజువు చేశాడు.

**నవ్వు జీవన సౌరభం :** గలగలా నవ్వడం, హాస్య వినోదాలు, చిరునవ్వులు చిందించడం – ఇవి మనిషి ఆరోగ్యాన్ని చక్కబరచే అద్భుత ఔషధాలు. నవ్వు జీవన సౌరభం. జాజి మొగ్గ సహజంగా విచ్చుకున్నప్పుడు దాని అందం చూడముచ్చటగా, మనోహరంగా వెలిగిపోతుంది. దర్శకుని మనస్సు దానిపట్ల ఆకర్షితం అవుతుంది. జీవితంలోని ఉపద్రవాలలో, పెనుతుఫానులలో చిక్కుకున్న మనిషికి ఆ దృశ్యం కొద్ది క్షణాల పాటు కొత్త జీవాన్ని, జవాన్ని ఇస్తుంది. పసిపాపలా చిరునవ్వు నవ్వడము, హాస్య వినోదాలు చూచినపుడు నిరాశతో నీరసించిన వ్యక్తులలో కూడా కొత్త ఆశలు చిగురిస్తాయి. సహచరుల హాస్యవినోదాల గలగలల మధ్య మనిషి తన దుఃఖాన్ని, విషాదాన్నీ మరచిపోతాడు.

**సంత్ ఎమర్సన్ భావన :** ప్రముఖ తత్వవేత్త ఎమర్సన్ ఇలా అన్నారు. వాస్తవానికి హాస్యంతో నవ్వించే వ్యక్తి, మానవ పథంలోని ముళ్లను, కలుపును ఏరివేసి, సద్గుణాలతో గుబాళించే మొక్కను నాటి, మన జీవన యాత్రను ఒక పర్వంగా, ఒక ఉత్సవంగా మార్చే రైతు. భయం, చింత మున్నగు మనోవికారాల వల్ల మనిషి శరీరంలో ఉత్పన్నమయ్యే విషాన్ని క్షాళన చేసేందుకు **హాస్యం ఒక అద్భుత ఔషధం** అని మనస్తత్వ శాస్త్ర నిపుణులు, శరీర శాస్త్ర నిపుణులు తమ ప్రయోగాలు, పరిశోధనలు, అనుభవాల ద్వారా రుజువు చేశారు.

**నవ్వు నాలుగు విధాల మేలు :** గలగలా నవ్వడం వల్ల మనిషి యొక్క శారీరక, మానసిక వ్యవస్థలలో ఉన్న ఒత్తిడి ఇట్టే మాయమౌతుంది. నవ్వడం వల్ల నరాలూ, కండరాలు ప్రత్యేకంగా ప్రభావితం అవుతాయి, క్రియాశీలకం అవుతాయి. జీర్ణ రసాన్ని సమృద్ధిగా విడుదల చేస్తాయి. ఊపిరితిత్తులలో రక్తప్రసరణ వేగంగా పెరుగుతుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాల వేగం కూడా పెరుగుతుంది. అందువల్ల శరీరం ప్రాణవాయువును మరింతగా స్వీకరిస్తుంది. రక్తశుద్ధి కూడా వేగంగా జరుగుతుంది. శరీరంలోని జీవనతత్వం క్రియాశీలం అవుతుంది. అందువల్ల ఆరోగ్యం మెరుగవుతుంది. జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలు, దిగుళ్లు, సమస్యలు విషాదాలు, మానసిక అసంతులనం మున్నగు అనేక చిక్కుముడులు హాస్య వినోదాల స్పర్శ తగలగానే మటుమాయం అయిపోతాయి. హాస్య ప్రధానుడైన వ్యక్తి జీవితంలోని పెద్ద పెద్ద ఇక్కట్లను, విషమ సమస్యలను చక్కగా ఎదుర్కోగలుగుతాడు. జీవన సంగ్రామంలో నవ్వుతూ విజయం సాధించగలుగుతాడు.

★★★

**కష్టాలను అధిగమించితే భగవంతుని పరీక్ష పాసు అయినట్టే.**

నావారితో నామాట

# ఇంటింటా దీపాలను వెలిగించాము-ఇప్పుడు మానవ నిర్మాణము జరగాలి

## ఐతిహాసిక వసంతము

వసంతపర్వంతోపాటుగా శతాబ్దీ సంవత్సర శుభారంభము జరిగింది. ఈ శతాబ్దము నేటికి 100 సంవత్సరములకు పూర్వము బ్రజక్షేత్రంలోని ఒక చిన్న గ్రామంలో వికసించి, పల్లవించిన ఆ వసంతకాలానిదే. 1911 సంవత్సరంలో ఆశ్వయుజ కృష్ణ త్రయోదశి పుణ్యవేళలో మన గురుదేవులు మానవ శరీరాన్ని ధరించారు. 'జన్మకర్మ చ మే దివ్యమ్' అనే కథనం ప్రతి దైవీ అవతారమునకు వర్తిస్తుంది. మహాకాలుని ప్రణాళిక అయితే గత కొంతకాలంనుండే పరివర్తనకు గతినివ్వటానికి వాతావరణమును సిద్ధపరుస్తున్నది. అదే మన గురుదేవుల జన్మదినంగా రూపుదిద్దుకున్నది. దీనికొరకు ఆయన 15 సంవత్సరముల వయస్సు వచ్చేవరకు ప్రతీక్షించవలసివచ్చింది. ఆయనకు గాయత్రీ మంత్రము బ్రాహ్మణత్వ చమత్కారముగా పరిణతిచెంది 1926 యొక్క వసంతకాలం ఆయనకు ఆయన సూక్ష్మశరీరధారి గురుసత్తాతో కలుసుకునే సుయోగాన్నిచ్చింది. ఆ వసంతపర్వమే ఐతిహాసికంగా నిలిచింది.

## నవయుగ మత్స్యావతారము

పరమపూజ్య గురుదేవులు మహాకాలుని ఏ ప్రణాళికను తమతో తీసుకొనివచ్చారో దాన్నే మహాప్రయాణము వరకు నిర్వహించారు. పొరపాటునైనా ఒక్క క్షణము కూడా మరిదేనికీ వెచ్చించలేదు. ప్రతిక్షణమునూ తమ గురుదేవుల నిర్దేశాలను పాటించే నిమిత్తమే నియోగించారు. వారు తమ గురువు ఆదేశాలమేరకు ఏ కార్యమునైతే ఆరంభించినారో అది ప్రత్యక్షంగా చూడటానికి చాలా చిన్నదిగా కనిపించినప్పటికి, అది మెల్లగా పెరుగుతూ పోయింది. గురుదేవులు తరువాతి కాలంలో 'నవయుగ మత్స్యావతారము' అనే పుస్తకమును రచించారు. బ్రహ్మదేవుని ప్రాత:కాల సంధ్యంలో ఒక చిన్న చేప ఆయన కమండలములోనికి ప్రవేశించి, తరువాత మెల్లమెల్లగా మత్స్యావతార రూపు ధరిస్తూ వచ్చింది' అన్న మత్స్యావతార కథను గురుదేవులు అందులో వ్రాశారు. యావత్రపంచములోని భూమ్యాకాశములనంతటిని అది ఆక్రమించినది. ఆ చేప వాస్తవానికి వేదజ్ఞానమును రక్షించుటకు వచ్చిన మహామత్స్యావతారము. పరమపూజ్య గురుదేవులు అందులో ఇలా వ్రాశారు. 'అణువునుండి మహత్తువరకు, సూక్ష్మము నుండి విశాలమగుటలో ఆశ్చర్యం కలిగించే సంఘటన జరిగినది తెలుస్తుంది కానీ ఆ ప్రయోజనము వెనుక దైవీసత్తా ఇచ్ఛా మరియు ప్రణాళిక పనిచేస్తున్నది, కనుక అది వేగంగా విస్తరిస్తుంది అన్నదానిలో ఎటువంటి అనుమానము ఉండబోదు. ఈ మత్స్యావతార కథ యుగనిర్మాణసంస్థ కథ. దీని శుభారంభము చిన్నగానే జరిగింది. అయితే అది విస్తృతమై ముందుకు సాగుతున్నది. పరిజనులు పంచ సహస్రకుండీ యజ్ఞములు, 1971లో మథుర వీడ్కోలు సమావేశము, దేశ ఐక్యతా సమ్మేళనము, దేవకన్యల ప్రాంతీయ కార్యక్రమాలు, శ్రద్ధాంజలి సమారోహము, దేవసంస్కృతి దిగ్విజయ 35 వ అశ్వమేధ యజ్ఞపురుషార్థము మరియు రెండు రెండు మహాపూర్ణాహుతులలో ఆ మత్స్యావతార దర్శనమయ్యింది.

## కాలం సందేశాన్ని తీసుకొచ్చింది

గురుదేవుల మహాప్రయాణం తరువాత ఆ సంస్థ మరింత విస్తృతరూపు ధరించినది. దేవసంస్కృతి విశ్వవిద్యాలయము మరియు దానితో జోడించబడిన 'దియా ఉద్యమము', సప్త క్రాంతులు మరియు ప్రాంతీయ కార్యక్రమాల విస్తరణ దానికి నిజంగా విరాట్ స్వరూపానిచ్చాయి. ఈ శతాబ్దీ సంవత్సర సమయం మనందరకు కొన్ని మహత్వపూర్ణమైన సందేశాలను తీసుకుని వచ్చింది. పరిజనులందరికి కొన్ని గొప్ప కర్తవ్యాలను అందించింది. ఈ సంవత్సరమంతా చాలా పెద్దఎత్తున కార్యక్రమాలు జరుగుతాయి. దేశమంతట మరియు విశ్వమంతా గురుదేవుల జన్మశతాబ్దీ పర్వమును జరుపుకుంటున్నది. అయితే మనమందరము గురుదేవుల నిజస్వరూపమును సరియైన రీతిలో హృదయంగమము చేసుకుని, ఆయన ఆలోచనలను ఆచరించ గలుగుతున్నామా? అన్న విషయమును గూర్చి ఆలోచించాలి. ఒకరోజున గాయత్రీ తీర్థము, శాంతికుంజ్ యొక్క క్రొత్త లెటర్‌ప్యాడ్ ముద్రితమై వచ్చింది అన్న విషయము మాకు గుర్తుంది. దానిమీద గురుదేవులు పైన "21వ శతాబ్దము – ఉజ్జ్వల భవిష్యత్తు" అని, క్రిందిన 'కేంద్రము శాంతికుంజ్, హరిద్వార్' అని వ్రాశారు. లెటర్‌ప్యాడ్‌లో ఎందుకు మార్పుచేశారు అని ప్రశ్నించాము. గురుదేవులు ఇలా అన్నారు "యుగం మారుతున్నది. 21వ శతాబ్దము ఉజ్జ్వల భవిష్యత్తును తీసుకొస్తున్నది అన్న విషయమును మా గురుదేవులు నాతో అన్నారు. నేను దాన్ని గొంతు చించుకుని చెప్తున్నాను. మీరు కూడా నాతోపాటు యుగప్రభాతమును

కష్టాలలోనే కటిక నిజాలు తెలుస్తాయి.

ఎలుగెత్తిచాటండి" నిజంగానే కాలము మారుతున్నది. మీకది దర్శనమిస్తుంది. ఆ విషయమును చెప్పటానికే ఈ లెటర్‌ప్యాడ్ ఈవిధంగా ముద్రించబడినది. విషయము అర్థమైనదా? గురుదేవులు ఇంకా ఇలా అన్నారు. 'మేము ఏమి చెయ్యవలెనో అది, స్థూలశరీరంతో జరుగవల్సినది మేము నిర్వహించినాము. కానీ భవిష్యత్తు కార్యక్రమము మీరు శ్రమించి చేయవల్సి ఉంటుంది. సూక్ష్మజగత్తు నుండి మేము శక్తిని ప్రసాదిస్తాము. అది స్థూలశరీరముతో సంభవము కాదు. తరువాతి భూమిక మరింత విలక్షణమౌతున్నది. నవయుగాన్ని మీ అందరూ తీసుకొనిరావాలి.

## ఇప్పటివరకు అభియానము ప్రచారాత్మకంగా సాగింది

తపస్సు మరియు విద్య మనకు వారసత్వంగా మన గురుదేవుల నుండి సంస్కారరూపంలో లభించినది అని మనం గుర్తుంచుకోవాలి. అవి మనకు విశిష్ట కార్యములను నిర్దేశించాయి. ఇప్పుడిక ఆ పనులను చేయుటలో పూర్తి శక్తిని వినియోగించాలి. ఇప్పటివరకు మనం ప్రచారాత్మక కార్యక్రమాలలో నిమగ్నమైనాము. మనం గాయత్రీ సాధన చేయించాము, యజ్ఞాలు నిర్వహించాము. జనులకు మనం ఆవిధంగానే పరిచితులమే. విచారక్రాంతి (ఆలోచనలో క్రాంతి) – సప్త విప్లవ కార్యక్రమాలను చేయువారు ఇచ్ఛాపూర్వకంగా, సంతోషంతో ఆ పనిని నిర్వహించుటకు ముందడుగు వేయుటలేదు. గొప్ప మహాయజ్ఞాలు జరిగినాయి. గ్రామ-గ్రామము, ఇంటింటిలో అందరూ యజ్ఞసంస్కారమును చేయించగలరు. యుగసంగీతం పాడగలరు, నేర్పగలరు. ప్రజ్ఞాపురాణ కథా ప్రవచనమును ఇవ్వగలరు, ఇప్పించగలరు. కానీ ఇది మన లక్ష్యము కాదు. ఇక్కడివరకు వచ్చి నిలిచిపోరాదు. యాత్ర ఇంకా పురోగమించాల్సివుంది. లక్ష్యమును రాబోయే 10 సంవత్సరాలలో పూర్తిచెయ్యవల్సివున్నది. దేశ నిర్మాణము కావిస్తున్న వర్గమును జాగృతము చేయుటనే లక్ష్యము నెరవేరింది. వారు జాగృతమైనారు కనుక ఇప్పుడిక ఆవిధమైన ప్రచార ఆవశ్యకత లేదు. ప్రస్తుతం నిజమైన అర్థంలో గురుసత్తా చెప్పినవిధంగా జీవించేవారి సంఖ్యను వృద్ధిపరచవల్సిన అవసరమున్నది.

## ఒక విలక్షణ ప్రయోగము

2011 వసంతపర్వము రోజున మనం ఇంటింటా దీపాలను వెలిగించాము. ఒక విలక్షణమైన ప్రయోగము సంపూర్ణమైనది. ఫిబ్రవరి 6, 7, 8 తేదీలలో ప్రతి వ్యక్తీ మరో పదిమంది నూతన పరిజనులతో కలుపుకుని విజయవంతంగా ఐదు ఐదు దీపాలను ప్రజ్వలింపజేసినారు. సామూహిక చేతనా జాగరణ-సూక్ష్మమును తపింపజేయుట అనే ఒక విలక్షణ కార్యక్రమం ఉంది, అది వసంతపర్వ సమయంలో జరగాలి. ఆదర్శవాదులు, క్రాంతికారీ ఆలోచనలు కలిగినవారు, జీవితంలో బ్రాహ్మణత్వమును అనుసరించే వ్యక్తులుకూడా అనేకమంది జన్మించాలి అనే సంకల్పము తీసుకోవాలి. ఈనాటి ఈ యాత్రలో మిగతావాటితో పోలిస్తే సాధనముల లోటు పెద్దగా లేదు. భ్రష్టాచారం, లేమి, విషమ పరిస్థితులతో దైవీచేతన తలపడుతున్నది. అదికూడా సమతాస్థితికి వస్తుంది. కానీ అన్నింటికీ మించిన పెద్ద ఆపద ఆదర్శంగా జీవించే మనుష్యులు ఎక్కడా లేరు. వీటన్నిటిని తలదన్నుతూ ఆదర్శముల క్షామము ఆవరించినది. చక్కని పౌరులే ఆదర్శములను జీవంతంగా ఉంచే శ్రద్ధాసంపద కలిగివుంటారు. ఈ శ్రద్ధాసంపద అంకురించాలి. అలాంటివారి హృదయం లోపల ఉన్న దీపం ప్రజ్వలించబడాలి. పరివర్తన ఇప్పుడు జరుగబోవుతున్నది కనుక మనం ఆమూలాగ్రము మారాలి అనే చైతన్య జాగృతి వారి అంతరంగంలో ఉదయించాలి. అటువంటి దీపాలు లక్షలు-కోట్లలో వెలిగినట్లయితే పరివర్తన నిజంగా జరుగుతున్నది. అంతేకాక అది వేగం అందుకున్నది అని తెలుస్తుంది.

## మనుష్యుల లోటే పెద్ద ఆపద

రాజకీయనాయకుల పార్టీల ప్రకటనాపత్రాలను తీసుకుని చదవండి. చాలా చక్కగా వ్రాయబడివుంటాయి. అందరిలోనూ ఆదర్శ సమాజ పరికల్పన ఉంది. కానీ వారు వాటిని అమలు పరచుట లేదు. సద్భావనలు గల అటువంటి మానవులు పలురకాల ప్రలోభాలు (పెద్ద పెద్ద ప్యాకేజీలు, జడ్ స్థాయి రక్షణ వ్యవస్థ, లోక్‌సభ సభ్యత్వము, మంత్రి పదవి, పలురకాల సౌకర్యాలు) ఎదురైనప్పటికి విచలితులుకాకుండా స్థిరంగా ఉంటారు. బ్రాహ్మణత్వమును జీవింపజేయండి. మీ ఆచరణతో శిక్షణ నిచ్చుట ఆరంభించండి. అటువంటి మానవుల ఉత్పాదన ఇప్పుడు 2011 తరువాత వేగంగా వృద్ధిచెందుతుంది. **మనం వీరందరి ఆలనాపాలనా చూసే అర్హతను పొందటానికి ముందుగా స్వ-నిర్మాణము చేసుకోవాల్సివుంది. ఈ దిశలో మనం కొంచెమైనా ప్రగతి సాధించామా? అన్న విషయమును ప్రతి ప్రజ్ఞాపరిజనుడు ఆలోచించాలి.** ఈ విశ్లేషణకు గల సమయం ఒక సంవత్సర కాలము. మనం చింతన చేయాలి, స్వయంగా సమర్థ ప్రాణవంతులుగా మారటానికి సాధన చెయ్యాలి. గురుసత్తా మన వెన్నంటి ఉంటుంది.

**మిత్రులను సంపాదించుకోవాలి.**

### మనం కూడా వారివలెనే తయారవ్వాలి

గురుదేవుల పట్ల జనుల దృఢవిశ్వాసమే యుగనిర్మాణ సంస్థ యొక్క సఫలతా రహస్యము. గురుదేవుల బ్రాహ్మణత్వమును ప్రత్యక్షంగా దర్శించారు. గురుదేవులు ఒక లోకసేవకునిలా ఆదర్శ జీవితమును జీవించారు. వ్యక్తిత్వము ఎలా ఉండాలి? అన్నదానికి లోకులకు ఆయన ఒక నమూనాగా నిలిచారు. మనం సంపూర్ణంగా కాకపోయినా కొంతమేరకైనా ఆయన వలె తయారగుటకు ప్రయత్నించాలి. వారికి పరిజనులు హృదయ పూర్వకంగా సమర్పించుకున్నారు. యుగనిర్మాణ మిషన్ ప్రతి కార్యక్రమము ఇటువంటి పరిజనులచేతనే నడుపబడుతున్నది. మనిషి మనిషి గురుదేవులను తమవారిగా భావించారు. ఇప్పుడు 2011 తరువాత మనం నూతన తరమును ఎలా నిర్మించాలి అన్నది చూడాలి. మనం ఏ భావనలను గురించి చెప్తున్నామో దానికి తగినట్లుగా మనల్ని మనము మలచుకుంటున్నామా? లేదా? అన్నది గమనించుకోవాలి. మనం చెప్తున్నది మనం ఆచరిస్తున్నామా? ఈ గీటురాయిమీద పరీక్షించుకుని మనం వికసించబడాలి. 2011 తరువాత వచ్చే గాయత్రి పరిజనుల ఆచరణ కూడా ఈవిధంగానే ఉండాలి.

హనుమాన్ ప్రసాద్ పోద్దారుగారితో ఒక చర్చలో ఒకరు ఈవిధంగా ప్రశ్నించారు. కలియుగంలో ఈనాడు ఇవన్నీ జరుగుతూ ఉన్నాయి. వినేవారు వేలు-లక్షలు, వినిపించేవారు మహాపండితులు. కానీ, ఆ ప్రభావము ఎందుకు కనిపించడము లేదు? పరీక్షిత్తు ఏడు రోజులలో ముక్తుడైనాడు. భాగవతాన్ని వివరిస్తున్నది ఋషి జీవనమును జీవించే శుకమహర్షి, శ్రవణం చేసేవారు పరీక్షిత్తు. మరణము రాబోతున్నది అనే విషయము తెలిసినప్పటి నుండి పరీక్షిత్తు మిగిలి ఉన్న కాలమును సద్వినియోగం చేసుకోవాలనే తపనతో కథాశ్రవణము చేశాడు. ఈనాడు అటువంటి వ్యక్తులూ లేరు, శ్రోతలూ లేరు. కథాశ్రవణము పేరున కేవలము మనోరంజనమే సాగుతున్నది. అప్పుడిక అటువంటి ప్రభావమెలా ఉంటుంది? ఆచరించినది చెప్పినప్పుడే ప్రభావం కనిపిస్తుంది. విషయం అర్హతకి సంబంధించినది. మనం అటువంటి ప్రభావమును కనబరిచే లోకసేవికులైన బ్రాహ్మణులకు శిక్షణ నివ్వాలి.

### ఆదర్శముల హిమాలయములను అధిరోహించండి

పరమపూజ్యగురుదేవులు భావనలలో సూత్రాలన్నీ ఇమిడి ఉన్నాయి. గురుదేవులు వ్రాసినది అమలుపరచటానికి 1000 సంవత్సములైనా సరిపోవేమోననిపిస్తుంది. గురుదేవులు అన్ని సూత్రాలను అందించారు. ఆయన భావనలన్నీ ఈనాడు కూడా అంతే తాజాగా ఉన్నాయి. 'ఆత్మబోధ-తత్త్వబోధ' అన్న ఒక్క సూత్రమునే జీవితపు లోతుల్లోకి దింపుకుని ఆచరిస్తే జీవితం యొక్క ఆలోచనాశైలి మారిపోతుంది. ఇటువంటి లెక్కలేనన్ని సూత్రాలు ఆయన భావనలలో తొంగిచూస్తాయి. గురుదేవులిలా వ్రాశారు. ' మేము వ్రాశాము, ప్రచారము చేశాము, సంస్థను నిలబెట్టాము. అయితే మేము ఆదర్శముల హిమాలయ పర్వతమును అధిరోహించాము. ఇదే మా పనులన్నింటిలోకి గొప్పది. మా పరిజనులందరు ఇటువంటి ప్రయత్నమునే చేయుటకు మేము ఆహ్వానము పలుకుతున్నాము'.

### గురువర్యుల పునర్జన్మ జరగాలి

1957 నుండి సంస్థ మొదలైనది. ఇప్పుడు 2011 లో 53 సంవత్సరముల తరువాత తిరిగి గురుదేవులకు నూతన జన్మనివ్వాలి. 21 వ శతాబ్ది ప్రఖర స్వరూప గురుసత్తా పునర్జన్మ జరగాలి. ప్రచార కార్యక్రమము పూర్తయ్యింది. ప్రస్తుతము పూజ్య గురుదేవుల ప్రాణప్రతిష్ఠ క్రియాత్మక కార్యకలాపాల ద్వారా జరగాలి. క్రాంతులన్నీ నలుదిశలా సక్రియమౌతూ కనిపించాలి. పీడ-పతనములను నివారించే రచనాత్మక అభియానము దశదిశలా వేగం అందుకోవాలి. అవి సుడిగాలి వలె వేగంగా ముందుకు సాగాలి. ప్రపంచములో ప్రథమంగా తనకు తాను పరివారం అనే పేరును పెట్టుకున్న సంస్థ మనదే. అఖండజ్యోతి పరివార్, గాయత్రీ పరివార్ అన్న పదాలను పూజ్య గురుదేవులు 1940 లోనే ఇచ్చారు. మన పరివారం ఇప్పుడు సమస్త విశ్వమును నవీనంగా నిర్మించ బోతున్నది. ఈ అద్భుత కార్యంలో మన భావనాత్మక పరిణితి గురుసత్తా వ్యక్తిత్వమునకు అనుగుణంగా వుందా? లేదా? అన్నదే మనం ఆలోచించాలి.

### గురుదేవులు వేలాది సంవత్సరములు జీవించాలి

మన గురుదేవులు వేల సంవత్సరాలు జీవించాలని మనం భగవంతుడిని ప్రార్థిస్తున్నామా? ఈ యుగవసంతకాలంలో మహాకాలునికి ఇదే మన ప్రార్థన అయినట్లయితే మనం కూడా గురుదేవులు చెప్పింది చేయాలి, సద్గుణముల ఉపాసన చెయ్యాలి. అంతేకాక ఆయన భావనలను అమలుపరిచి పుణ్యమును సముపార్జించాలి. మహాకాలుడు మనమీద ఆశీస్సులను కురిపిస్తాడు.

*- అఖండజ్యోతి, మార్చి 2011*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

**వైఫల్యాలను అధిగమించి లక్ష్యంవైపు పురోగించడమే సాహసం.**

ఆరోగ్యమే మహాభాగ్యం - 4

# హోమియో వైద్య సేవ

**ఈ మధ్య తరచుగా చాలా మంది నడుము నొప్పితో బాధ పడుతున్నారు. ఇది ఎందుకు వస్తుంది. నివారణ మార్గాలు, చికిత్స గురించి సూచించగలరు?**

**– సాంబశివరావు, హైదరాబాద్**

నడుమునొప్పి (low backache) అనేది చాలా తరచుగా వచ్చే నొప్పి. 90% మందికి జీవితంలో ఒక్కసారైనా నడుమునొప్పి వస్తుంది. జలుబు తర్వాత ఎక్కువగా డాక్టరు దగ్గరకు వెళ్ళేది నడుము నొప్పి కోసమే! చాలా మంది నడుము నొప్పి కోసం డాక్టరు దగ్గరకు వెళ్ళరు. విశ్రాంతి తీసుకొని లేదా పెయిన్‌కిల్లర్ వేసుకొని వదిలేస్తారు. చాలా వరకు అది దానంతట అదే తగ్గిపోతుంది. ఈ నొప్పి తీవ్రత కొంతమందికి తక్కువగా కొందరికి చాలా తీవ్రంగా తిమ్మిర్లతో పాటుగా ఉండవచ్చు. ఒకరోజు లేదా రెండు రోజులు ఉంటుంది. మెల్లగా దానికదే సద్దుకొంటుంది. చాలా మందిలో ఈ నొప్పి తరచుగా వస్తూ ఉంటుంది.

గణాంకాలు చూస్తే ఎక్కువగా ఆఫీసులకు సెలవులు పెట్టేది నడుమునొప్పి వలనే. ఒత్తిడి, శ్రమ నడుములోని కండరాలను అతిగా వాడడము లేదా సరైన పద్ధతిలో వాడక పోవడము అనేది ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

నడుమునొప్పి ఎందుకు తరచుగా వస్తుంది? మన వెన్నెముక వంపులో రెండు చోట్ల చాలా బలహీనంగా ఉంటుంది. మెడదగ్గర, నడుము దగ్గర. నడుము మీద మన బరువులో సగం పడుతుంది. అందువలన నడుము నొప్పి రావడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మన శరీరంలో ప్రతి జాయింట్ కొంతవరకు పనిచేయగలుగుతోంది. దానికి మించిన ఒత్తిడి పడినప్పుడు ఈ నొప్పులు వస్తాయి. ప్రతిరోజు అలాంటి ఒత్తిడే తరచుగా కలుగుతూ ఉంటే కండరాలు మరింత ఒత్తిడికి గురౌతాయి. నడుమునొప్పికి సాధారణమైన కారణము సరైన శారీరక భంగిమ లేకపోవడం. (bad posture) దీనివలన నడుము కండరాలు బలహీనపడతాయి. ఎప్పుడైనా అకస్మాత్తుగా బరువులు ఎత్తినపుడు, మెలి తిరిగినపుడు, కింద పడినప్పుడు, గుర్రపు స్వారీ చేసినపుడు, ఇరుకుగా చాలా సేపు కూర్చోవడం, ట్రాక్టరుపై ప్రయాణం, ఎగుడు దిగుడు రోడ్లపై ప్రయాణం వంటివి చేసినపుడు ఈ నడుమునొప్పి రావచ్చు. ఒక్కోసారి ఏదో ఒక కారణంగా కాకుండా చాలా కాలంగా అపసవ్యమైన భంగిమలో నడవడం, కూర్చోవడం చేసినపుడు నడుము నొప్పి మొదలవచ్చు.

బలహీనమైన నడుముకు క్రింది కారణాలు నొప్పిని కలిగిస్తాయి.

దెబ్బలు, క్రిందపడటం, బరువులు ఎత్తటం, మానసిక కారణాలు – మనోవ్యాకులత (Depression), ఏదైనా తరుణ వ్యాధులు, అలసట, గర్భధారణ, నెలసరి, ఊబకాయం, తరచుగా జబ్బుచేయడం, వెన్నెముక ఇన్ఫెక్షన్లు, అరికాలు ఆకృతిలో తేడాలు.

నడుము నొప్పి వచ్చినపుడు నొప్పి ఉన్న ప్రాంతంలో ఒత్తిడి తగ్గటానికి వేరే భంగిమలో నడవడం, బరువులు ఎత్తడం చేసినపుడు ఆ ఒత్తిడి వేరే కండరాల మీద పడుతుంది. ఆ కండరాలు ఆ పని కోసం ఏర్పడ్డవి కావు కాబట్టి మళ్ళీ ఆ కండరాలు కూడా బలహీనపడి నడుము నొప్పి మరింత పెరుగుతుంది.

పైన చెప్పినది సాధారణ కారణాలు (Triggers) మిగతా ఎన్నో జబ్బుల వలన నడుము నొప్పి రావచ్చు. ఉదా॥ ఆస్టియో ఆర్థ్రైటిస్ (osteo arthritis), డిస్క్ ప్రొలాప్స్ (disc prolapse), వెన్నెముక ఫ్రాక్చర్ (Fracture of vertebrae) మొ॥నవి.

వెన్నెముకలోని సమస్యలే కాకుండా ఉదరంలోని, గర్భకోశ సమస్యలు, మూత్రపిండాలలో రాళ్ళు, ప్రోస్టేట్ మొ॥గు సమస్యల వలన కూడా నడుము నొప్పి రావచ్చు.

మామూలుగా డాక్టర్ల వద్దకు వెళ్ళే 70% మందికి 3 వారాలలో 90% మందికి 6 వారాలలో నడుము నొప్పి తగ్గిపోతుంది.

**ఎప్పుడు డాక్టరు వద్దకు వెళ్ళాలి?**

సాధారణ నడుమునొప్పి కాకుండా క్రింద పేర్కొన్న సమస్యలు ఉంటే తప్పనిసరిగా వైద్యుణ్ణి సంప్రదించాలి.

* నొప్పితో పాటుగా తగ్గకుండా జ్వరం
* మూత్రం, మలంపైన పట్టులేకుంటే
* కాళ్ళలో తిమ్మిర్లు, వికారం, వాంతులు
* యాక్సిడెంటులో నడుముకు బాగా దెబ్బతగిలినచో
* చర్మం ఎర్రబారితే
* కొద్దిపాటి ఒత్తిడి కూడా భరించలేకుంటే
* నొప్పితో పాటుగా కండరాలు బలహీనపడితే
* నొప్పి నడుము నుండి తొడలు, కాళ్ళకు పాకితే
* కొంచెం కదలిక కూడా భరించలేకపోవడం

**పాప పుణ్యకర్మల ఫలితాలు మాత్రమే జీవిని అనుసరిస్తాయి.**

* వేరే సమస్యకోసం స్టిరాయిడ్ మందులు వాడుతున్నచో
* ఏదైనా క్యాన్సర్ గడ్డలు ఇంతకు ముందే ఉన్నపుడు
* హెచ్.ఐ.వి. పాజిటివ్
* బరువు తగ్గినపుడు
* 50 సం॥ల వయసు పైబడినవారు
* 20 సం॥లలోపు వయసులో విపరీతమైన నడుమునొప్పి
* తక్కువనొప్పే కాని 2 వారాలు దాటితే
* విశ్రాంతి 2 రోజులు తీసుకున్నా కాని నొప్పి తగ్గకపోతే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

**నడుము నొప్పి రాకుండా ఎలా చూసుకోవాలి?**

* బరువులు ఎత్తేటపుడు వంగకుండా మోకాళ్ళమీద కూర్చొని బరువు ఎత్తాలి.
* ఎక్కువసేపు నిరంతరాయంగా నిల్చుని ఉండకూడదు. నిల్చున్నపుడు చెవులు, భుజములు, నడుము మరియు మోకాళ్ళు ఒకే నిలువెత్తు, గీతలో ఉండేలా చూసుకోవాలి.
* ఎక్కువ గంటలు కూర్చుని ప్రయాణం చేసేటప్పుడు గంటకొకసారి లేచి కాసేపు అటు ఇటు నడవాలి.
* కూర్చునే కుర్చీ మరీ ఎత్తుగా, మరీకిందకు ఉండకూడదు. కూర్చునపుడు అరికాళ్ళు నేలకు ఆనాలి.
* వంగి కూర్చోకూడదు.
* నిద్రపోయేటపుడు పరుపు నడుముకు ఆధారంగా ఉండాలి కావాలంటే నడుము వంపులో దిండును పెట్టుకోవాలి.
* వ్యాయామం చేయాలి.
* నడక / ఏరోబిక్ వ్యాయామం + సైకిలు తొక్కడం వంటివి కనీసం రోజుకు అరగంట నుండి గంట చేయాలి.
* వార్మ్అప్ (warm-up exercises) వ్యాయామాలు ఖచ్చితంగా చేయాలి.
* బరువుని నియంత్రణలో ఉంచుకోవాలి.
* కాల్షియం, విటమిన్-డి, ఫాస్ఫరస్, ప్రొటీన్ ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. ఉదా॥ పాలు గుడ్లు, సోయాబీన్స్, రాగులు, దంపుడు బియ్యం మొ॥నవి.
* ఎత్తు మడమల చెప్పులు వేసుకోరాదు.
* పొగతాగటం మానివేయాలి. పొగతాగేవారికి ఎముకలు బలహీనపడతాయి. (osteoporosis)
* యోగ, ధ్యానం, మర్దనాల వంటి అలవాట్లు చేసుకోవాలి.

నడుమునొప్పి ఒక లక్షణం జబ్బు కాదు. చాలా జబ్బులలో కనబడే ఒక లక్షణం కాబట్టి దానికి కారణమైన జబ్బు ఏమిటి అని వైద్యుడు కనుక్కొంటారు. దానికి సాధరణంగా రోగిని పరిశీలించి కొన్ని టెస్టులు కూడా చేయిస్తారు. ఉదా॥ C.B.P., E.S.R., X-Ray, C.T.Scan, MRI, Bone Scanning Etc.,

**నడుమునొప్పి చికిత్సలు :**

పెయిన్ కిల్లర్స్, ఫిజియోథెరపి

**హోమియోపతి చికిత్స :**

పైన పేర్కొన్న సలహాలు పాటిస్తూ హోమియో మందులు వైద్యుని సంప్రదించి వాడినచో చాలావరకు ఉపశమనం ఉంటుంది. అంతేకాక సాధారణ పెయిన్ కిల్లర్స్ వలె ఎటువంటి దుష్పరిణామాలు కూడా ఉండవు. సాధారణంగా నడుమునొప్పికి వాడేమందులు. రస్టాక్స్, బ్రయోనియా, హైపరికం, కాలికార్బ్, కాల్కేరియా ఫ్లోర్ మొ॥నవి.

సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా

**డా॥ టి. నీలవేణి**, బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్..జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర,
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఇ-మెయిల్: drneelaveni@gmail.com

*ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచుకోవడానికే దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.*

## గాయత్రీ మంత్ర లేఖనం

*గాయత్రీ మంత్ర లేఖనం పూర్తి చేసినవారు మంత్ర లేఖన పుస్తకాలను, రూ.108/-లు అంశదానముతో సహా, 30 మార్చి 2011లోగా గాయత్రీ చేతనా కేంద్రమునకు పంపవలసినదిగా కోరడమైనది. వీనిని తదుపరి శాంతికుంజ్‌కు పంపించెదము.*

## సంజీవని సాధనా శిబిరము

*11 మే, 2011 నుండి 19 మే, 2011 వరకు 9 రోజుల సంజీవని సాధనా శిబిరము శాంతికుంజ్, హరిద్వార్‌లో తెలుగుభాషలో నిర్వహించబడుచున్నది. ఆసక్తి కలవారు ముందుగానే తమ పేర్లను గాయత్రీ చేతనా కేంద్రములో నమోదు చేసుకొనవలసినదిగా కోరడమైనది.*

**ఫోన్ నెం. 9949111175**

సంశయాలను వదిలిపెట్టు.

# వేమన వేదం-జీవన నాదం - 4

లోకాన్ని దర్శించగలవాడే యదార్థవాది. ఆనాడు లోకాన్ని దర్శించడమే కాకుండా అన్నికాలాలకు, ప్రాంతాలకు అనుగుణంగా మానవజీవితంలో ఎదురయ్యే సన్నివేశాలను, సంఘటనలను ముందుగానే ఊహించి, మనస్సుతో దర్శించి, ఇతిహాసాలను సృష్టించారు కాబట్టే వాల్మీకి, వేదవ్యాసులవారిని ద్రష్టలుగా, స్రష్టలుగా పేర్కొంటారు. అలాగే నేటి యుగంలో మానవ జీవితాన్ని అధ్యయనం చేయడమే కాకుండా, ఆ అనుభవసారాన్ని కాచి, వడబోసి మనకందించిన "వేమన" క్రాంతిదర్శియేకాదు, వేదాంతవేత్త కూడా. ఆయన పద్యాలలోని ప్రతి భావము, అందరికీ వర్తించడమేకాకుండా, ప్రతిఒక్కరూ ఆచరించదగినవి. అందుకే వేమనను "నవయుగవైతాళికుడు" అనడంలో అతిశయోక్తి లేదు.

**ఇన్ని జాతులయందు నే జాతి ముఖ్యమన్**
**ఎఱుకగల్గువారే హెచ్చువారు**
**ఎఱుకలేనివారలేజాతినున్నను**
**హీనజాతులంచునెఱుగ వేమ !**

లోకంలో ఎన్నో జాతులు ఉన్నాయి. వాటిలో ఏ జాతి గొప్పది అన్న చర్చనీయాంశము వస్తే, అన్ని జాతులను రెండుగా చెప్పవచ్చును. అవి (1) తెలివిగలవారు (2) తెలివిలేనివారు అని విభజించాడు వేమన. ఇది వర్ణవ్యవస్థకు కులవ్యవస్థకు కూడా వర్తిస్తుంది. తెలివిగలవారు ఏ జాతిలో ఉన్న అది ఉత్తమజాతే. తెలివిలేనివారు ఏ జాతిలో ఉన్న అది సామాన్య (నీచ) జాతిగా తెల్సుకోవాలి. బుద్ధిహీనులే తప్ప వేరొక తెగ ఈ లోకంలో లేదు అన్న సత్యాన్ని వివరించారు.

ఇదే భావం మనకు గురజాడవారి కవితలో కన్పిస్తుంది.

**లోకమందున ఎంచిచూడగ**
**మంచి, చెడ్డలు రెండు కులములు**
**మంచియన్నది మాలయైతే**
**మాలనేనౌతా**

అంటూ, కులవ్యాకులాన్ని విడవండి, మంచిని చెడును గ్రహించే స్థితికి ఎదగండి అన్న వేమన ప్రభావం, తర్వాత తరం కవులపై తీవ్రంగా చూపించింది.

మరొక పద్యంలో మనకు చివరికి మిగిలేది కీర్తి ఒక్కటే.

"మిగిలినవి మరణం తర్వాత మన వెంటరావు" అన్న సత్యాన్ని తెల్సుకొని మసలుకోవాలి. వీలైనంతవరకు కీర్తిని పొందే ప్రయత్నం చెయ్యాలే తప్ప అపకీర్తిని పొందరాదు. అంటే అపకారం చేయడం, మోసం చేయడం మొ॥న హానికరమైన పనులు చేయరాదు.

**ఏమికొంచు వచ్చేనేమి దాఁగొనిపోవుఁ**
**బుట్టవేళనరుడు గిట్టవేళ**
**ధనము లెచటి కేగుఁ దానేగునెచటికి?**
**విశ్వదాభిరామ వినురవేమ**

పుట్టేటపుడు మానవుడు తనతో ఏమి తెచ్చాడు? చనిపోయేటపు కూడా ఏమి తీసుకుపోడు. జనన, మరణాల మధ్య జరిగే జగన్నాటకంలో భాగమే. ఈ ధన సంపాదన, విలాసాలు, విందులు, వంటివాటి కొరకు అక్రమ మార్గాలలో పయనించడం వాటి అవలక్షణాలతో వెంపర్లాడుతూ, పాపాలను పొందడం జరుగుతోంది. మనతోరానిది, మనదికానిదానికోసం మనం ఎందుకు తాపత్రయపడాలి? అన్న ఆలోచనాత్మకమైన వేదాంత సత్యాన్ని వేమన బోధించారు పై పద్యంలో.

**అయిదు వర్ణములనె యఖిలంబు తెలిసిన**
**నయిదునందు ముక్తి యమరియుండు**
**నయిదులోన నున్న యతడు పోయాఖిలము**
**విశ్వదాభిరామ వినురవేమ**

పంచ భూతాలసారమే "ప్రపంచం". "భూమి, అగ్ని, నీరు, వాయువు, ఆకాశం' సాక్షిగా లోకగమనం సాగుతోంది. పరులనుండి ఏమి ఆశించక తమ పరిధిలో ఇతరులకు ఉపయోగపడడమే (ఉపకారం చేయడమే) జీవిత సత్యము, దానికి నిదర్శనమే ఈ పంచభూతాలు. అందుకే అవి దైవసమానమై నిత్యపూజలందుకుంటున్నాయి. "అయిదు" కు పరమార్థమే అది. "నమఃశ్శివాయ" అన్న పంచాక్షరి కూడా లోకకల్యాణం కొరకు విషాన్ని (గరళాన్ని) గళంలో (కంఠంలో) దాచుకొని శివుడు, ముల్లోకాలను పావనం చేస్తున్న గంగను శిరస్సుపై ధరించడం, అన్యాయాన్ని, అధర్మాన్ని నాశనం చేస్తున్న లయకారుడు శివుడు "అయిదు" సంఖ్యలోని పరమార్థానికి చిహ్నంగా భాసిస్తున్నాడు. అదే సత్యాన్ని వేమన పంచేంద్రియాలు (అయిదు ఇంద్రియాలు) పంచ జ్ఞానేంద్రియాలు / పంచ కర్మేంద్రియాలు కూడా అధీనంలో ఉన్నపుడే ముక్తి లభిస్తుందన్న ముక్తి తత్వాన్ని పై పద్యంలో

**విశ్వాసాన్ని పెంపొందించుకో.**

"ప్రపంచ" నేత్రాన్ని మనముందుంచారు.

**ఒరుని చెరిచెదమని ఉల్లమందెంతురు**
**తమ దుబేటెరుగని ధరణి పరులు**
**తమ్ముఁ జెఱుచువాడు దైవంబులేఁడొకొ**
**విశ్వదాభిరామ వినురవేమ**

ఇతరులకు చెడు చెయ్యాలని ఆలోచించే మానవునకు, తప్పకుండా భగవంతుడు ఏదో ఒకరీతిలో, ఏదో ఒకరోజు గుణపాఠం చెప్పకుండా ఉండడు. ఈ విషయం తెలియని మూర్ఖులు ప్రక్కవానిని పెడత్రోవ పెట్టించే ప్రయత్నం చేసి, తరువాత వాళ్ళు కూడా బురదలోనే మ్రగ్గిపోతారు. 'చెరవకురా! చెడేవు' అన్న సూక్తి ఈ అర్థాన్నే చెబుతుంది. 'పరోపకార! పుణ్యాయ, పాపాయ పరపీడనం' అన్న సంస్కృత సూక్తి కూడా ఇతరులకు సహాయం చేస్తే పుణ్యం కలుగుతుంది. ఇతరులను పీడిస్తే తప్పక పాపం కలుగుతుంది. అరచేతిలోని ఒకవేలు ఎదుట వారి లోపాలను చూపిస్తూ ఉంటే, మిగిలిన మూడువేళ్ళు (ముడిచినవి) మనవైపు చూస్తుంటాయి. అంటే మన తప్పులను చూపిస్తాయి అంటారు. కాబట్టి "తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు" అని వేమన మరో పద్యంలో చెప్పిన భావం కూడా ఇదే. కాబట్టి ఇతరులకు 'చెడుచెయ్యాలన్న ఆలోచన కూడదు' అని హితవు చెప్పిన వేమన, అటువంటి తప్పులు చేసేవారికి శిక్ష తప్పదు అని హెచ్చరిస్తున్నాడు.

పరిపూర్ణత్వాన్ని, సార్థకతలను గురించి వివరిస్తూ వేమన ఇలా అన్నాడు.

**ఓర్పులేని భార్యయున్న ఫలంబేమి?**
**బుద్ధిలేని బిడ్డ పుట్టియేమి?**
**సద్గుణంబు లేని చదువది యేలరా?**
**విశ్వదాభిరామ వినురవేమ**

భార్య సహనశీలిగా, స్నేహశీలిగా, భర్త, పిల్లల మనోభావాలను అర్థం చేసుకుంటూ, కుటుంబ పురోగతికి తోడ్పడే సహనవతిగా ఉండాలి. "కార్యేషుదాసీ"... శ్లోకంలో చెప్పినట్లుగా ప్రతిగృహిణి, కార్యదక్షత, ఆలోచనా (వివేచన) శక్తి, అందరికి అన్నం పెట్టాలన్న అమ్మదనం, భర్త కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నపుడు చక్కటి సలహాదారుగా ఉన్నపుడే ఆమె పరిపూర్ణ లక్షణాలు కల్గిన భార్య. అలాగే విచక్షణా జ్ఞానం, పెద్దల పట్ల గౌరవప్రపత్తులు, కుటుంబంపట్ల బాధ్యతాయుతమైన ప్రవర్తన కల్గిన సంతానమే సత్సంతానము. అటువంటి లక్షణాలు లేని సంతానం ఉండి మాత్రం ఏ ప్రయోజనం? విద్యకూడా వినయంతో కూడిన విజ్ఞానాన్ని అందించాలి. విధ్వంసం, విద్రోహం వంటి విపత్కర ఆలోచనలను రేకెత్తించే విద్య విలయానికి దారితీస్తుంది. కాబట్టి భార్యా, పిల్లల, విద్య అనేవి ఎలా ఉండాలో వేమన చాలా చక్కగా వివరించారు.

**అంతరంగమందునపరాధములు సేసి**
**మంచివానివలెను మనుజుండు**
**నితరుతెరుగకున్న నీశ్వరుండెఱుగడా?**
**విశ్వదాభిరామ వినురవేమ**

ప్రతి ఒక్కరికి అంతరాత్మ ఉంటుంది. ఆత్మసాక్షిగా ప్రవర్తించినపుడు చిత్తశుద్ధితో మంచిపనులు చేసే అవకాశం ఉంటుంది. కపటబుద్ధితో ఇతరులకు అపకారం చెయ్యాలన్న తలంపు ఉంటే అది తప్పకుండా సర్వాంతర్యామి అయిన పరమేశ్వరునకు తెలుస్తుంది. గాంధీగారు కూడా చిన్నతనం నుండి తాను చేసిన తప్పులను అంతరంగ సాక్షిగా తెలుసుకొని, మళ్ళీ పునరావృతం కాకుండా తనశీలాన్ని తీర్చిదిద్దుకున్న కారణంగానే ఆయన మహాత్ముడయ్యారు. జాతి మొత్తం ఆయన అడుగు జాడలలోనే నడిచింది.

కాబట్టి అపరాధం, అపకారం, అవినీతి వంటి ఆలోచనలను సర్వేశ్వరుడు గమనిస్తున్నాడు. ఆయన విధించే శిక్షలు కఠినంగా ఉంటాయన్న భావనతో ప్రవర్తిస్తే మనుషులలో మానవత్వం, ఉపకారధోరణి, సేవానిరతి నెలకొంటాయన్న సత్యం ఈ పద్యంలో వ్యక్తమౌతోంది.

ఇటువంటి లోకోత్తర విషయాలను జీవన రహస్యాలను, నిర్భయంగా వెలువరించిన "వేమన" యదార్థవాది.

– సాధన నరసింహాచార్య

## ఆహ్వానం
## హిందీ నుండి తెలుగు అనువాదకులకు

*యుగఋషి పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యుల జన్మశతాబ్దిని పురస్కరించుకొని వారిచే విరచితమైన ఎంపిక చేసిన పుస్తకాలను, హిందీ నుండి తెలుగు భాషలోనికి అనువదించుటకు నిర్ణయించడమైనది. కావున ఆధ్యాత్మిక గ్రంథములను, సులభ శైలిలో తెలుగులో అనువాదం చేయగల సామర్థ్యమున్న వారికి గాయత్రీ చేతనా కేంద్రము ఆహ్వానము పలుకుచున్నది.*

**సంప్రదించవలసిన ఫోన్ నెం. 9949111175**

**విశ్వాసం పర్వతాన్ని అయినా కదిలిస్తుంది.**

# వసంత పంచమి వేళ గాయత్రీ మంత్రము-గాయత్రీ మహా యజ్ఞముల ప్రాశస్త్యము - యుగఋషి, పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల గాయత్రీ మహాభారత సందేశము

వ్యాసమహాముని విరచితమైన మహాభారత గ్రంథాన్ని పంచమ వేదంగా కీర్తించారు మన ప్రాచీనులు. దీనిలో శ్రీకృష్ణుడు అవతారమూర్తిగా మనకు కన్పిస్తూ కౌరవ సంహారంతో దుష్ట శిక్షణ పూర్తిగావించి, పాండవ విజయంతో శిష్టరక్షణ అనగా ధర్మానికి విజయాన్ని అందించాడు. దీనిలో భీష్ముని పాత్ర మనకొక అద్భుత సందేశాన్ని అందించింది. పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య మనకందించిన దాని ప్రకారము సంపదలను పొందుటకై మనమనుసరించిన మార్గము, విధి విధానములు తప్పక మన జీవన విధానాన్ని, తదుపరి మన జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ఎప్పటికైనా దాని ఫలితాలను మనము అనుభవించి తీరవలసినదే.

దీనికి ఉదాహరణ..... కౌరవాగ్రజుడైన దుర్యోధనుడు అతని పరివారము ధర్మ మార్గమును విడచి అధర్మ మార్గాన (జూదము వగైరా) రాజ్య సంపదల పొందుట ప్రకృతినియమానికి విరుద్ధము. తదుపరి అధికార గర్వముతో, అస్త్రబల గర్వముతో పాండవులకు సూదిమొనమోపినంత స్థలాన్ని కూడా ఇవ్వనని దుర్యోధనుడు పలుకుట, అధర్మ ప్రవృత్తికి నిలువెత్తు ఉదాహరణ. దీనికితోడు ఒక రాచరిక స్త్రీని నిండు సభలో తూలనాడి వివస్త్రను గావించుటకై ప్రయత్నించుట రాక్షస ప్రవృత్తికి, అధర్మ ప్రవర్తనకు పరాకాష్ఠ. ఇట్టి స్థితిలో కూడా పవిత్రగంగాదేవి పుత్రుడు, ధర్మాధర్మ విచక్షణా గరిష్టుడు, ఇచ్ఛా మరణాన్ని వరంగా పొందినవాడు, విలువిద్యలో తనకు తానే సాటి మరియు కేవలం కనుసైగతో దుర్యోధనుని నిలువరించగల సామర్థ్యమున్న భీష్ముడు, దుర్యోధనుడందించిన సంపదలననుభవించుచున్నాననెడి నెపముతో మిన్నకుండిపోయి అధర్మానికి తలవంచుట శిక్షార్హమైన నేరముగా మారినది. దీనితో భీష్ముని నరనరాలలో ప్రవహించుచున్న రక్తము పాప పంకిలమైపోయి అతనిలోని ప్రాణశక్తి కూడా మలినమైపోయింది.

నిరతము తననే ధ్యానిస్తూ తన నామమునే జపిస్తూ తన పట్ల అత్యంత భక్తి శ్రద్ధలతోనుండెడి తన భక్తుడైన భీష్ముని పాపరహితుని గావించుటకై ధర్మరక్షణార్థమై అవతరించిన శ్రీకృష్ణుడు, భీష్ముని శరీరాన్ని తీక్షణమైన ములుకులు గల అంపశయ్యపై పరుండబెట్టి, ఆ మలిన రక్తము పూర్తిగా కారిపోయేంతవరకు ప్రేమతో శిక్షించాడు. తద్వారా ఈ జన్మలోనే భీష్మునికి ప్రాయశ్చిత్తము గావించి పాపవిముక్తుని చేసి ఆ పిమ్మట యుధిష్టిరునకు ధర్మ ప్రబోధము చేసెడి అర్హతను ప్రసాదించాడు. ఆ తరువాత అతని ఆత్మను తన అక్కున చేర్చుకొని భీష్ముని సంస్కరించాడు. యుగ పురుషుడైన శ్రీకృష్ణుడు – ఈ రీతిగా అధర్మవర్తనులు, అధర్మానికి వత్తాసు పలికెడివారినేకాక, తమశక్త్యానుసారం అధర్మమునెదిరించని భీష్మ, ద్రోణాచార్యులను కూడా శిక్షించినాడు.

అట్లే భారతంలోని పంచపాండవుల పాత్రలు మనలోని పంచ ప్రాణాలకు ప్రతీకలు. పంచపాండవులలోని మధ్యముడు, గీతాచార్యునికి ప్రీతిపాత్రుడు, ప్రియశిష్యుడు అర్జునుడు – మనదేహంలో మనస్సు అర్జునునికి ప్రతీక. అర్జునుని అన్న భీముడు వాయుపుత్రుడు – అనగా మనలోని శ్వాసకు ప్రతీక. అదే ప్రాణ శక్తి వాయువు. వీరిద్దరి అన్న యుధిష్టిరుడు – ధర్మరాజు ఈయన తండ్రి యమధర్మరాజు, జీవులకు న్యాయాధికారి – అనగా ధర్మ పథాన నడువమని హెచ్చరించెడివాడు. ఇదే మనలోని బుద్ధికి అనగా మనమనుసరించెడి మార్గానికి ప్రతీక. నాల్గవవాడు నకులుడు అనగా న+కులుడు అనగా కులములేనివాడు. ఇక మిగిలిన ఐదవవాడు సహదేవుడు = సహ+దేవుడు = దేవునితో సమానము. అనగా సత్యవర్తనుడు, ఋజువర్తనుడు.

పైదాని ప్రకారం మన మనస్సు తద్వారా ఆలోచనల గతి సన్మార్గము వైపు సాగాలి. తదుపరి మనము పీల్చెడి గాలి అదే ప్రాణవాయువు మలిన రహితముగా ఉండాలి. మూడవది మన మార్గము సమాజహితకారి మరియు ధర్మబద్ధమైనదిగా ఉండాలి. పై మూడింటి ద్వారా మనలోని కుటిలత నశించి, ప్రాణశక్తి బలముపుంజుకొని, దైవీగుణములతో అలరారగలదు. అనగా మంచి మనస్సు, మంచి వాయువు, ఋజువర్తనలతో సశీలుడై దైవీగుణములతో పరిపూర్ణుడైన వాని ఐదుగుణములు, ఐదు ప్రాణాలతో సమానము. ఇదే మనలోని పంచ ప్రాణాలు – ఈ పంచ ప్రాణములలో మలిన శాతము పెరిగినకొలది, ప్రాణశక్తి తగ్గుతూ ఆ జీవి మరణానికి దగ్గరవుతుంది. అట్లే ప్రాణశక్తుల స్వచ్ఛత పెరిగిన కొలది జీవుడు దీర్ఘాయుష్షును పొందును.

ఇందులకై యుగఋషి, పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు వాయుమండల శుద్ధికై నిత్య యజ్ఞ ప్రక్రియను మనకందించారు. ఈ యజ్ఞములో 33 వనమూలికలు వాయు

జీవించేకళ కార్యశూరుడినే వరిస్తుంది.

రూపంలో పరిసర ప్రాంతవాయు మండలాన్ని పరిశుభ్రపరచి ప్రాణశక్తితో నింపి జీవకోటికి నిత్యనూతన జవసత్త్వాలను అందిస్తుంది. ఈ యజ్ఞానికి, గాయత్రీ మంత్రములోని మంత్రశబ్ద శక్తితోడై వాక్కు ప్రదూషణలను, మనోమాలిన్యాలను తొలగిస్తుంది. తద్వారా వాతావరణమంతా స్వచ్ఛమైన ప్రాణశక్తితో నిండి, బలోపేతమై జీవకోటి జవసత్త్వములను పెంపొందించుకొని, రోగరహిత, వృద్ధాప్యరహిత, నిత్య యౌవ్వనముతో కూడిన మరణరహిత మానవసమాజము ఏర్పడగలదు. ఈ రహస్యాన్ని, సత్యాన్ని తన తపోశక్తితో దర్శించిన యుగఋషి – ప్రజ్ఞావతారమైన పరమపూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు యావత్ విశ్వమానవాళికి గాయత్రీ మంత్రముతోపాటు, గాయత్రీ యజ్ఞ ప్రక్రియలను అత్యంత సులభశైలిలో అందించిరి. దీనిని ప్రతివారు ఇంటింటా ప్రతిరోజూ జరుపుకొనుట శ్రేయోదాయకము. అట్లే ఆశ్రమాలలో, దేవాలయాలలో సామూహికముగా పై రెండింటిని నిర్వహించిన అవి జనజాగరణ కేంద్రాలుగా రూపుదాల్చి జీవకోటి జీవ పరిణామాన్ని పెంపొందించగలవు. భూమిపై అమరత్వం ఏర్పడి స్వర్గావతరణతో దైవీగుణాలు పెంపొందుతాయి.

*– మూలం: డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారి*
*2011 వసంత పంచమి దివ్య సందేశము నుండి సేకరణ*

## మహనీయుడు

*ఒక ఇంగ్లాండు దేశపు బాలకుడికి బాల్యంలో ఒక కాలు విరిగిపోయింది. అందరు అతని భవిష్యత్తు, అంధకార బంధురమనా నిర్ధారించి సానుభూతిని ఒలకపోస్తూ అతడి దౌర్భాగ్యాన్ని నిందించేవారు. అతడు ఎవరి మాటలను లెక్కచేయలేదు. సానుభూతి అనే మురికి కూపం నుంచి వీరు బయటపడాలా అని ఆలోచించాడు. అతనిలోని తపన, ప్రగతి పథంలో పరుగులు తీయాలనే జిజ్ఞాస అతనిని ఒక సాహితీవేత్తగా తయారు చేశాయి. హెచ్.జి.వెల్స్ అనే పేరుగల ఈ మహనీయుని కలం ద్వారా వెలువడిన సాహిత్యం విశ్వవిఖ్యాతి చెందింది. బాల్యంలోనే కాలుపోగొట్టుకున్న, ప్రతికూల పరిస్థితుల మధ్య నలుగుతున్న అంగవిహీనుడైన వ్యక్తి ఇంత అద్భుత సాహిత్యాన్ని సృష్టిస్తాడోని ఎవరైనా ఊహించగలరా? నిజం చెప్పాలంటే సౌభాగ్యం, దౌర్భాగ్యం అనేవి పురుషార్థపు ప్రతిఫలాలే. వర్తమానం ఎంత గొప్పగా కనిపిస్తున్నప్పటికి పురుషార్థం పట్ల విరక్తి కలిగి, మనోబలం క్షీణిస్తే భవ్యమైన భవిష్యత్తు అంధకారమయమవుతుంది.*

– ప్రజ్ఞా పురాణం నుండి

## శ్వాస

శ్వాస అనే దారముతో జీవితమనే మాల తయారవుతుంది. జీవితంలోని ప్రతి పువ్వు దీనితో ముడిపడి ఉన్నది. శ్వాసకు గల లయ జీవితానికి చిరునవ్వును ఇస్తుంది. అడ్డంకులు, బాధలు, విరోధములు శ్వాస గతిని ప్రభావితం చేసినపుడు జీవితం అంతా వాడిపోయి చనిపోవడము జరుగుతుంది. శరీరము, మనస్సు రెండూ కూడా శ్వాస యొక్క గతితోనే లయబద్ధమవుతాయి. అంతెందుకు సర్వవ్యాపియగు ఆత్మప్రకాశము కూడా శ్వాస అనే దారముతోనే జీవితములోకి ప్రవేశిస్తుంది.

శ్వాస లయ మారగానే జీవితపు రంగు–రూపు సహజముగానే మారిపోతాయి. శ్వాసల యొక్క విభిన్న అవస్థలే క్రమక్రమంగా కోపము, ద్వేషము, వైరము, కరుణ, అనురాగము, రోషము, ఈర్ష్యగా మారుతాయి. ఈ విషయము చెప్పేది, వినేది కాదు, అనుభవించతగినది. ఒకవేళ ఒక నెల అంతా అన్నికాలైన భావదశలను మరియు పరిస్థితులను ఒక చిట్టాగా తయారుచేస్తే శ్వాస యొక్క ఎటువంటి లయ మనకు శాంతి, విశ్రాంతుల నందిస్తుంది అనే విషయము తప్పక బోధపడుతుంది. ఏ లయలో మనము మౌనముగా, శాంతముగా, సువ్యవస్థితముగా ఉండగలమో కూడా అనుభవమౌతుంది. ఏ లయ వలన అనాయాసముగా జీవితములో ఆనందము వెల్లివిరుస్తుంది అనే విషయము కూడా తెలుస్తుంది. లయల యొక్క పరివర్తనతోనే ధ్యాన–సమాధులు ఏర్పడతాయి.

శ్వాస గతిని జాగరూకతతో పరివర్తన చేసే కళయే ప్రాణాయామము. ఇది ఇప్పటివరకు మానవుడు చేసిన పరిశోధనలన్నింటిలోనూ గొప్పది. మానవుడు చంద్రునిమీదకు, అంగారక గ్రహం మీదకు చేరినదానికంటే కూడా మహత్వపూర్ణమైనది. శరీరముతో మానవుడు ఎక్కడికైనా వెళ్ళగలడు. దేన్ని కావాలన్నా పొందగలడు. కానీ శ్వాస లయ యొక్క మార్పుతో అతని జీవితమే మారిపోతుంది. శ్వాస యొక్క లయ మారాలి. అయితే కేవలము అంతరంగాన ఎరుకలో ఉండి చేసే ప్రాణాయామము ద్వారానే ఇది సంభవము కాదు. ప్రతి శ్వాసతోపాటు జాగరూకతను కలిగివుంటూ, ప్రతి శ్వాసతోపాటు భగవన్నామాన్ని తలచుకోవాలి. ఈవిధంగా చేసినప్పుడే శ్వాస యొక్క లయతోపాటు జీవితము యొక్క లయ కూడా పరివర్తన చెందుతుంది.

**ఆదర్శ మార్గం పయనించేవారికి భగవంతుని పరీక్షలు అడుగడుగునా ఉంటాయి.**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## వసంత పంచమి వార్తలు

### గాయత్రీ శక్తి పీఠము - నారాకోడూరు, గుంటూరు జిల్లా

యుగఋషి, పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల శతజయంత్యుత్సవ వేడుకల ప్రారంభ సూచకముగా మరియు 8 ఫిబ్రవరి 2011 వసంత పంచమి వేడుకలను పురస్కరించుకొని, గాయత్రీ శక్తి పీఠము, నారాకోడూరులో అత్యంత భక్తి శ్రద్ధలతో పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి సారథ్యంలో హరిద్వార్‌లోని యుగతీర్థ్, శాంతికుంజ్‌ను తలపించెడి వాతావరణములో అత్యంత వైభవముగా ఆద్యంతము ఉత్సాహ భరిత వాతావరణములో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

శక్తిపీఠ ప్రాంగణములో శాంతికుంజ్‌ను తలపించెడి రీతిలో సప్తఋషుల ఛాయాచిత్రములను పాలరాయితో నిర్మించిన పీఠములపై ఆవిష్కరించుట, పాలరాతితో నిర్మించిన వేదిక మధ్యన నిర్మించిన ప్రఖర ప్రజ్ఞ - సజల శ్రద్ధల భావప్రదర్శిత ఛాయాచిత్రాల స్థాపన, రెండు నిలువుల హిమాలయ దిగ్దర్శన ఛాయాచిత్రం, గాయత్రీమాత మందిర ప్రాంగణమందు దారితప్పిన దేవతలకు (భట్‌కా హువా దేవత) హితబోధగా తెలుగు భాషలో వివరిస్తూ స్థాపించిన ఐదు నిలువుటద్దములు మున్నగునవి, శక్తి పీఠానికి నూతన సొగసులందించినవి. భక్తుల రాకతగ్గిపోయి వడలి వసివాడిన శక్తిపీఠ వృక్షరాజానికి నీటిని, ఎరువును అందించి, నూతన చివురులు తొడిగేలా చేయుట జరిగినది. ఇక ఈ వృక్షరాజానికి తమ తమ అంశదానాలను, సమయదానాలనందించి, వట వృక్షముగా తయారుచేసి, పామరులకు-పండితులకు, దుష్టులకు-శిష్టులకు, గృహస్థులకు-తదితరులకు, పేదలకు-ధనికులకు, రాక్షసులకు-దేవతలకు, ఆబాలగోపాలానికి, యావత్‌ప్రాణికోటికి సన్మార్గ దిశానిర్దేశనము చేసెడిరీతిగా తీర్చిదిద్దవలసిన బాధ్యత గాయత్రీ పరివార్‌దే. ముఖ్యముగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలవారిపై బాధ్యత ఎక్కువగానున్నది.

6, ఫిబ్రవరి 2011న కలశయాత్రతో శక్తిపీఠము చుట్టు ప్రక్కలనున్న 4 గ్రామాలలోని ప్రజలను చైతన్యపరచుట జరిగినది. 7, ఫిబ్రవరి 2011న 250 మంది పరివారముతో అఖండ జపము జరిగినది. సాయంత్రం దీపయజ్ఞం అత్యంత శోభాయామానంగా 1108 దీపాలతో జరిపిరి. 8, ఫిబ్రవరి 2011న 9 కుండముల గాయత్రీ మహాయజ్ఞము 500 మందితో జరిపిరి. దీనికిముందు "అష్టసిద్ధి నవనిధికే దాతా - సబ్ సమర్థ గాయత్రీమాత" అనెడి దానిని మరియు "గాయత్రీ మహావిజ్ఞాన్ బోధించెడి కాలేజి" అనెడి వానిని ఆవిష్కరించుట జరిగిది.

శక్తిపీఠ అభివృద్ధి కమిటీని 24గురుతో శ్రీ అశ్విని సుబ్బారావుగారి నేతృత్వంలో పనిచేయుటకై ఎంపిక జరిగినది.

### గాయత్రీ పరివార్, పొన్నూరు శాఖ, గుంటూరు జిల్లా

గాయత్రీ పరివార్ పొన్నూరు శాఖ, గుంటూరు జిల్లాలో యుగఋషి పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల జన్మశతాబ్ది వేడుకల వేళ, 2011 వసంత పంచమి వేడుకలతో కలపి, పొన్నూరు గాయత్రీ పరివార్ శాఖ దశమ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. 29, జనవరి 2011 శనివారము ఉదయం 8 గం॥లకు, రెండువేల మంది ఆబాలగోపాలముతో పొన్నూరు పట్టణ వీధులలో కలశయాత్ర నిర్వహించిరి. సాయంత్రము 6 గం॥లకు 2400 దీపములతో గాయత్రీ దీపమహాయజ్ఞాన్ని 1500 మందితో నిర్వహించిరి. 30, జనవరి 2011 ఆదివారము ఉదయం 7 గం॥ సర్వపాపనివారణియైన గోపూజతో ప్రారంభించి, 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞాన్ని ఆరువేల మందితో అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించిరి. మూడువేల రూపాయల ఖరీదుగల గురుదేవుల సాహిత్య విక్రయంతో జ్ఞానయజ్ఞాన్ని నిర్వహించిరి. సామూహిక గురుదీక్షలు మరియు సంస్కారములు చేపట్టి భారతీయ సంస్కృతికి తిరిగి జవసత్వములనందించిన పొన్నూరు గాయత్రీ పరివార్ శాఖను చేతనా కేంద్రము అభినందించుచున్నది. అట్లే శాఖ పరివారాన్ని అనునిత్యము ఉత్సాహపరుస్తూ కావలసిన స్ఫూర్తిని గత దశాబ్దకాలము నుండి అందించుతూ, పరివార్ అభివృద్ధికి, సమాజ కళ్యాణానికి అత్యంత శ్రద్ధాసక్తులతో సేవలందించుచున్న శ్రీ శ్రీనివాసరావుగారిని, వెంకటేశ్వర్లు గారిని మరియు వారి వెంట నడిచెడి అనేకమంది పరివారమును గాయత్రీ చేతనా కేంద్రము అభినందించుచూ, పూజ్యగురుదేవుల మరియు మాతాజీల ఆశీస్సులు వారిపై సర్వవేళల సర్వావస్థలయందు కురుస్తుండాలని ప్రార్థిస్తున్నది.

**విశ్వాసంతో చేసే ఏ పని అయినా సఫలం అవుతుంది.**

## గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్

యుగఋషి పరమపూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల జన్మశతాబ్ది వేడుకల ప్రారంభము మరియు వసంత పంచమి సందర్భముగా గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్ ఈ క్రింది కార్యక్రమాలను చేపట్టిరి.

4వ తేది ఫిబ్రవరి 2011న గాయత్రీ పరివార్ నగర ప్రముఖులతో సమావేశము జరిపి, కళాశాలల విద్యార్థులను కూడా భాగస్వాములను చేసి 6 ఫిబ్రవరి 2011న ప్రభాతభేరి కార్యక్రమము ద్వారా నగర ప్రజలను చైతన్యపర్చెడి కార్యక్రమాన్ని రూపొందించుట జరిగినది.

6 ఫిబ్రవరి 2011 ఉదయము 8 గంటలకు ప్రభాత భేరి యాత్ర పి.ఎన్.ఎమ్. హైస్కూలు బాలబాలికలు, తదితర సంస్థల విద్యార్థులతో కలసి శోభాయమానముగా అలంకరించిన ప్రచార రథము తోడురాగా నగర వీధులలో పూజ్యగురుదేవుల జన్మశతాబ్దిని తెలియజేసే బ్యానర్లతో జయ జయ ధ్వానాలతో అత్యంత ఉత్సాహ భరితంగా సాగినది. పుర ప్రముఖులైన శ్రీ బి. హనుమంతరావు మాజీ మున్సిపల్ చైర్మన్ కూకట్‌పల్లి, ప్రముఖ ప్రసంగీకురాలు శ్రీమతి సత్యవాణి మున్నగువారు పాల్గొనిరి. ఈ ప్రభాతభేరి యాత్రకు దక్షిణ భారత గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులు శ్రీ అశ్విని సుబ్బారావు దంపతులు యాత్రలో ఆసాంతము పాల్గొన్నారు, యాత్రకు నాయకత్వం వహించారు. ఈ యాత్రలో 200 మంది పాల్గొన్నారు. సాయంత్రం 6 గం॥లకు దీపయజ్ఞము నిర్వహించారు.

7, ఫిబ్రవరి 2011న ఉ॥ గం॥ 5.30 ని॥ల నుండి సా॥ గం॥ 5.30 ని॥ల వరకు అఖండ గాయత్రి జపం జరిగినది. 50 మంది పాల్గొన్నారు. సాయంత్రం ప్రజ్ఞాపురాణ కార్యక్రమాన్ని విక్రమ్ చక్కగా నిర్వహించి శ్రోతలను ఉత్తేజపరచారు.

8, ఫిబ్రవరి 2011న 9 కుండములతో గాయత్రీ మహా యజ్ఞము అత్యంత వైభముగా జరిగినది.

## జగిత్యాలలో

08.02.2011 జగిత్యాలలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో వసంత పంచమి సందర్భంగా పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. శ్రీ ఆడెపు గంగారాం యజ్ఞ కార్యక్రమం నిర్వహించగా శ్రీ వేముల రాంరెడ్డి, సుగుణాకర్, గడ్డం బుచ్చిరెడ్డి, అశోక గుప్తగార్లు సహకరించారు.

## ఓల్డ్ బోయినపల్లిలో

గాయత్రీ ప్రజ్ఞా పీఠము, స్వర్ణధామనగర్ కాలనీవారి ఆధ్వర్యములో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞము స్వర్ణధామనగర్, ఓల్డ్ బోయినపల్లి, సికింద్రాబాద్‌లో 6 ఫిబ్రవరి 2011న అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించబడింది. యజ్ఞ కార్యక్రమంలో 600 మంది పాల్గొన్నారు. 150 గృహాల్లో దేవస్థాపన జరిగినది. మహిళా మండలి స్థాపన కూడా జరిగినది. విక్రమ్ యజ్ఞాన్ని నిర్వహించగా, గాయత్రీ పరివార్ దక్షిణ భారత ప్రధాన సంచాలకులు శ్రీ అశ్విని సుబ్బారావుగారు ప్రవచనము చెప్పిరి. దాదాపు 8000 రూపాయల సాహిత్యము విక్రయించ బడింది, 400 యుగశక్తి గాయత్రి మాసపత్రికల విక్రయం జరిగింది.

## కామారెడ్డిలో

2011 నూతన సంవత్సరంలో కామారెడ్డి గాయత్రీ ప్రజ్ఞాపీఠం వారు ప్రచార నిమిత్తం 12,000 గాయత్రి పరివార్ క్యాలెండర్స్ మరియు 1,200 యుగశక్తి గాయత్రీ పత్రికలు కామారెడ్డి వాసులకు ఉచితంగా పంచారు.

## గుత్తిలో గాయత్రి పరివార్ కార్యాలయం

అనంతపురం జిల్లా గుత్తి ఆర్.ఎస్. మెయిన్‌బజార్‌లో శ్రీ కన్యకాపరమేశ్వరి కాంప్లెక్స్‌కు ఎదురుగా డో.నెం.5-29లో మొదటి అంతస్తునందు 19.01.2011 తేదీన గాయత్రి పరివార్ కార్యాలయం శ్రీ మధుసూదన్ స్థానిక యం.ఎల్.ఎ., శ్రీ వెంకటేశులు రాయలసీమ కో-ఆర్డినేటర్ జ్యోతి ప్రజ్వలన గావించడంతో ప్రారంభమయ్యింది. సాహిత్య విక్రయశాలకు శ్రీ రాజీవ్ మాధురి దంపతులు 30,000 రూపాయల సాహిత్యానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి 300 మంది పరిజనులు పాల్గొన్నారు.

## గుత్తిలో

అనంతపురం జిల్లా గుత్తిలో పూజ్యగురుదేవుల జన్మశతాబ్దిని పురస్కరించుకుని 24 కుండముల గాయత్రి మహాయజ్ఞం నిర్వహించబడింది.

18.01.2011న 108 కలశాలతో శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించబడింది.

19.01.2011న వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం శ్రీ మధుసూధన్ యం.ఎల్.ఎ. గారిచే జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభం అయ్యింది. శ్రీ వెంకటేశులు యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**కష్టంలోనే మనిషి శక్తియుక్తులు బయటకు వస్తాయి.**

ఈ కార్యక్రమమునకు శ్రీమతి కోట్రకే నాగరత్నమ్మ గారు, శ్రీ కాసుల సుబ్బయ్యగారు (ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంటు), శ్రీ మెంటా శ్రీనివాసులు, శ్రీమతి మెంటా అరుణకుమారి, శ్రీ మంగీలాల్ రాజ్‌పురోహిత్ శ్రీ గౌర్‌మోహన్, శ్రీ ఫూల్‌సింగ్, చంద్రశేఖర్ సహకరించారు. సుమారు 800 మంది పరిజనులు ఈ యజ్ఞ కార్యక్రమములో పాల్గొన్నారు. 2000 రూపాయల సాహిత్య విక్రయం జరిగింది.

## అమలాపురంలో

శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేది హైదరాబాద్ గాయత్రీ చేతనా కేంద్ర ప్రతినిధి శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్ గార్ల ఆధ్వర్యంలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞములు జరిగాయి. ఈ మహాయజ్ఞములకు శ్రీ రామనందస్వామి ఏర్పాట్లు చేశారు.

07.12.2010న అమలాపురంలో
08.12.2010న రంగాపురంలో
09.12.2010న అనపర్తిలో
10.12.2010న తణుకులో
14.12.2010న రాజమండ్రిలో

17.12.2010 అమలాపురం మండలం ఓడలరేవు గ్రామంలోని శ్రీ వీరబ్రహ్మంగారి మఠమందు ముక్కోటి ఏకాదశి శుభ సందర్భమున నవకుండీ గాయత్రీ మహా యజ్ఞం నాగమణి, ఎన్.కుమారిగార్లు నిర్వహించారు. సుమారు 60 మంది ఈ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. గాయత్రీ మంత్రదీక్ష తీసుకున్నారు.

22.12.2010 కోటేని మండలంలోని కుండలేశ్వరం గ్రామంలోని ఉమాసమేత కుండలేశ్వర స్వామి ఆలయమందు పంచ కుండీ గాయత్రీ మహా యజ్ఞమును కె. నాగమణి, దుర్గ, కుమారి గార్లు నిర్వహించారు. గ్రామంలోని స్కూలు పిల్లలందరు ఈ యజ్ఞ కార్యక్రమములో పాల్గొన్నారు. గాయత్రీ మంత్రమును నేర్చుకున్నారు. రోజు చేస్తామని పేర్లు ఇచ్చారు.

## భీమిలిలో

పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది ప్రారంభోత్సవ సందర్భముగా వసంత పంచమి కార్యక్రమం భీమిలి దుర్గా గాయత్రీ శక్తి పీఠంలో ఫిబ్రవరి 6,7,8 తారీఖులలో నిర్వహించబడ్డాయి. 6వ తారీఖు పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం కార్యక్రమంలో 25 మంది పాల్గొన్నారు. 7వ తారీఖు సాయంత్రం 24 దీపాలతో దీప యజ్ఞం, 8వ తారీఖు గాయత్రీ యజ్ఞం నిర్వహించబడినాయి. ఈ కార్యక్రమాలు శ్రీమతి భారతి, డా॥ చంద్రశేఖర్ నిర్వహించగా శ్రీమతి సరళ, చిన్నా సహకరించారు.

## చీరాలలో

చీరాలలో జన్మశతాబ్ది ప్రారంభ కార్యక్రమ వివరములు.

06.02.2011 ప్లకార్డుతో, బ్యానర్లు, జండాలతో శోభాయాత్ర శోభాయమానంగా జరిగింది.

07.02.2011 ఉదయం గం॥ 6.45 ని॥ల నుంచి 08.02.2011 ఉదయం గం॥ 6.45 ని॥ల వరకు జరిగిన అఖండ గాయత్రీ మంత్ర జపంలో సుమారు 200 మంది పాల్గొన్నారు. 3 లక్షల జపం జరిగింది.

08.02.2011 చీరాల పాపరాజుగారి తోటలోని గోశాలలో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. సుమారు 600 మంది పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని శ్రీయుతులు డి.వి.ఆర్. మూర్తి, సి.హెచ్. చలపతిరావు, లక్ష్మణరావు, జనార్దనరావు, బాపయ్య, సవాయిసింగ్ రాజపురోహిత్, ఆంజనేయులు, ఆండళమ్మ, ప్రసాద్, శ్రీమన్నారాయణమూర్తి, రమాదేవి, కుమారి తదితరులు సహాయ సహకారాన్ని అందించారు.

ఈ సందర్భంలో చీరాల శాఖ వారు ప్రచురించిన జన్మశతాబ్ది మంత్రలేఖన అనుష్ఠాన పుస్తకాన్ని కారంచేడుకు చెందిన శ్రీశ్రీశ్రీ ప్రణవానంద స్వామి వారిచే ఆవిష్కరించబడింది. మార్చి 2 నుంచి ఏప్రిల్ 12 వరకు జరిగే మంత్ర లేఖన అనుష్ఠానమునకు 6000 మంది చేత ఈ అనుష్ఠానం చేయించాలని సంకల్పంతో మంత్ర లేఖన పుస్తకములు ఉచితంగా అందజేయబడుతున్నాయి.

## ఒంగోలులో

08.02.2011న వసంత పంచమి శుభసందర్భమున ఒంగోలులోని బాపూజీ గోశాలలో శ్రీ నాగేశ్వరరావు–ప్రెసిడెంట్, శ్రీ సుబ్బారావు–సెక్రటరీ ఆధ్వర్యంలో శ్రీ మలసాని వెంకటేశ్వర రావు పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. సుమారు 90 మంది పాల్గొన్న ఈ కార్యక్రమానికి శ్రీమతి కోటలక్ష్మీ సహకరించారు.

## రామేశ్వర తీర్థము - పరిశుభ్రపరచుట

19 నుండి 23 జనవరి 2011 వరకు దక్షిణ కాశీగా పేరొందిన రామేశ్వర తీర్థధామమును పరిశుభ్రపరచెడి కార్యక్రమాన్ని గాయత్రీ పరివార్ శాంతికుంజ్, హరిద్వార్ సారథ్యములో గాయత్రీ పరివార్ సభ్యులు దిగ్విజయముగా పూర్తిగావించిన దానిపై ఒక సమగ్ర నివేదికను ఈ క్రింద పొందుపరుచున్నాము.

**జ్ఞానకర్మల సమన్వయం సగ్రమతకు సోపానం.**

యుగఋషి, వేదమూర్తి పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యులు గతంలో రామేశ్వర తీర్థాన్ని దర్శించి 5 కుండముల గాయత్రీ మహా యజ్ఞమును నిర్వహించిరి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, పూజ్య గురుదేవుల పాద ధూళిసోకి తిరిగి పునీతమైన ఆ తీర్థాన్ని గురుదేవుల జన్మశతాబ్ది వేళ తిరిగి ఆ పవిత్రతను నెలకొల్పనెంచి, గాయత్రీ పరివార్ శాంతికుంజ్ ఒక చక్కని కార్యాచరణ ప్రణాళికను మొదటి దశలో అమలు చేయుట జరిగినది. రామాయణ కాలములో, రావణునిచే అపహరింపబడి లంకలో (నేటి శ్రీలంక) బంధింపబడిన సీతామాతను రావణ చెరనుండి విడిపించుటకై శ్రీరాముడు రామేశ్వర ద్వీపములో లక్ష్మణ సమేతముగా పాదము మోపిరి. తూర్పున బంగాళాఖాతము పడమర అరేబియా సముద్రముల చేత చుట్టబడియున్న ద్వీపము – వానర సేన సాయముతో సముద్రముపై సేతువును నిర్మించతలపెట్టిన శ్రీరాముడు 7 దినములు సముద్రుని ప్రార్థించుచూ దర్భాసనముపై శయనించిరి. రాముని ప్రార్థనను ఆలకించని సముద్రునిపై కోపగించుకొని శ్రీరాముడు తీవ్రావేశముతో ధనుష్టంకారాన్ని చేయగా, సముద్రుడు భీతిచెంది శ్రీరాముని ఎదుట మోకరిల్లి, రామేశ్వరం వద్ద తన సహజ అలల ఉధృతిని తగ్గించుకొని శాంతముగా నుండి, సేతు నిర్మాణమునకు రామునితో సహకరించెదనని మాట ఇచ్చినారు. తదనుగుణముగా రామేశ్వరం ద్వీపములో సముద్రుని సహజఘోష విన్పించదు. శాంతముగా ఉంటుంది. రామేశ్వర ద్వీపములోనే ధనుష్కోటి అనెడి ప్రదేశము వద్ద సేతు నిర్మాణము జరిగినది. అచ్చటి నుండి లంకద్వీపము 20 కి.మీ. దూరములోనున్నది. బ్రిటీష్ వారి పాలనలోనే ధనుష్కోటి వరకు రైలు మార్గము నిర్మించిరి. 1966 ప్రాంతములో సంభవించిన తుఫానులో ధనుష్కోటి రైలుస్టేషన్ పోస్టాఫీసు, చర్చి తదితర కట్టడములు ధ్వంసము కాగా శిథిలములు నేటికి మిగిలి ఉన్నాయి. అచ్చటనే నీటిలో తేలియాడే రాయిని ఒక మత్స్యకారుని గుడిసెలో నీటితొట్టెలో ప్రదర్శించియుండుట నేటికిని చూడవచ్చును. ఊలబెండులా నీటిలో తేలియాడుతూ ఉంటుంది. ఇటువంటి రాళ్ళనే ఉపయోగించి శ్రీరాముడు సేతువును నిర్మించినాడని తెలియుచున్నది. నలుడు, నీలుడు అనెడి వానరసేనలోని వాస్తు నిపుణుల పర్యవేక్షణలో సేతు నిర్మాణం జరిగినదట.

రావణ సంహార అనంతరం, శ్రీరాముడు సీతాసమేతంగా రామేశ్వరానికి వేంచేశాడు. బ్రాహ్మణ జాతికి చెందిన రావణుని సంహరించుటచే బ్రహ్మ హత్యాదోషము నుండి విముక్తుడగుటకై శ్రీరాముడు శివుని అర్చింపనెంచి, ముహూర్త నిశ్చయముగావించి, హనుమంతుని శివలింగమును తెమ్మని ఆజ్ఞాపించినాడు. ఆంజనేయుడు కాశీకి వెళ్ళి సరియైన శివలింగమునుగానక, శివుని స్తుతించగా శివుడు ప్రసన్నుడై ఆత్మలింగాన్ని అందించాడు. కాశీలోని లింగముతోపాటు శివుని ఆత్మలింగాన్ని కూడా తెచ్చెడి ప్రయత్నములో కాలయాపన జరిగి ముహూర్తవేళ దాటినది. ముహూర్తానికి తప్పనిసరిగా శివుని అర్చింపదలచి, సీతాదేవి చొరవతో ఇసుకలింగాన్ని ఏర్పాటు చేసినాడు శ్రీరాముడు. ఈ రీతిలో రామేశ్వర పుణ్య ధామములో 3 లింగాలు భక్తులకు దర్శనమిస్తూ ఉంటాయి. విభీషణునికి పట్టాభిషేకం జరిగిన ప్రదేశంలో విభీషణ ఆలయాన్ని నిర్మించుట జరిగినది.

కేరళలోని అయ్యప్ప స్వామిని దర్శించివచ్చెడి భక్తులు తదితర యాత్రికులు తిరుగు ప్రయాణంలో రామేశ్వరంలోని రామనాథస్వామిని దర్శించుట ఆనవాయితీ. సముద్రంలో తీర్థస్నానమాచరించెడివేళ ధరించిన బట్టలను సముద్రతీరంలో విడచి వెళ్ళుటచే ఆ విడచిన బట్టలు గుట్టలు గుట్టలుగా సముద్ర తీరమంతటా ఒకటిన్నర కి.మీ. పొడవున పేరుకొన్నవి. అట్లే రామనాథ క్షేత్రములోపలి తీర్థముల చుట్టూరా గడ్డి గాదం పెరిగి మురికి చేరినది.

గాయత్రీ పరివార్, రామేశ్వరంలోని రోటరీక్లబ్ వారితో చేతులు కలిపి దాదాపు 100 నుండి 125 ట్రాక్టరు ట్రక్కులలో ఈ దుర్గాంధాన్నంతా తరలించుట జరిగినది. ఈ సేవా కార్యక్రమంలో 500 మంది వరకు పరివార్ సభ్యులు భారతదేశమంతటి నుండి పాల్గొనివారు – మన రాష్ట్రము నుండి 40 మంది వరకు పాల్గొనినారు. వీరిలో 26 మంది శ్రీ పేరిశాస్త్రిగారి నాయకత్వంలో పాల్గొనిరి.

ఛత్తీస్‌గడ్‌లోని బిలాస్‌పూర్ నుండి 130 మంది పాల్గొనినారు. మధ్యప్రదేశ్ రాజస్థాన్, బీహార్, జార్ఖండ్, ఒరిస్సా, అరుణాచల్, ఉత్తరాఖండ్, కర్నాటక మున్నగు రాష్ట్రాల నుండి కార్యకర్తలు వచ్చారు. గుజరాత్ నుండి వైద్యబృందము విచ్చేసి ఉచిత వైద్య కేంద్రాన్ని నిర్వహించిరి.

శాంతికుంజ్ నుండి డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌జీ, శ్రీ పరమానంద ద్వివేది మరియు శ్రీ ఉత్తమ్ గార్లు పాల్గొన్నారు. 22వ తేది సాయంత్రం దీపయజ్ఞము, 23వ తేది 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞ పూర్ణాహుతితో శిబిరము ముగిసినది.

★★★

**సజ్జనుల సంపద సద్వినియోగం అవుతుంది.**

అక్షరాల ఆట

# పదగాయత్రి-5

నిర్వహణ : సాధన నరసింహాచార్య

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | X | 5 | 6 | 7 |
| 8 | | | | X | 9 | | |
| 10 | | | | X | X | 11 | |
| X | 12 | | X | 13 | 14 | | 15 |
| 16 | X | X | 17 | | | | |
| X | 18 | X | | X | X | X | |
| | | 19 | X | 20 | | X | |
| 21 | | | | | 22 | | |

### పదగాయత్రి-4 సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| (1) బా | (2) స | (3) ర | X | (4) వి | (5) వే | చ | (6) న |
| (7) ద | మ | ము | X | X | ద | X | స్త్రీ |
| ర | X | క | తి | ప | న | (8) ధీ | (9) స్వా |
| బం | X | సూ | X | X | X | (10) ర | తం |
| (11) దీ | (12) క్ష | X | X | (13) నాం | (14) ది | X | త్ర్యం |
| X | (15) మా | రు | X | X | (16) న | డు | మ |
| X | (17) భి | దు | దుం | X | స | X | ర్థా |
| (18) ప | క్ష | (19) ము | X | (20) సి | రి | ప | తి |

పేరు : ..........................................

చిరునామా : ..........................................

..........................................

...................... పిన్ కోడ్ : ......................

ఫోన్ నెం : ..........................................

**ఆధారాలు**

**అడ్డం**

1. కవిసార్వభౌముడు (4)
5. వేదమంత్రాన్ని ఇలా కూడా అంటారు ఇదొక కాయ (అటునుండి) (3)
8. పొదగబడినది (4)
9. శ్రీకృష్ణ దేవరాయలవారి బిరుదు మూరు ...... గండ (3)
10. తడబడిన నగరం (4)
11. గారాబమే ఆద్యంతాలు (2)
12. అటునుండి 'ఉద్యానం' ఆద్యంతాలు (2)
15. మొదటి అక్షరం మెలికలు తిరిగిన సారంగము (4)
16. చివర లోపించిన ఇష్టం (4)
17. పవిత్ర జలం (అటునుండి) (5)
19. వికల్పానికి వ్యతిరేకం (అటునుండి) (4)
20. అక్షరంలోపించిన ఆజ్ఞ (2)
21. నిరంతరం పనిధ్యాస కల్గినవాడు (8)

**నిలువు**

1. రాబోయే ఉగాది (3)
2. మోసం చేస్తూ, అమాయకత్వం నటించే స్త్రీ తారుమారయ్యింది (4)
3. 'తీవ్రతరం' పదానికి పర్యాయపదం 'రేవు' లోపించి చెల్లాచెదురయ్యింది (4)
4. చెల్లాచెదురైన మధ్యప్రదేశం (3)
5. శృంగారకేళిలోని మొదటి రెండక్షరాలు క్రిందనుండి (2)
6. విలాసంగా (5)
7. శ్రీనాథుని ప్రసిద్ధ పద్యపాదం ............... ము పార్వతిచాలునె (8)
13. అక్షరం లోపించిన నాశనం (క్రిందనుండి)
14. నెమ్మదిగా నడిచే స్త్రీని "…. యాన" అని అంటారు గ్రాంధికంలో (2)
17. మౌని (2)
18. స్వీకరించేవాడు (3)
19. తేడా (క్రింద నుండి) ఆద్యంతాలు (2)
20. ఆచూకీ తీయడం (2)
21. 'వ్రతకల్పం' లోని చివరి అక్షరాలు తిరగబడ్డాయి (2)
22. సన్యాసి (క్రింద నుండి) (2)

**నిబంధనలు :**

1. *సమాధానాలు "కీ"తో సరిపోవాలి.*
2. *కూపన్లు చేరవలసిన చివరి తేదీ 18-03-2011*
3. *పత్రికలో పైన ఇచ్చిన కూపన్‌నే పంపవలెను.*
4. *దిద్దుబాట్లు / కొట్టివేతలు / తుడుపులు ఉండరాదు.*
5. *తెల్లకాగితాలు / జిరాక్స్ కాపీలు అనుమతించబడవు.*
6. *అన్ని కరెక్టు అయిన ఎంట్రీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నచో లాటరీ ద్వారా ఎంపికచేసి* ***ప్రథమ బహుమతి రూ. 100/-లు, ద్వితీయ బహుమతి రూ. 50/-లు*** *ఇవ్వబడును.*
7. *తపాలశాఖవారి ఆలస్యానికి పత్రిక బాధ్యత వహించదు.*
8. *బహుమతుల విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే. ఎలాంటి వివాదాలకు తావులేదు.*
9. *పేరు, చిరునామాలు స్పష్టంగా, పిన్‌కోడ్‌తో ఫోన్‌నెంబరుతో సహా వ్రాయాలి.*

**పదగాయత్రి-4 విజేతలు**

'కీ' సొల్యూషన్ ప్రకారం అన్ని కరెక్టుగా ఉన్న సమాధానాలు మూడు ఎంట్రీలు వచ్చాయి. అందువల్ల లాటరీ పద్ధతిలో విజేతలను నిర్ణయించడమైనది.

మొదటి బహుమతి : **శ్రీ ఎన్.సి.ఎస్. శర్మ,** హైదరాబాద్

ద్వితీయ బహుమతి : **శ్రీ కదలి అప్పారావు,** చీరాల

**ఎంట్రీలు పంపవలసిన చిరునామా**

**పదగాయత్రి C/o. యుగశక్తి గాయత్రి, అశ్విని హౌస్ ప్రక్కన, గాయత్రీ చేతనా కేంద్రం, మూసాపేట, హైదరాబాద్-18.**